ఓమ్

శ్రీః

శ్రీనివాసార్యస్య పౌత్రేణ, రఘునాథయజ్వన స్తనయేన,

అరిశాలఘాణ  వేంకటాధ్వరినా విరచితం

అనులోమవిలోమకావ్యమ్

# రాఘవయాదవీయమ్.

( స్వవిరచిత వ్యాఖ్యానసహితమ్ )

శా. శ. 1943 తమవర్షే ప్లవే, మాఘ బహుళ చతుర్దశ్యాం, శివరాత్రితిథౌ.

01. 03. 2022.

ఆంధ్రవివృతికారః

మార్కణ్డేయప్రసాదః

101, ప్రైమ్ ఎంక్లేవ్,

అలకాపురీ-భాగ్యనగరమ్-500035

చరవాణీసంఖ్యా - 9440260163.

అస్మాకం పిత్రోః

కథాశేషయోః  జోగాంబాసుబ్బరాయయోః స్మృత్యర్థ మితి

కృతి రియం సమర్పితా.

ఓమ్

శ్రీః

శ్రీనివాసార్యస్య పౌత్రుడు, రఘునాథయజ్వపుత్రుడు,

అరిశాలఫాణ  వేంకటాధ్వరి రచించిన

అనులోమవిలోమకావ్యము

# రాఘవయాదవీయమ్.

(స్వవిరచిత వ్యాఖ్యానముతో)


తెలుగు వివృతికారుడు

మార్కణ్డేయప్రసాద్.

101, ప్రైమ్ ఎంక్లేవ్,

అలకాపురి - భాగ్యనగరము

తెలంగాణ - 500035

చరవాణి - 944020163


మా తల్లిదండ్రులు,

కీర్తిశేషులైన  జోగమ్మ, సుబ్బారావు వారల స్మృతిగా ఈ కృతి సమర్పితము

శా. శ. 1943 - ప్లవ మాఘ బహుళ చతుర్దశి - శివరాత్రి.

01. 03. 2022.

# విషయసూచిక


| వరుస | విషయము | పుట |
|---|---|---|
| 1 | విజ్ఞాపనమ్ | 7 |
| 2 | వినతి | 9 |
| 3 | రాఘవయాదవీయమ్  - తెలుగు వివరణము | 11 |
| 4 | కొసరు | 181 |
| 5 | ఉపసంహారః. | 182 |
| 6 | రాఘవయాదవీయములో వాడిన ఏకాక్షరపదాలు, విశిష్టపదాలు, క్రియాపదాలు. | 184 |

## విజ్ఞాపనమ్

కస్యాపి పద్యస్య, తస్య ప్రారంభాత్ అవసానపర్యంతం అక్షరాణాం సామాన్యక్రమేణ అనులోమేన పఠనా దేకోఽర్థ శ్చ, తస్య అంతాదారభ్య ప్రారంభపర్యంతమ్ అక్షరాణాం విలోమక్రమేణ పఠనా దన్యోఽర్థ శ్చ ద్యోతతే చేత్, తత్ పద్యం అనులోమవిలోమపద్యమితి కథ్యతే. చిత్రకవితాభేదోఽయమ్.

అనేనైవ స్పష్టం ఖలు తాదృశం పద్య మేకం రచయితుమపి దుష్కర మితి. తదా, బహుభిః పద్యై రనులోమక్రమేణ ఏకమర్థం చ, విలోమక్రమేణాన్య మర్థం చ దర్శయత్, అనులోమార్థే నైకాం కథాం చ, విలోమార్థేనాన్యాం కథాం చ నిర్వహత్ కావ్యం నామ మహాద్భుతం చ, తస్య కర్తా కవి ర్మహాన్ సమర్థో నను!

మహావిద్వత్కవినా వేంకటాధ్వరిణా రచితం రాఘవయాదవీయాఖ్యం తాదృశమద్భుతమేవ అనులోమవిలోమకావ్యమ్.

తత్కావ్య మహం చిరవర్షపూర్వ మపఠమ్ . కింతు తస్య వ్యాఖ్యా న లబ్ధా యతో మమ తదా తత్కావ్యం పాషాణప్రాయ మేవాసీత్. తదాప్రభృతి గ్రంథోఽయం

సటీకో లభ్యతే కిమితి సాపేక్ష ఏవ వర్తే.

అచిరాదహం కంచిత్ గ్రంథం మృగయమాణః యదృచ్ఛయైకం పుస్తక మపశ్యం యస్మి న్నన్యగ్రంథద్వయేన సహ తదేవ రాఘవయాదవీయం అనులోమవిలోమ కావ్యం స్వయం కవినా రచితేన సంస్కృతవ్యాఖ్యానేన చ సహితం ముద్రితం. అస్మై నామ ఖలు చిరనిరీక్షిత మితి, అవిలంబం సానంద మామూలాగ్ర మపఠమ్.

అత్ర విశేషో వాచ్యః. కావ్య మిత్యేవ అస్మిన్ శతశః పద్యాని న సంతి, కింతు త్రింశతిరేవ. ఉపరి, అనులోమవిలోమపాఠదుష్కరనియమకారిత్వాత్, (అకారయత్, సంభవిష్యతి, దర్శయామాస ఇతివత్) బహ్వక్షరక్రియాపదాని వా, పదే పదే (రుక్మిణీ,

కృష్ణః, రావణః, సుగ్రీవః, విశ్వామిత్రః ఇతివత్) నామ వాచకాని వా న ప్రయుజ్యంతే. కేచి దప్రసిద్ధధాతవశ్చ, ఏకాక్షరపదాని చ భూయిష్ఠం సంతి.

అథ సవ్యాఖ్యానోఽపి బాలానాం దుర్బోధః ఖల్వయం గ్రంథ స్తతః కవికృత స్వీయవ్యాఖ్యానస్య అసర్వసులభస్య ఆంధ్రభాషాయాం వివృతిః రచితా చేత్, మాదృశానా మన్యేషాం చ మహా నుపయోగో భవతీతి, కావ్య పఠనానంతరం మమ హృది ఏకః ఊహో జాతః. తతో యథాశక్తి సంక్షేపేణ వివరణ మరచయమ్.

కేవలం చిత్రకవితావిన్యాసదిదృక్షూణాం తథాపి సంస్కృతభాషాపాటవ హీనానామ్ బాలానామేవ ప్రయోజనమనేనేతి యథామూలం నాతివిస్తర మేవ అలిఖమ్. సమాసాస్తు విశదీకృతాః. అత ఏవ గ్రంథోఽయ మేతావా నభవత్.

అత్ర సంజాతాన్ మాదృశలఘుబుద్ధిసహజాన్ ప్రమాదాన్ సౌహార్దేన క్షమధ్వ మితి విదుషః సవినయ మభ్యర్థయే.

అస్య వివరణస్య లేఖనాత్ లబ్ధోత్సాహోఽహ మేవమేవ, ఏతత్కావ్య సదృశస్య దైవజ్ఞసూరివిరచితస్య రామకృష్ణవిలోమకావ్యస్య వ్యాఖ్యానస్యాపి సంక్షేపవివరణం కర్తు మచిరేణైవ యతిష్యే.

మమ సర్వాన్ గ్రంథానివ గ్రంథ మముం చ మమ స్వస్రీయాయాః వైష్ణవీకృష్ణాయాః స్మృత్యర్థం మయా భ్రియమాణాయామ్ జగద్వేదికాయాం న్యక్షిపమ్. www.vyshnavikrishnamemorial.in ఇత్యత్ర పశ్యత.

విద్వద్విధేయః భాగ్యనగరే,

మార్కణ్డేయప్రసాదః.

ప్లవ మాఘ బహుళచతుర్దశ్యాం, శివరాత్రితిథౌ. 01. 03. 2022.

# వినతి

ఒక పద్యాన్ని మొదటినుండి చివరకు సాధారణపద్ధతిలో అంటే, అక్షరాలను అనులోమంగా చదివితే ఒక అర్థము, చివరినుండి మొదటికి అంటే, అక్షరాలను విలోమంగా చదివితే మరొక అర్థము, వచ్చినట్లైతే, ఆ పద్యాన్ని అనులోమవిలోమపద్యం అంటారు. ఇది చిత్రకవితలో ఒక రకం.

అలాంటి పద్యం ఒకటి వ్రాయాలన్నా దుష్కరమేనని దీనినిబట్టే తెలుస్తున్నదిగదా! మరి, చాలపద్యాలతో, అనులోమపాఠంలో ఒక అర్థంతో ఒక కథను, విలోమపాఠంలో మరొక అర్థంతో మరొక కథను చెప్పే కావ్యం అంటే, అది ఒక మహాద్భుతం, దానిని వ్రాసిన కవి మహాసమర్థుడు గదా!

గొప్ప విద్వత్కవి ఐన వేంకటాధ్వరి రచించిన రాఘవయాదవీయం అలాంటి అనులోమవిలోమకావ్యమే.

ఆ కావ్యాన్ని నేను చాల ఏళ్ళక్రితమే చదివానుగాని, దాని వ్యాఖ్య దొరకక పోవటంతో, అది నాకు అప్పుడు ఇనుపగుగ్గిళ్ళుగానే ఉండిపోయింది. అప్పటి నుండి, ఈ కావ్యం వ్యాఖ్యతో దొరకుతుందేమోనని ఆశతోనే ఉన్నా.

ఇటీవల ఏదో గ్రంథంకోసం వెదకుతున్న నాకు ఒక పుస్తకం తగిలింది. దానిలో, ఇంకొక రెండు గ్రంథాలతోపాటు కలిపి ముద్రించిన ఈ రాఘవయాదవీయం కనబడ్డది. అదృష్టవశాత్, కవి స్వయంగా వ్రాసిన వ్యాఖ్యానంతో కూడ ఉన్నది అది. దీనికోసం గదా ఎంతోకాలం నుండి ఎదురు చూస్తున్నది అనుకొని, వెంటనే సంతోషంగా కావ్యమంతా చదివాను.

ఇక్కడ ఒక మాట చెప్పాలి. కావ్యం అన్నారుగదా అని దీనిలో నూరులకొద్ది పద్యాలు ఉండవు. దాదాపు ముప్పది మాత్రమే ఉంటాయి. పైగా, అనులోమవిలోమపాఠం అనే కఠిననియమమం కారణంగా, (అకారయత్, సంభవిష్యతి, దర్శయామాస వంటి) పెద్దపెద్ద క్రియాపదాలు ఉండవు. (రుక్మిణి,

కృష్ణుడు, రావణుడు, సుగ్రీవుడు వంటి) నామవాచకాలు పదే పదే రావు. కొన్ని మారు మూల ధాతువులు, ఏకాక్షరపదాలు, ధారాళంగా వాడబడుతాయి.

వ్యాఖ్యానంతో ఉన్నప్పటికీ ఇది బాలురకు అర్థం కావటం కష్టం. కవి తానే వ్రాసినవ్యాఖ్య కూడ అందరకూ సులభంగా తెలిసేటట్లు లేదు. కాబట్టి దీనికి తెలుగులో వివరణం వ్రాస్తే నాబోటివాళ్ళకందరకు ఎంతో ఉపయోగం గదా అని, దీనిని చదివిన తరువాత నాకొక ఆలోచన వచ్చింది. అందుకే చేతనైనంత మేరకు, సంక్షిప్తంగా, వివృతిని వ్రాసాను.

చిత్రకవితావిన్యాసం ఎలా ఉంటుందో చూచే కోరిక ఉన్నప్పటికీ సంస్కృతభాషలో పెద్దగా ప్రవేశం లేని బాలప్రాయులకు మాత్రమే దీనివలన ప్రయోజనం గనుక, మూలంలో ఉన్నట్లుగానే, చేటభారతం చేయకుండ,వ్రాసాను. సమాసాలను మాత్రం పూర్తిగా వివరించా. అందుకే పుస్తకం ఇంతైంది.

నావంటి అల్పజ్ఞులకు సహజమైన తప్పులు ఏవైనా దీనిలో పడి ఉంటే,పెద్ద మనసుతో వాటిని క్షమించుడని విద్వాంసులకు సవినయాభ్యర్థనం.

ఈ వివరణం వ్రాయటంతో నాకు క్రొత్త ఉత్సాహం వచ్చింది. దానితో, ఇలాంటి అనులోమవిలోమకావ్యమే ఐన దైవజ్ఞసూరివిరచిత రామకృష్ణకావ్యానికి కూడ ఇలాగే వివరణ వ్రాయటానికి త్వరలోనే యత్నిస్తాను.

నా మిగిలిన పుస్తకాలలాగే దీనినికూడ, నేను నా మేనగోడలు వైష్ణవీకృష్ణ స్మృతిగా నడపుతున్న జగద్వేదికలో (వెబ్ సైట్ లో) ఉంచాను. www.vyshnavikrishnamemorial.in అనే చోట చూడండి.

మార్కణ్డేయప్రసాద్ . భాగ్యనగరము

ప్లవ మాఘబహుళచతుర్దశి. శివరాత్రి. 01.03. 2022.

# రాఘవయాదవీయమ్

## (అనులోమవిలోమకావ్యమ్ )

వేంకటాధ్వరికవి,తాను వ్రాసిన రాఘవయాదవీయం అనే అనులోమవిలోమ కావ్యానికి తానే వ్యాఖ్యానం వ్రాయబోతూ, తొలుత రెండు శ్లోకాలలో దేవతా స్మరణం చేస్తున్నాడు.

**శ్లో: కించిత్సంచింతయే గోపీకిలికించితవంచితమ్,**

**అంచితం జ్యోతి రమరై రంజనాద్రా వుదంచితమ్.**

ఇది అనుష్టుప్ చందస్సు.

అర్థం:

గోపీ-కిలికించిత-వంచితమ్ = గోపస్త్రీల శృంగారచేష్టలకు లోబడినది,

అంజన-అద్రౌ, ఉదంచితమ్ = అంజనాపర్వతం మీద విజృంభించినది,

అమరైః, అంచితమ్ =దేవతలచేత పుజించబడినది, ఐన,

కించిత్, జ్యోతిః, సంచింతయే = ఒకానొక అనిర్వచనీయమైన జ్యోతిని స్మరిస్తాను.

తన ఇష్టదైవమైన అంజనాద్రివాసి వేంకటేశ్వరుని స్మరించాడు కవి,వ్యాఖ్యాత ఐన వేంకటాధ్వరి. ఆ తరువాత మరొక దేవతాప్రార్థన చేస్తున్నాడు. ఐతే, ఇక్కడ ఒక చమత్కారం ఏమిటంటే, ప్రస్తుతకావ్యం రాఘవుడైన రాముడిని, యాదవుడైన కృష్ణుడిని, ఇద్దరను చెప్పుతున్నది కాబట్టి, ఈ ప్రార్థనను సైతం రాఘవుడికి, యాదవుడికి, ఇద్దరకూ వర్తించేటట్లు శ్లేషతో చేసాడు.

**శ్లో: భద్రోల్లాసం భాస్కరాపత్యవాహి-**

**న్యంతర్దీవ్యన్ న్యస్తవైర్యుగ్రబాణః,**

**నాథోఽహల్యానందహేతుః ప్రదత్తామ్**

**రాజీవాక్షో రాఘవో యాదవో వా.**

ఇది శాలినీవృత్తం. గణాలు - మ త త గ గ.   నాలుగు మీద యతి.

అర్థం:

రాఘువుని ప్రార్థన –

భాస్కర-అపత్య-వాహినీ-అంతః, దీవ్యన్ = సూర్యసంతతిపరంపరలో ప్రకాశిస్తూ ఉన్నవాడు/జయశీలుడైనవాడు,

న్యస్త-వైరి-ఉగ్ర-బాణః = వోదట్టబడిన శత్రువుల భీకరబాణములు గలవాడు,

అహల్యా-ఆనంద-హేతుః = అహల్య ఆనందానికి కారణమైనవాడు,

రాజీవ-అక్షః = పద్మములవంటి కన్నులు గలవాడు,

నాథః = రక్షకుడు ఐన

రాఘువః వా = రాముడుగాని,

యాదవుని ప్రార్థన -

భాస్కర-అపత్య-వాహినీ-అంతః, దీవ్యన్ = యమునానది మధ్యలో క్రీడిస్తూ ఉన్నవాడు,

న్యస్త-వైరి-ఉగ్ర-బాణః = వోదట్టబడిన వైరియును ఉగ్రుడును ఐన బాణుడు గలవాడు (భీకరశత్రువైన బాణుని గెలిచినవాడు),

హలి-ఆనంద-హేతుః = బలరాముడి ఆనందానికి హేతువైనవాడు,

రాజీవ-అక్షః = పద్మములవంటి కనులు గలవాడు,

నాథః = రక్షకుడు, ఐన

యాదవః, వా = కృష్ణుడు గాని,

భద్ర-ఉల్లాసం, ప్రదత్తామ్ =  క్షేమకరమైన ఉల్లాసాన్ని ఇచ్చుగాక!

దీనిలో క్రియాపదంలో కూడ మరొక చమత్కారం ఉంది. వా అంటే వికల్పం (=కాని) అనీ అర్థం చెప్ప వచ్చు, సముచ్చయం (=మరియు/కూడ) అనీ అర్థం చెప్ప వచ్చు. కాబట్టి, 'రాఘవో యాదవో వా' అంటే 'రాఘవుడు గాని యాదవుడు గాని' అని ఏకవచనమైనా అర్థం చెప్పవచ్చు, 'రాఘవుడును యాదవుడును' అని ద్వివచనమైనా అర్థం చెప్పవచ్చు. మొదటి సందర్భంలో కావలసిన ఏకవచనార్థకక్రియాపదంగాను, రెండవ సందర్భంలో కావలసిన ద్వివచనార్థక క్రియాపదంగాను కూడ సరిపోయే క్రియారూపం ' ప్రదత్తాం '. ఇది పరస్మై పదంలో లోట్ ప్రథమపురుష ద్వివచనరూపం, ఆత్మనేపదంలో లోట్ ప్రథమ పురుషైకవచనరూపం కూడ.

ఆ విధంగా, 'రాఘవుడుగాని యాదవుడుగాని ఉల్లాసమును ఇచ్చుగాక' అనే ఏకవచనార్థాన్ని, 'రాఘవుడును యాదవుడును ఇద్దరు ఉల్లాసమును ఇచ్చెదరుగాక' అని ద్వివచనార్థాన్ని కూడ ఇచ్చే వాక్యంతో దేవతాప్రార్థనచేసి, ఒక మెరపు మెరపించాడు కవి.

అసు క్షేపణే - ధాతువు. డు దాఞ్ దానే - ధాతువు .

తన కావ్యానికి తానే టీక వ్రాస్తున్నానని కవి చెప్పుకొంటున్నాడు.

**శ్లో: అనువర్ణితరామకృష్ణవృత్తై-, రనులోమప్రతిలోమవాచనాభ్యామ్,**
**కృతి ముల్లసితాం విధాయ పద్యై-, ర్వివృణోతి స్వయమేవ వేంకటార్యః.**

ఇది ఉపజాతి. శిశులీల.

అర్థం:

వేంకటార్యః = వేంకటార్యకవి,

అనులోమ-ప్రతిలోమ-వాచనాభ్యామ్ = మొదటినుండి తుదకు, తుదనుండి

మొదటికి, చదివే రెండు రకాల పాఠాలతో,

అనువర్ణిత-రామ-కృష్ణ-వృత్తైః = వర్ణింపబడిన రామకృష్ణుల కథలు గలవైన

పద్యైః = పద్యాలతో,

ఉల్లసితామ్, కృతిమ్, విధాయ = (ప్రకాశించిన)గొప్ప కావ్యాన్ని వ్రాసి,

స్వయమ్, ఏవ, వివృణోతి = తానే దానిని వివరిస్తున్నాడు, అంటే,

వ్యాఖ్యానిస్తున్నాడు..

ఇక్కడనుండి కావ్యం మొదలౌతుంది.

***

ఇక కావ్యం మొదలు.

మొదటి పద్యం. ఇది దేవతాస్తోత్రరూపమైన మంగళా చరణశ్లోకం. దానితోనే రాముడిని, కృష్ణుడిని, ఇద్దరను పేర్కొంటున్నాడు.

అనులోమము: రాఘవీయము.

1. **వందేఽహం దేవం తం శ్రీతం రంతారం కాలం భాసా యః**
   **రామో రామాధీ రాప్యాగో లీలామారాయోధ్యేవాసే**

ఇది విద్యున్మాలావృత్తము. గణములు – మ మ గ గ .

ఈ మంగళాచరణశ్లోకంలో, రాముడిని చెప్పుతున్నాడు..

పదవిభాగము :

వందే, అహమ్, దేవమ్, తమ్, శ్రీ-ఇతమ్, రంతారమ్, కాలం, భాసా, యః, రామః, రామా-ధీః, ఆప్య-అగః, లీలామ్, ఆర, అయోధ్యే, వాసే.

సమాసములు:

శ్రియా ఇతో యః సః, శ్రీతః. = శ్రీచేత పొందబడినవాడు, శ్రీతః.

రామాయామ్ ధీ ర్యస్య స, రామాధీః = రామయందు ధీ కలవాడు, రామాధీః.

ఆప్యాః అగాః యస్య స ఆప్యాగః. = ఆప్యములైన అగములు ఎవనికో వాడు, ఆప్యాగః

అయోధ్యాయాం జాతః అయోధ్యమ్ = అయోధ్యయందు కలిగినది, అయోధ్యమ్.

అన్వయము:

రామాధీః, ఆప్యాగః, యః రామః, ఆయోధ్యే, వాసే, లీలామ్, ఆర. భాసా, నీలమ్, రంతారమ్, శ్రీ-ఇతమ్, తమ్, దేవమ్, వందే.

అర్థము:

భాః = దీప్తి, మా=లక్ష్మి. రంతా = క్రీడించువాడు. ఆప్యః = పొందదగ్గది. అగః = కొండ. ఇతః=పొందబడినవాడు. ఆర (క్రియాపదము) = పొందెను.

సమాసములు:

రామా-ధీః = రామయందు (=సీతయందు) మనసుగలవాడు, (కనుకనే)
ఆప్య-అగాః = పొందదగిన కొండలుగలవాడు, (సీతమీది వలపుతో సహ్యాదిపర్వతాలకు వెళ్ళినవాడని అర్థం.) ఐన,
యః,రామః = ఏ రాముడు,
ఆయోధ్యే, వాసే, లీలామ్, ఆర = అయోధ్యలో ఉన్న భవనమునందు (నివాసరూపమైన) లీలను పొందెనో,
రాముడు అడవులు కొండలు తిరిగి, సీతతోకలసి మరల అయోధ్యకు వచ్చి ఉన్నవాడని భావం.

భాసా, కాలమ్, రంతారమ్ = మేనికాంతినిబట్టి నీలముగా ఉన్నవాడు, (జగత్సృష్ట్యాదులతో) క్రీడించువాడు,
శ్రీ-ఇతమ్, =లక్ష్మిచేత పొందబడినవాడు, ఐన

తమ్, దేవమ్, వందే = ఆ దేవునిగురించి నమస్కరించెదను.

ఆర – ఋ గతౌ అనే ధాతువుకు లిట్ ప్ర. ఏ. రూపం. ముందు చెప్పుకొన్నట్లు, కొన్ని అప్రసిద్ధ ధాతువులు ఇక్కడ వాడాడు కవి.

తాత్పర్యము:

సీతమీది ప్రేమతో కొండలవెంట తిరిగి మరల ఆమెతో కలసి అయోధ్యకు వచ్చి నివాసం ఉన్న వాడు, లీలాప్రదర్శనుడు, నీలపు దేహకాంతి కలవాడు, లక్ష్మి ఆశ్రయించినవాడు, ఐన రాముడనే దేవునికి నమస్కరిస్తాను.

ఇక, విలోమంలో కృష్ణుడినిగురించి చెప్పబోతున్నాడు.

ప్రతిలోమము - యాదవీయము:

> సేవాధ్యేయో రామాలాలీ గోప్యారాధీ మారామోరాః
>
> యస్సాభాలాంకారం తారం తం శ్రీతం వందేఽహం దేవం

పదవిభాగము:

సేవా-ధ్యేయః, రామా-లాలీ, గోపి-ఆరాధీ, మా-ఆరామ-ఉరాః (ఉరస్), యః, స-ఆభా-అలంకారమ్, తారమ్, తమ్, శ్రీ-ఇతమ్, దేవమ్, వందే.

సమాసములు:

సేవాభిః ధ్యాయః, సేవాధ్యేయః.= సేవలచేత ధ్యానింపదగ్గవాడు, సేవాధ్యేయః.
రామాః లాలయతి ఇతి , రామాలాలీ.= రామలను లాలించువాడు, రామాలాలీ.
గోపీః ఆరాధయతి ఇతి, గోప్యారాధీ గోపికలను  ఆరాధించువాడు, గోప్యారాధీ.
మాయాః ఆరామో ఉరో యస్య సః, మారామోరాః = లక్ష్మికి ఆరామమైన ఉరము ఎవనికో వాడు, మారామోరాః.
శ్రియా ఇతః యః సః, శ్రీతః. = శ్రీచేత పొందబడినవాడు, శ్రీతః.
సహితాః ఆభయా ఇతి సాభాః = ఆభతో ఉన్నవి , సాభాః.
సాభా అలంకారాః యస్య సః, సాభాలంకారః. =సాభములైన అలంకారాలు ఎవనికో వాడు, సాభాలంకారః.

అన్వయము:

సేవా-ధ్యేయః, రామా-లాలీ, గోపీ-ఆరాధీ, మా-ఆరామ-ఉరాః, యః, స-ఆభా-అలంకారమ్, శ్రీ-
తమ్, తమ్, దేవమ్, తారమ్, వందే.

అర్థము:

లాలీ = లాలించువాడు. ఆరాధీ = ఆరాధించువాడు. మా=లక్ష్మి. ఇతః = పొందబడినవాడు.
సేవా-ధ్యేయః = సేవలతో ధ్యానింపదగ్గవాడు,
రామా-లాలీ = (రుక్మిణ్యాది) స్త్రీలను లాలించేవాడు,
గోపీ-రాధీ = (రాధికాది) గోపికలను ఆదరించేవాడు,

మా-ఆరామ-ఉరాః = లక్ష్మికి నిలయమైన ఉరస్సుగలవాడు,

యః = ఎవడో,

స-ఆభా-అలంకారమ్ = దీప్తిమంతమైన అలంకారాలు గలవాడైన ,

తమ్, దేవమ్, తారమ్, వందే = ఆ దేవుని ఉచ్చైః స్వరంతో స్తుతిస్తాను

వది – అభివాదనస్తుత్యోః – ఇక్కడ స్తుత్యర్థంలో.

తాత్పర్యము:

యాగాది సేవలతో ధ్యానింపదగ్గవాడు, లక్ష్మీదేవి వచ్చి చేరినవాడు, రుక్మిణ్యాదృష్టమహిషులను లాలించేవాడు, రాధాదిగోపికలను ప్రేమించేవాడు, మెరిసే నగలను ధరించేవాడు ఐన ఆ దేవుని, కృష్ణుని పెద్దగా స్తుతిస్తాను.

ఇక రెండు శ్లోకాలలో  అయోధ్యను ద్వారకను వర్ణిస్తున్నాడు.

అనులోమము - రాఘవీయము:

2. సాకేతాఖ్యా జ్యాయా మాసీ ద్యా విప్రాదీప్తార్యాధారా
పూరాజీతాదేవాద్యావిశ్వాసాగ్ర్యాసావాశారావా

ఇది విద్యున్మాలావృత్తము. గణములు – మ మ గ గ .

పదవిభాగము:

సాకేత-ఆఖ్యా, జ్యాయామ్, ఆసీత్, యా, విప్ర-ఆదీప్తా, అర్య-ఆధారా, పూః, ఆజి-

ఇతా, అ-దేవ-ఆద్య-అ-విశ్వాసా, అగ్ర్యా, సావాశ-ఆరావా,

సమాసములు:

సాకేతః ఆఖ్యా యస్యాః సా , సాకేతాఖ్యా = సాకేతం అనే పేరు దేనికో అది, సాకేతాఖ్యా.
విప్రైః ఆదీప్తా, విప్రాదీప్తా = విప్రులచేత ఆదీప్త ఐనది, విప్రాదీప్తా.
అర్యాః ఆధారాః యస్యాః సా, అర్యాధారా = అర్యులు ఆధారములు దేనికో అది,
అర్యాధారా.
అజస్య అపత్యమ్ పుమాన్, ఆజిః = అజుని సంతతి ఐన పురుషుడు, ఆజిః
(=దశరథుడు).
ఆజినా ఇతా, ఆజీతా = ఆజిచేత పొందబడినది, ఆజీతా.
దేవాః ఆద్యాః యేషామ్ తే, దేవాద్యాః = దేవులు ఆద్యులైనవారు, దేవాద్యాః.
దేవాద్యేషు అవిశ్వాసః, దేవాద్యేష్వవిశ్వాసః = దేవాద్యులయందు అవిశ్వాసము,
దేవాద్యావిశ్వాసః.
దేవాద్యావిశ్వాసో న యస్యాః సా, అదేవాద్యావిశ్వాసా.
సవం అశ్నాతి ఇతి,సవాశః = సవమును భుజించువాడు, సవాశః(=దేవః).
సవాశానామ్ సంబంధీ సావాశః. = సవాశులకు సంబంధించినది, సావాశః.
సావాశశ్చ స  ఆరావః, సావాశారావః = సావాశమైన ఆరావము, సావాశరావము.
సావాశారావః యస్యాః సా, సావాశరావా = సావాశరావము దేనికో అది, సావాశరావా.

అన్వయము:

విప్ర-ఆదీప్తా, అర్య-ఆధారా, ఆజి-ఇతా, అ-దేవ-ఆద్య-అ-విశ్వాసా, సావాశ-ఆరావా,

సాకేత-ఆఖ్యా, అగ్ర్యా, పూః, జ్యాయామ్, ఆసీత్.

అర్థము:

అర్యః = వైశ్యుడు. ఆజిః = అజుని కొడుకు, దశరథుడు. ఇతా = పొందబడినది.
అగ్ర్యా = మొట్టమొదటిది, శ్రేష్ఠ. పూః = పురి, జ్యా = భూమి.
విప్ర-ఆదీప్తా = బ్రాహ్మణులచేత వెలుగొందుతున్నది,
అర్య-ఆధారా = వైశ్యులు ఆధారముగా ఉన్నది,
ఆజి-ఇతా = (అజుని కొడుకైన) దశరథునిచేత పొందబడినది (=అయోధ్య),
అ-దేవ-ఆద్య-అ-విశ్వాసా = దివ్యులపట్ల అవిశ్వాసము లేనిది (విశ్వాసముకలది. వారివలన తనకేమీ కాదని. )
అగ్ర్యా, పూః = శ్రేష్ఠమైన పురము (అయోధ్య)
జ్యాయామ్, ఆసీత్ = భూమియందు ఉండెను.

తాత్పర్యము:

బ్రాహ్మణులచేత వెలిగిపోతూ, వైశ్యులవలన సమృద్ధమై, దేవాదులవలన సైతము నిర్భయత్వము కలిగినదై, యాగసంబంధమైన కోలాహలము కలిగినదై, దశరథునిచేత పాలించబడినదై, అయోధ్య అను పేరుగల నగరము ఈ భూమియందు కలదు.

ఇక, విలోమంలో, ద్వారకావర్ణనం.

విలోమము -యాదవీయము:

వారాశావాసాగ్ర్యాసాశ్వావిద్యావాదేతాజీరా పూః
రాధార్యాప్తా దీప్రావిద్యాసీమా యా జ్యాఖ్యాతా కే సా

పదవిభాగము:

వారాశౌ, ఆస, అగ్ర్యా, స-అశ్వా, విద్యా-వాద-ఇత-ఆజి-ఇరా, పూః, రాధా-అర్య-ఆప్తా, దీప్రా, విద్యా-సీమా, యా, జ్యా-ఖ్యాతా, కే, సా

సమాసములు:

సహితా అశ్వైః యా సా, సాశ్వా = అశ్వములతో కూడి ఉన్నది, సాశ్వా.
విద్యాసు వాదః, విద్యావాదః = విద్యలయందు వాదము, విద్యావాదః.
విద్యావాదేషు ఇతాః ఆజయః యైః తే, విద్యావాదేతాజయః = విద్యావాదములయందు ఇతములైన ఆజులు ఎవరికో వారు, విద్యావాదీతాజయః (విద్యావాదములయందు పోరాడువారు, పండితులు)
విద్యావాదేతాజీనామ్ ఇరా, విద్యావాదేతాజీరా = విద్యావాదేతాజులకు ఇరా (భూమిః/స్థానమ్), విద్యావాదేతాజీరా.
వారాం రాశిః  వారాశిః = సముద్రము.
రాధాయాః అర్యః (స్వామీ), రాధార్యః = రాధయొక్క అర్యుడు, రాధార్యుడు (=కృష్ణుడు)
రాధార్యేణ ఆప్తా, రాధార్యాప్తా = రాధార్యునిచేత ఆప్త ఐనది, రాధార్యాప్తా.
విద్యానాం సీమా, విద్యాసీమా = విద్యలకు సీమ, విద్యాసీమా (విద్యలకు సిద్ధభూమి.)

జ్యాయామ్ ఖ్యాతా యా సా, జ్యాఖ్యాతా = జ్యాయందు(భూమియందు) ఖ్యాత ఐనది, జ్యాఖ్యాతా.

అన్వయము:

స-అశ్వా, విద్యా-వాద-ఇత-ఆజి-ఇరా, రాధ-అర్య-ఆప్తా, దీప్రా, విద్యా-సీమా, యా, అగ్ర్యా, జ్యా-ఖ్యాతా, సా, పూః,వారాశౌ, కే, ఆస.

అర్థము:

ఇరా - భూమి, స్థానము. అర్యః = భర్త.
అగ్ర్యా = శ్రేష్ఠము. జ్యా = భూమి. పూః = పురము. కం = నీరు ఆస (ఇది అవ్యయపదం) = ఉన్నది.
ఇక్కడ ఆస అనేది అవ్యయమని, క్రియాపదంగా భ్రాంతిపడవద్దని వ్యాఖ్యాత చెప్పాడు.

తాత్పర్యము:

అశ్వాదులు గలది, విద్యావాదాలలో మునిగిఉండే పండితులకు నిలయమైనది, విద్యలకు సిద్ధభూమి ఐనది, రాధాపతి ఐన కృష్ణుని ఏలుబడిలో ఉన్నది, లోకవిఖ్యాతమైనది, శ్రేష్ఠమైనది, ఐన పురం (ద్వారక), సముద్రంలో నీటి మధ్య ఉన్నది. సముద్రంలో, నీటిలో ఉన్న నగరం అని చెప్పటంవలన, ఆ నగరం ద్వారక అని అర్థమౌతుంది.

తరువాత పద్యంలో కూడ ద్వారకాపురిని అయోధ్యాపురిని వర్ణిస్తున్నాడు.

అనులోమము - రాఘవము:

అయోధ్యావర్ణనం

3. కామభాస్థలసారశ్రీసౌధాసౌ ఘనవాపికా
సారసారవపీనాసరాగాకారసుభూరిభూః

ఇది అనుష్టుప్పు.

పదవిభాగము :

కామ-భా-స్థల-సార-శ్రీ-సౌధా, అసౌ, ఘన-వాపికా, సారసా-ఆరవ-పీనా, సరాగ-ఆకార-సు-భూరి-భూః

సమాసములు:

కామస్య భా , కామభా = కామునియొక్క భా (=కాంతి), కామభా.
కామభాయాః స్థలమ్, కామభాస్థలమ్ = కామభయొక్క స్థలము, కామభాస్థలమ్.
సారా శ్చ శ్రియః, సారశ్రియః = సారములైన శ్రీలు, సారశ్రియః.
కామభాస్థలాశ్చ సారశ్రియః, కామభాస్థలసారశ్రియః = కామభాస్థలములైన సారశ్రీలు, కామభాస్థలసారశ్రియః.
కామభాస్థలసారశ్రియః యస్యాః సౌధానామ్ సా, కామభాస్థలసారశ్రీసౌధా =

కామభాస్థలసారశ్రీలైన సౌధములు దేనికో అది, కామభాస్థలసారశ్రీసౌధా,

ఘనాః వాపికాః యస్యాః సా, ఘనవాపికా = ఘనమైన వాపికలు దేనికో అది, ఘనవాపికా.

సారసానామ్ ఆరవాః, సారసారవాః = సారసములయొక్క ఆరవములు, సారసారవాః.

సారసారవైః పీనా, సారసారవపీనా = సారసారవములచేత పీన (అధికా) ఐనది, సారసారవపీనా.

సహితాః రాగేణ ఇతి, సరాగాః = రాగాలతో కూడి ఉన్నవి, సరాగాః = (ఎరుపు) కాంతులతో ఉన్నవి.

సరాగాకారాః యేషామ్ తాని, సరాగాకారాణి = సరాగాకారములు వేటికో అవి సరాగాకారాణి.

శోభనాని భూరీణి, సుభూరీణి = శోభనములైన భూరులు, సుభూరులు

సరాగాకారాణి చ సుభూరీణి చ, సరాగాకారసుభూరీణి = సరాగాకారములైన సుభూరులు, సరాగాకారసుభూరీణి.

సరాగాకారసుభూరీణాం భూః యా సా, సరాగాకారసుభూరిభూః = సరాగాకార-సుభూరులకు భూమి/స్థానం ఐనది, సరాగాకారసుభూరిభూః.

అన్వయము:

అసౌ, కామ-భా-స్థల-సార-శ్రీ-సౌధా, ఘన-వాపికా, సారస-ఆరవ-పీనా, సరాగ-ఆకార-సు-భూరి-భూః.

అర్థము:

వాపికా = దిగుడుబావి. భా= కాంతి. భూరి = సువర్ణము/బంగారు

అసౌ = ఈ అయోధ్యాపురి, సారసా = బెగ్గురు పక్షి

కామ-భా-స్థల-సార-శ్రీ-సౌధా = మన్మథదీపకాలైన గొప్పసంపదలు ఉన్న సౌధములు గలది.

ఘన-వాపికా = పెద్ద దిగుడుబావులు గలది,

సారసా-ఆరవ-పీనా = సారసపక్షుల కూతలచేత అధికమైనది,

సరాగ-ఆకార-సు-భూరి-భూః = రక్తవర్ణకాంతులుగల గొప్ప బంగారులకు నిలయమైనది,

తాత్పర్యము:

ఆ అయోధ్యాపురి, మన్మథోద్దీపకాలైన సిరులుగల సౌధాలతో ఉన్నది.
పెద్ద పెద్ద దిగుడుబావులు గలది. బెగ్గురుపక్షుల కూతలచేత సొగసుగా ఉండేది.
అంతట, మణికాంతులతో కూడిన బంగరులకు నిలయమైనది.

ప్రతిలోమము - యాదవీయము:

ద్వారకావర్ణనము .

భూరిభూసురకాగారాసనాపీవరసారసా

కాపివానఘసౌధా సౌ శ్రీరసాలస్థభామకా

పదవిభాగము:

భూరి-భూసురక-అగార-ఆసనా, పీవర-సారసా, కా, అపి, వా, అనఘ-సౌధా, అసౌ, శ్రీ-రసాల-స్థ-భామకా.

సమాసములు:

అగారాణామ్ ఆసనాని, అగారాసనాని = అగారములయొక్క ఆసనములు (ఇంటి అరుగులు).

భూరిభూసురాః యేషామ్ తాని భూరిభూసురకాణి = భూరిభూసురులు వేటికో అవి, భూరిభూసురకాణి (ఎందరో భూసురులు గలవి)

భూరిభూసురకాని చ అగారాసనాని, భూరిభూసురకాగారాసనాని = భూరిభూసురులు గల అగారాసనములు, భూరిభూసురకాగారాసనాని.

భూరిభూసురకాగారాసనాని యస్యాః సా, భూరిభూసురకాగారాసనా = భూరిభూసురకాగారాసనములు దేనికో అది, భురిభూసురకాగారాసనా.

పీవరాణి సారసాని యస్యాః సా, పీవరసారసా = పీవరములైన సారసములు దేనికో అది, పీవరసారసా (పెద్ద పద్మములు గలది.)

అనఘాని సౌధాని యస్యాః సా, అనఘసౌధా = అంఘములైన సౌధములు దేనికో అది, అనఘసౌధా.

శ్రీయుతాః రసాలాః, శ్రీరసాలాః = శ్రీయుతములైన రసాలములు, శ్రీరసాలాః.

శ్రీరసాలేషు స్థితః భామః యస్యామ్ సా, శ్రీరసాలస్థభామకా = శ్రీరసాలముల యందు నిలచిన భాముడు దేనిలోనో అది, శ్రీరసాలస్థభామకా.

అన్వయము:

భూరి-భూసురక-అగార-ఆసనా, పీవర-సారసా, అనఘు-సౌధా, శ్రీ-రసాల-స్థ-భామకా (భామః=సూర్యః), అసౌ (ద్వారకాపురీ), కా అపి (=అనిర్వచనీయా)

అర్థము:

భూరి = ఎక్కువ మంది. ఆసనమ్ = అరుగు. భామః = సూర్యుడు.

భూరి-భూసురక-అగార-ఆసనా = ఎందరో బ్రాహ్మణులు ఉన్న ఇళ్ళ అరుగులు గలది,
పీవర-సారసా = పెద్ద పెద్ద పద్మములు గలది,
అనఘు-సౌధా = స్వచ్ఛములైన సౌధములు గలది,
శ్రీ-రసాల-స్థ-భామకా = సొగసైన మామిడి చెట్లపైన సూర్యుడు ఉండేది, ఐన,
అసౌ = ఈ ద్వారకాపురి,
కా అపి = ఏదో అనిర్వచనీయమైనది.

తాత్పర్యము:

ఇళ్ళ అరుగులమీద పెక్కురు బ్రాహ్మణులు చేరి ఉండేది, పెద్ద పెద్ద పద్మములు ఉండేది, స్వచ్ఛములైన సౌధములు గలది, అందమైన మామిడి చెట్లపైన సూర్యుడు ఉండేది (చెట్లు అంత ఎత్తుగా ఉన్నవని భావం.), ఐన ఆ ద్వారకా పురి, ఒకానొక వర్ణనాతీతమైనది.

దీనితో అయోధ్యాద్వారకాపురాల వర్ణన ముగిసింది.

ఇక, తరువాత  శ్లోకంలో రాముడిని, కృష్ణుడిని, చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

రామునిగురించి.

4. రామధామ సమానేన మాగోరోధన మాసతాం

నామహామక్షరరసంతారాభా స్తు న  వేద యా

ఇది అనుష్టుప్పు.

పదవిభాగము :

రామ-ధామ, స-మాన-ఇనమ్, ఆగస్-రోధనమ్, ఆస, తామ్. న-అ-మహామ్, అ-క్షర-రసమ్, తారా-భాః, తు, న, వేద, యా.
ఆస- అస ధాతోః లిట్ ప్ర.ఏ.వ.

సమాసములు:

రామ ఇతి ధామ, రామధామ = రామ అనే ధామము, రామధామ = రాముడనే తేజము.

సమానః ఇనః యస్య తత్, సమానేనమ్ = సమానుడైన ఇనుడు దేనికో అది, సమానేనమ్.

ఆగసాం రోధనమ్, ఆగోరోధనమ్ = ఆగస్సులను రోధించునది, ఆగోరోధనమ్.

మహః న భవతి ఇతి, అమహః = మహము కానిది, అమహః.

అమహః న విద్యతే యస్యాః,సా, అమహా= అమహము లేనిది  అమహా.

న అమహా భవతి ఇతి, నామహా = అమహా కానిది, నామహా.

అక్షరో రసో యస్యాః సా, అక్షరరసా = అక్షరమైన రసము దేనికో అది అక్షరరసా.

తారాణామ్ భాః, తారాభాః = తారలయొక్క కాంతులు, తారాభాః.

అన్వయము:

యా (పురీ) తారా-బాః తు న వేద, తామ్ (పురీమ్), న-అ-మహామ్, అ-క్షర-రసమ్, ఆగస్-రోధనమ్, రామ-ధామ, ఆస

అర్థము:

భాః = కాంతి.  మహః =ఉత్సవము.   రసః=ఆనందము.   ఆగస్ = పాపము.

ధామ = తేజస్సు.

యా, పురీ = ఏ నగరమైతే

తారా-భాః, న, వేద = తారల కాంతులను ఎరుగదో (దట్టమైన వనాలు, నిబిడమైన సౌధాల కారణంగా),

తామ్ (పురీమ్) = ఆ అయోధ్యానగరాన్ని,

న-అ-మహామ్ = ఉత్సవములులేనట్టిది కాని దానిని (నిత్యోత్సవాలు ఉన్నదానిని)
అక్షర-రసామ్ = నిత్యమైనాఅనందము కలదానిని (అట్టి అయోధ్యను),
సమాన-ఇనమ్ = సూర్యుడు తనతో సమానుడైనది (సూర్యుడితో సమమైనది),
ఆగః-రోధనమ్ = పాపములను నివారించేది, ఐన,
రామ-ధామ = రాముడు అను తేజస్సు, ఆస = స్వీకరించెను/పొందెను.
ఆస – అస ధాతోః లిట్ ప్ర.ఏ.వ.

తాత్పర్యము:

సాంద్రమైన వనాలు, ఎత్తుగా దగ్గర దగ్గరగా ఉన్న సౌధాలవలన నక్షత్రాదుల కాంతి సైతం సోకలేనిది, నిత్యమూ ఉత్సవాలతో ఉండేది, శాశ్వతానందంతో ఉండేది ఐన అయోధ్యాపురిలో, పాపాలను నివారించేవాడ, తేజస్సులో సూర్యసమానుడు ఐన రాముడు ఉన్నాడు.

అయోధ్యాపురిలో రాముడు ఉన్నాడని సారాంశం.

ఇక, ప్రతిలోమంలో కృష్ణుడు ద్వారకలో ఉన్నాడని చెప్పుతున్నాడు.

ప్రతిలోమము - యాదవీయము:

కృష్ణునిగురించి.

యాదవేన స్తు భారాతా సంరరక్ష మహామనాః
తాం స మానధరో గోమా ననేమాసమధామరాః

పదవిభాగము:

యాదవ-ఇనః, తు, భాః-రాతా, సంరరక్ష, మహా-మనాః (మనస్), తామ్, సః, మాన-ధరః, గోమాన్, అ-నేమ-అసమ-ధామ-రాః (రై).

సమాసములు

యాదవానామ్ ఇనః, యాదవేనః = యాదవులయొక్క ఇనుడు, యాదవేనుడు.
భాసామ్ రాతా, భారాతా = భాసముల(కాంతుల)యొక్క రాత, భారాత.
మహత్ మనః యస్య సః, మహామనాః = మహత్తైన మనస్సు ఎవనికో వాడు, మహామనాః.
మానమ్ ధరతి ఇతి మానధరః = మానమును ధరించువాడు, మానధరః.
గావః అస్య సంతి ఇతి, గోమాన్ = గోవులు గలవాడు, గోమాన్ (=గోపాలకుడు)
ధామ చ రాశ్చ, ధామరాయౌ = ధామమును, రాయియు, ధామరాయౌ
(రాయి అంటే బండరాయి కాదు, రై=ధనం - రాః, రాయౌ, రాయః.)
నేమః న యస్య తత్, అనేమః = నేమము లేనిది, అనేమః.
సమః న యస్య  తత్, అసమః = సమము లేనిది ఏదో అది, అసమః.
అనేమౌ చ అసమౌ చ ధామరాయౌ యస్య సః, అనేమాసమధామరాః = అనేమములు, అసమములు, ఐన ధామరాయులు ఎవనికో వాడు, అనేమాసమధామరాః (అవధి గాని, సాటిగాని, లేని తేజస్సంపదలు  ఉన్న వాడు.)

అన్వయము:

తామ్ (పురీమ్),మాన-ధరః, గోమాన్, మహా-మనాః (మనస్), భా-రాతా, అ-నేమ-అసమ-ధామ-రాః,సః, యాదవ-ఇనః, తు, సంరరక్ష

అర్థము:

మానః = చిత్తౌన్నత్యము.   భాః = కాంతి.      రాతా (రా ధాతువు మీద తృచ్ ప్రత్యయము) = ఇచ్చువాడు.   నేమః = సీమ/అవధి.    ధామ = తేజస్సు.
రాః = ధనము/సంపద.    ఇనః = ప్రభువు.

తామ్ = ఆ ద్వారకానగరిని,
భాః-రాతా = దీప్తులను ఇచ్చేవాడు,
మాన-ధరః = అభిమానముగలవాడు,
గోమాన్ = గోపాలకుడు,
మహామనాః = ఉదారమనస్కుడు,
అ-నేమ-అ-సమ-ధామ-రాః = అవధిలెని, సాటిలేని, తేజస్సంపదలు ఉన్నవాడు,
ఐన,
యాదవ-ఇనః, తు, = యాదవుల ప్రభుపైన కృష్ణుడు,
సంరరక్ష = పాలించెను/రక్షించెను.

తాత్పర్యము

అభిమానవంతుడు, దీప్తులను ప్రసాదించేవాడు, ఉదారచిత్తుడు, గోపాలకుడు, అపరిమితతేజస్సంపదలు గలవాడు ఐన యాదవనాథుడు శ్రీకృష్ణుడు, ఆ

ద్వారకాపురిని రక్షించాడు/పాలించాడు.

ద్వారకాపురి, దానిలోని యాదవులు, అసమానప్రభావుడైన కృష్ణుని రక్షణలో ఉన్నారని సారాంశం.

తరువాతి  శ్లోకంలో, రాముడి దగ్గరకు విశ్వామిత్రుడు రావటాన్ని, కృష్ణుడి దగ్గరకు నారదుడు రావటాన్ని, చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

విశ్వామిత్రుడు రావటం.

5. యన్ గాధేయో యోగీ రాగీ వైతానే సౌమ్యే సౌఖ్యేఽసౌ
తం ఖ్యాతం శీతంస్ఫీతంభీమానామాశ్రీహాతాత్రాతం

ఇది విద్యున్మాలావృత్తము. గణములు – మ మ గ గ .

పదవిభాగము :

యన్, గాధేయః, యోగీ, రాగీ, వైతానే, సౌమ్యే, సౌఖ్యే, అసౌ, తమ్, ఖ్యాతమ్, శీతమ్, స్ఫీతమ్, భీమాన్, ఆమ, అ-శ్రీ-హాతా, త్రాతమ్.

సమాసములు:

అ-శ్రీ-హాతా

శ్రీరితి వేదః.= శ్రీ అంటే వేదము (శ్రౌతవిశిష్టార్థం).

శ్రీః యేషామ్ న తే, అశ్రియః = శ్రీ లేనివారు (శ్రీకి విరోధులు), అశ్రియః = అవైదికాః. అశ్రీణామ్ హాతా, అశ్రీహాతా = అశ్రీకులను పోగొట్టుకొనేవాడు, అశ్రీహాతా.

అన్వయము:

సౌమ్యే, వైతానే, సౌఖ్యే, రాగీ, అశ్రీ-హాతా, భీమాన్, గాధేయః, ఖ్యాతమ్, శీతమ్, స్ఫీతమ్, తమ్ (రామమ్) ,యన్, త్రాతమ్, ఆమ.

అర్థము:

సౌమ్యమ్ = సుందరము, మంచిది. వైతానమ్ = వితానసంబంధి, యజ్ఞ సంబంధి. శ్రీః = వేదము. హాతా (హా ధాతువుమీద తృచ్ ప్రత్యయము) = పోగొట్టుకొనువాడు/వదలించుకొనువాడు. భీమాన్ = భయము గలవాడు. రాగీ = ఇచ్ఛ గలవాడు. శీతః = ఉగ్రుడు కానివాడు. యన్ (ఇణ్ గతౌ ధాతువునకు శతృప్రత్యయము) = చేరిన వాడు. త్రాతమ్ = త్రాణము/ రక్షణము (క్త ప్రత్యయానికి భావార్థం.). ఆమ (అమ-గతౌ ధాతువు లిట్ ) = పొందెను.

సౌమ్యే, వైతానే, సౌఖ్యే, రాగీ = మంచి యజ్ఞ సంబంధమైన సౌఖ్యముపట్ల కోరిక గలవాడు,

భీమాన్, = (రాక్షసవిఘ్నాలవలన) భయము గలవాడు,

అ-శ్రీ-హాతా = వైదికవిరోధు(లైన రాక్షసు)లను పొగొట్టగోరినవాడు, ఐన,

అసౌ, గాధేయః = ఆ విశ్వామిత్రుడు,

స్ఫీతమ్, శీతమ్,ఖ్యాతమ్= అభివృద్ధిచెందినవాడు,వత్సలుడు,ప్రసిద్ధుడు, ఐన

తమ్ (రామమ్), యస్ = ఆ రాముని చేరినవాడై,

త్రాతమ్, ఆమ = రక్షణను పొందెను.

ఆమ – అమ గత్యాదిషు. ఈ ధాతువు లిట్.

తాత్పర్యము:

యాగములవలన వచ్చు గొప్ప సౌఖ్యములమీద ఆసగలిగి, విఘ్నములు కలిగించు రాక్షసులవలన భయముతో ఉన్న విశ్వామిత్రుడు, వేదధర్మ విరోధులగు ఆ రాక్షసులను పోగొట్టదలచి, సమృద్ధుడు వత్సలుడు ప్రసిద్ధుడు ఐన రాముని దగ్గరకు పోయి, అతనినుండి తన యాగమునకు రక్షణను పొందెను.

విశ్వామిత్రుడు తన యాగాన్ని కాపాడుమని రాముడిని అడిగి ఒప్పించు కొన్నాడని సారాంశం.

ప్రతిలోమము - యాదవీయము:

నారదుని రాక.

**తం త్రాతా హా శ్రీమానామాభీతం స్ఫీతం శీతం ఖ్యాతం**
**సౌఖ్యే సౌమ్యే ఽసౌ నేతా వై గీరాగీ యో యోద్ధే గాయస్**

పదవిభాగము:

తమ్, త్రాతా, హా, శ్రీమాన్, ఆమ, అ-భీతమ్, స్ఫీతమ్, శీతమ్, ఖ్యాతమ్, సౌఖ్యే, సామ్యే, అసౌ, నేతా, వై, గీః-రాగీ, యః, యోద్ధే, గాయన్.

సమాసములు

భీతమ్ ఇతి భయమ్ (సామాన్యే క్త ప్రత్యయః) = భీతమ్ అంటే, భయం/భీతి.
భీతమ్ న భవతి ఇతి, అభీతమ్ = భీతమ్ కానిది, అభీతమ్ (నిర్భీతి)
గిరామ్ రాగాః సంతి అస్య ఇతి, గీరాగీ = వాక్కులయొక్క రాగములు కలవాడు, గీరాగీ.

అన్వయము:

సామ్యే, నేతా, యోద్ధే, అభీతమ్, త్రాతా, శ్రీమాన్, గీః-రాగీ, యః, అసౌ, గాయన్, శీతమ్, ఖ్యాతమ్, సౌఖ్యే, స్ఫీతమ్, తమ్ (కృష్ణమ్), ఆమ, వై, హా.

అర్థము:

సామ్యః = విప్రుడు, బ్రాహ్మణుడు. నేతా=నాయకుడు/ఉత్తముడు. అభీతమ్ (భావే క్త) =నిర్భీతి. గీః = శబ్దము, వాక్కు. రాగః = సంగీతములోని రాగము.
హా= అయ్యో!విషాదసూచకం(రాబోయే సత్యారోషాదికం).
వై = పాదపూరణశబ్దం (లేద, నేతా వై = ప్రసిద్ధుడైన నేత, అని ఐనా చెప్ప వచ్చు.)
ఆమ = పొందెను. అమ గతౌ ధాతువు లిట్.

సౌమ్యే, నేతా, ప్రై = విప్రులలో అగ్రగణ్యుడుగా ప్రసిద్ధుడు (సౌమ్యశబ్దం జాత్యేకవచనం.),

యోధే, అ-భీతమ్, త్రాతా = యోధునియందు నిర్భీతిని నిలుపువాడు (పోరికి ఉసిగొలుపువాడు అని కావచ్చు. కలహాశనుడు కదా! )

శ్రీమాన్ = వర్చస్వి,

గీః-రాగీ = వాక్కులయొక్క గాన రాగములు గలవాడు (రాగనిపుణుడు),

యః, అసౌ (నారదః) = ఎవడో, ఆ నారదుడు,

గాయన్ = పాడుతూ ఉన్న వాడై,

శీతమ్, ఖ్యాతమ్ = ప్రసన్నుడు, ప్రసిద్ధుడు,

సౌఖ్యే, స్ఫీతమ్ = లోకసౌఖ్యము నిమిత్తమై సమృద్ధుడైనవాడు, ఐన

తమ్ (కృష్ణమ్) = ఆ కృష్ణుడిని

ఆమ = చేరెను.

హా = కష్టము సుమా! (ఏ గొడవ పెట్టబోతాడో అని! )

తాత్పర్యము.

సౌమ్యులైన విప్రులలో ముఖ్యుడు, యోదులకు నిర్భయత్వమును నిలుపు వాడు (పోరికి ఉసిగొలుపువాడు), పదములయొక్క సంగీతరాగముల పట్ల అనురాగము కలవాడు, ఐన నారదుడు, గానము చేయుచు, లోకసౌఖ్యమునకై ప్రసిద్ధుడై యున్న ఆరాధనీయుడైన శ్రీకృష్ణునికడకు వచ్చెను.

ప్రసిద్ధుడైన కృష్ణుడి దగ్గరకు కలహప్రియుడైన నారదుడు పాడుకొంటూ వచ్చాడని సారాంశం.

ఇక,రాబోయే శ్లోకంలో, సీత రాముడిని చేరటాన్ని, రుక్మిణి పారిజాతాన్ని పొందటాన్ని చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

సీతారామవివాహసూచనం.

6. మారమంసుకుమారాభం రసాజాపనృతాశ్రితం

కావిరామదలాపాగో సమావామతరానతే

ఇది అనుష్టుప్పు.

పదవిభాగము :

మా-రమమ్, సుకుమార-ఆభమ్, రసా-జా, ఆప, నృతా-ఆశ్రితమ్, క-అ-విరామ-ద-లాపా, గో-నమా, అ-వామతరా, నతే.

సమాసములు

మాయాః రమః, మారమః = మా(లక్ష్మి)యొక్క రముడు, మారమః.
సుకుమారా ఆభా యస్య సః, సుకుమారాభః = సుకుమారమైన ఆభ (కాంతి) ఎవనికో వాడు, సుకుమారాభః.
రసాయాః జాతా, రసాజా = రసనుండి పుట్టినది, రసాజా.
నుః (నరస్య) భావః, నృతా.

నృతయా శ్రితః, నృతాశ్రితః = నరత్వముచేత పొందబడినవాడు.

క-అ-విరామ-ద-లాపా

కస్య  అవిరామః, కావిరామః = సుఖముయొక్క అవిరామము, కావిరామః.

కావిరామం దదాతి లాపః యస్యాః సా, కావిరామదలాపా = కావిరామమును ఇచ్చు లాపము ఎవరిదో ఆమె, కావిరామదలాపా.

గవా సమా, గోసమా = భూమితో సమ ఐనది, గోసమా.

వామా న భవతి ఇతి, అవామా = వామ కానిది, అవామా.

సుతరామ్ అవామా, అవామాతరా = మిక్కిలి అవామ, అవామాతరా.

అన్వయము:

నృతా-ఆశ్రితమ్, సుకుమార-ఆభమ్, మా-రమమ్, (రామమ్) క-అవిరామ-ద-లాపా, గో-సమా, నతే అ-వామతరా, రస-జా,( సీతా) ఆప .

అర్థము:

మా=లక్ష్మి.   రమః = పతి.   కమ్ = సుఖము.   లాపః= మాట.   గౌః=భూమి.

రసా= భూమి.   జా= పుట్టినది.   నృతా (నుః భావః నృతా)= నరత్వము.

ఆభా=కాంతి.   దా= ఇచ్చునది.   నతః = ప్రణతజనుడు, ఆశ్రితుడు.

వామా=కుటిల.   ఆప=పొందెను (ఆప్ఌ  వ్యాప్తౌ – ధాతువు లిట్ ప్ర. పు. ఏ.).

సుకుమార-ఆభమ్ = కోమలకాంతిగలవాడు,

నృతా-ఆశ్రితమ్ = నరత్వమును పొందినవాడు,

మా-రమమ్ = లక్ష్మీపతి ఐన రాముని,

క-అ-విరామ-దలాపా = నిరంతరం సుఖాన్ని ఇచ్చే మంచి మాటలు గలది,

గో-సమా = (ఓర్పులో) భూమితో సమానమైనది,

నతే, అ-వామతరా = ఆశ్రితులపట్ల ఎంతో నిష్కపటంగా ఉండేది, ఐన,

రసా-జా = భూతనయ, సీత

ఆప = పొందెను .

తాత్పర్యము

అశ్రితులపట్ల ఎంతో నిష్కపటంగా ఉండేది, తన వాక్కులతో నిరంతరాయమైన ఆనందాన్ని ఇచ్చేది, ఐన భూపుత్రి సీత, కోమలశరీరకాంతి గల మానవరూపంతో ఉన్న లక్ష్మీపతి ఐన రాముడిని చేరింది.

సీత రాముడిని పొందిందని సారాంశం. దీనిలో సీతారాముల వివాహాన్ని సూచించాడు.

ఇక, ప్రతిలోమంలో, నారదుడు రుక్మిణికి పారిజాతం ఈయటాన్ని చెప్పుతున్నాడు.

ప్రతిలోమము - యాదవీయము:

**తేన రాత మవామాస గోపాలా దమరావికా**

**తం శ్రితా నృపజా సారభం రామాకుసుమం రమా**

పదవిభాగము:

తేన, రాతమ్, అ-వామా, ఆస, గోపాలాత్, అమర-ఆవికా, తమ్, శ్రితా, నృపజా, సార-భమ్, రామా, కుసుమమ్, రమా.

అన్వయము:

తేన (నారదేన), రాతమ్, సార-భమ్ (సారా భా యస్య తత్ సారభమ్), కుసుమమ్, గోపాలాత్, తమ్ (కృష్ణమ్), శ్రితా, అమర-ఆవికా, రమా,అ-వామా, రామా, నృపజా (రుక్మిణీ), ఆస (= ఆదదే అస ఆదానే-లిట్.)

సమాసములు

సారా భా యస్య తత్, సారభమ్ = సారమైన కాంతి దేనికో అది, సారభమ్.
అమరాణామ్ ఆవికా, అమరావికా = అమరులకు ఆవిక, అమరావికా.
లేదా,
అమరాన్ అవతి ఇతి, అమరావికా = అమరులను రక్షించేది, అమరావికా.
వామా న భవతి ఇతి, అవామా = వామ కానిది అవామా.
నృపాత్ జాతా ఇతి, నృపజా = నృపునివలన పుట్టినది, నృపజా.

అర్థము:

రాతమ్ (రా దానే ధాతువుమీద క్తప్రత్యయము.) = ఈయబడినది. భా= కాంతి. ఆవికా = రక్షించునది. వామా= కుటిల. రామా = సౌందర్యవతి, స్త్రీ. ఆస (అస-గతిదీప్త్యాదానేషు ధాతువు లిట్) = తీసుకొనెను.

తేన (నారదేన), రాతమ్, సారభమ్, కుసుమమ్ = ఆ నారదునిచేత ఈయబడిన, శ్రేష్ఠమైనకాంతిగల, పుష్పమును (పారిజాతమును)

గోపాలాత్ = కృష్ణునివలన,

తమ్ (కృష్ణమ్), శ్రితా = ఆ కృష్ణుని చెంది యున్నది,

అమర-ఆవికా, రమా = దేవతలను కాపాడు లక్ష్మి ఐనది,

అ-వామా, రామా, నృపజా (రుక్మిణీ) = నిష్కపటయు, సౌందర్యవతియు ఐన రాజపుత్రి (రుక్మిణి)

ఆస = తీసుకొనెను.

తాత్పర్యము

ఆ నారదుడు ఇచ్చిన (పారిజాత) పుష్పమును, కృష్ణుని ద్వారా, రాజపుత్రికారూపమున ఆతనిని ఆశ్రయించి యున్నదియు, దేవతలను కాపాడునదియు, నిష్కల్మషహృదయయు, సౌందర్యవతియు ఐన స్త్రీ (రుక్మిణి), తీసుకొనెను.

నారదుడు పారిజాతపుష్పాన్ని కృష్ణుడికి ఇచ్చాడని, ఆయన దానిని రుక్మిణికి ఇచ్చాడని, సారాంశం.

రాబోయే పద్యంలో, రాముడు పరశురాముడిని జయించి వదలివేయటాన్ని అనులోమంలోను, పారిజాతాన్ని ధరించిన రుక్మిణి శోభాతిశయంతో వెలిగిపోవటాన్ని ప్రతిలోమంలోను, చెపుతున్నాడు.

అనులోమము - రాఘవము.

రాముడు పరశురాముడిని వశం చేసుకోవటాన్ని వర్ణిస్తున్నాడు.

7. రామనామాసదాఖేదభావేదయా
వానతాపీనతేజారిపావానతే
కాదిమోదాసహాతాస్వభాసారసా
మేసుగోరేణుకాగాత్రజేభూరుమే

ఇది స్రగ్విణీవృత్తము. గణములు – ర ర ర ర .

పదవిభాగము :

రామ-నామా(=నామస్), సదా, ఖేద-భావే, దయావాన్, అ-తాపీ, ఇన-తేజాః (=తేజస్), రిపౌ, ఆనతే, క-అది-మోద-అస-హాతా (అస్యంతి=నిరస్యంతి ఇతి అసాః), స్వ-భాసా, రసామే, సుగః, రేణుకా-గాత్ర-జే,భూరుమే(భూ-ఉరు-మే).

సమాసములు

రామః ఇతి నామ యస్య సః, రామనామా = రాముడనే నామము గలవాడు, రామనామా.
ఖేదో భావే యస్య సః, ఖేదభావః = ఖేదము భావమునందు ఎవనికో వాడు,

ఖేదభావః.

తాపయతి ఇతి తాపీ. న తాపీ భవతి ఇతి, అతాపీ = తపింపజేసేవాడు, తాపీ. తాపీ కానివాడు, అతాపీ.

ఇనస్య ఇవ తేజః యస్య సః, ఇనతేజాః =

ఇనునికివలె తేజస్సు ఎవనికో వాడు, ఇనతేజాః.

స్వస్య భాః, స్వభాః = తనయొక్క భాః(తేజము), స్వభాః.

క-అదిమోద-అస-హాతా

కం అత్తి ఇతి, కాదీ = నీటిని భక్షించువాడు, కాది. జలభక్షణవ్రతుడైన ముని.

కాదినామ్ మోదః, కాదిమోదః = కాదులయొక్క  మోదము, కాదిమోదః.

కాదిమోదమ్ అస్యంతి ఇతి, కాదిమోదాసాః = కాదిమోదమును పోగొట్టువారు, కాదిమోదాసాః. (మునుల ఆనందాన్ని పోగొట్టేవాళ్ళు =రాక్షసులు)

కాదిమోదాసానామ్ హాతా, కాదిమోదాసహాతా =  కాదిమోదాసులయొక్క హాత, కాదిమోదాసహాతా. (రాక్షసులను నిరాసముచేయువాడు)

రేణుకాయాః గాత్రాత్ జాతః ఇతి, రేణుకాగాత్రజః = రేణుక గాత్రమునుండి పుట్టినవాడు, రేణుకాగాత్రజః (పరశురాముడు)

సుఖేన గంతుమ్ శక్యః, సుగః = సుఖముగా చేరదగ్గవాడు, సుగః.

భువా ఉరుః మా (లక్ష్మీః) యస్య సః ,భూరుమః = భూమిచేత గొప్ప శ్రీ ఎవనికో వాడు, భూరుమః.( సప్తమీ-భూరుమే)

రసామ్ అమతి (అమః/ఆమః = పొందువాడు ) ఇతి, రసామః = రసను పొందువాడు, రసామః. (సప్తమీ-రసామే)

అన్వయము:

భూ-ఉరు-మే, రసా-అమే, రేణుకా-గాత్రజే, రిపౌ,ఆనతే, ఖేద-భావే, సదా దయావాన్, ఇనతేజాః, సుగః, క-అది-మోద-అస-హాతా, రామనామా, స్వ-భాసా, అతాపీ (బభూవ) .

అర్థము:

భూః = భూమి. మా= లక్ష్మి. సుగః= సుఖముగా చేరదగ్గవాడు. కం=నీరు. అది = తినువాడు. అసః = నిరసించువాడు. హాతా = వదలించుకొనువాడు. భాః (భాస్) = కాంతి.

భూ-ఉరు-మే = భూమిచేత గొప్పదైన సంపద కలవాడు (విశాలభూసంపదకలవాడు, ఒకప్పుడు. ఇది సతి సప్తమి),
రసా-అమే = భూమిని పొందినవాడు (ఒకప్పుడు భూమి అంతా తనదైనవాడు, ఇప్పుడు మరల భూమిమీదకు వచ్చినవాడు. ఇది సతి సప్తమి)
రేణుకా-గాత్రజే = రేణుకాతనూజుడైన పరశురాముడు (ఇది సతి సప్తమి),
రిపౌ,ఆనతే = శత్రువై, వినతుడుకాగా (ముందు ఎదిరించి తరువాత లొంగిపోయినవాడు. ఇది సతి సప్తమి.)
క-అది-మోద-అస-హాతా = జలభక్షణుల (= మునుల) సంతసాన్ని హరించేవారిని (=రాక్షసులను) నిరసించేవాడు,
ఇనతేజాః, సుగః = సుర్యసమతేజస్వి ఐనా సుఖంగా చెంతకు చేరదగ్గవాడు,
ఖేద-భావే సదా, దయావాన్ = బాధపడే శత్రువు పట్ల ఎప్పుడూ దయగలిగి ఉనండేవాడు, ఐన,
రామ-నామా = . రాముడు,

స్వ-భాసా, అతాపీ (బభూవ) = తన తేజస్సుతో తపింపజేయనివాడు అయ్యెను. (వదలివేసెను)

తాత్పర్యము:

ఒకప్పుడు విశాలభూస్మృద గలవాడు (కాని దానిని కశ్యపునకు ఇచ్చి మహేంద్రానికి వెళ్ళిపోయాడు), భూమిమిదకు వచ్చినవాడు (ఇప్పుడు  మరల ఆవశ్యకమై ), రేణుకాసుతుడును ఐన పరశురాముడు, తొలుత విరోధము చూపి తరువాత వినతుడుకాగా, రాక్షసులకు ఖేదకారకుడు, దుఃఖపడు వారి పట్ల ఎప్పుడూ దయ చూపువాడును, ఐన రాముడు, సూర్యసమతేజశ్శాలి ఐ యుండియు, ఆ మునికి బాధ కలుగజేయలేదు.

ప్రతాపశాలి ఐనప్పటికీ రాముడు, తననెదిరించి చివరకు వినతుడైన పరశురాముని క్షేమముగా వదలాడు అని సారాంశము.

ఇక, విలోమంలో, రుక్మిణికి పారిజాతసుమం ఎంతో శోభను ఇచ్చిందని చెప్పుతున్నాడు.

ప్రతిలోమము - యాదవీయము:

రుక్మిణికి పారిజాతశోభ కలగటం.

మేరుభూజేత్రగాకాణురేగోసుమే , సారసాభాస్వతాహాసదామోదికా

తేనవాపారిజాతేనపీతానవా , యాదవేభాదఖేదాసమానామరా

పదవిభాగము:

మేరు-భూ-జేతృ-అగా, క-అణు-రే, గో-సుమే, సా, అరసా, భాస్వతా, హా, సదామోదికా, తేన, వా (అత్ర వాశబ్ద ఇవార్థకః), పారిజాతేన, పీతా, నవా, యాదవే, అభాత్, అ-ఖేదా, సమాన-అమరా.

అన్వయము:

మేరు-భూ-జేతృ-అగా, సా, క-అణు-రే, గో-సుమే, అ-రసా, భాస్వతా, తేన, పారిజాతేన, సమాన-అమరా, అ-ఖేదా, సదా, మోదికా, పీతా, నవా, వా (వా=ఇవ), యాదవే, అభాత్, హా! .

సమాసములు

మేరోః భూః, మేరుభూః =మేరువుయొక్క భూమి, మేరుభూమి.
మేరుభువో జేతా, మేరుభూజేతా =మేరుభూమిని జయించునది, మేరుభూజేతా.
మేరుభూజేతా చ సః అగః, మేరుభూజేత్రగః(రైవతకగిరిః). మేరుభూజేత్రగః యస్యాః సా, మేరుభూజేత్రగా = మేరుభూజేత్రగము ఎవరికో ఆమె, మేరుభూజేత్రగా (రుక్మిణి)
కం=సుఖము.
కస్య అణుః, కాణుః =సుఖముయొక్క అణువు/లేశము, కాణుః
కాణుం రాతి (=దదాతి) ఇతి, కాణురమ్ = కాణువును ఇచ్చునది, కాణురము.
కాణురే – సప్తమీ.
గోః సుమమ్, గోసుమమ్ = భూమియొక్క సుమము, గోసుమము.
గోసుమే – సప్తమీ.

రసః యస్యాః న, సా, అరసా = రసము(ఇష్టము) లేనిది ఎవరికో ఆమె, అరసా.
సమానాః అమరాః యస్యాః సా, సమానామరా = సమానులైన అమరులు ఎవరికో ఆమె, సమానామరా (ఇక్కడ అమరశబ్దం జాతిసామాన్యవాచకం. లింగవివక్ష లేదు.).
ఖేదో న యస్యాః సా, అఖేదా = ఖేదము లేనిది ఎవరికో ఆమె, అఖేదా.

అర్థము:

జేతా=జయించునది.  అగః = కొండ.  కం= సుఖము.  అణుః=లేశము.
రః = ఇచ్చునది.  రసః = ఇష్టము, కోరిక.  మోదికా= సంతోషించునది.
పీతా=గౌరవర్ణా.  నవా= నూతనా.  వా= వలె. ఇక్కడ వాశబ్దం, ఇవశబ్దార్థకం. ఇది విశేషం.  రా దానే - రాతి=దదాతి . రః = ఇచ్చునది.

మేరు-భూ-జేతృ-అగా, = మేరువును మించిన రైవతకగిరి గలది, (అంటే, రైవతకగిరి మీద ఉన్న రుక్మిణి అని. అక్కడ ఉన్నప్పుడే నారదుడు పారిజాతం ఇచ్చాడని ఒక పురాణకథ.)
పీతా,సా =  గౌరవర్ణ ఐన ఆ రుక్మిణి,
క-అణు-రే, గో-సుమే, అ-రసా = కొద్దిపాటి  ఆనందాన్ని ఇచ్చే భూలోకపుష్పాల మీద కోరిక లేనిదై,
భాస్వతా, తేన, పారిజాతేన,సమాన-అమరా = ప్రకాశిస్తున్న ఆ పారికాతం వలన దేవతలతో సమానురాలై,
అ-ఖేదా, సదా, మోదికా = ఖేదము లేకుండ, నిత్యము సంతోషవతియై,
నవా, వా (వా=ఇవ), యాదవే, అభాత్ = కొత్త రూపం పొందినదాని వలె, శ్రీకృష్ణునియొద్ద వెలిగిపోయెను.

హా = అద్భుతము!

తాత్పర్యము

మేరువును మించిన రైవతకంమీద ఉన్న రుక్మిణి, అల్పసుఖాన్ని ఇచ్చే సాధారణభూలోకపుష్పాలను కోరక, ధగధగలాడుతున్న ఆ పారిజాతాన్ని ధరించటద్వారా,దేవతలతో సమానమై, ఏ విధమైన బాధ లేక, నిత్యసంతోషవతియై, క్రొత్త అందం వచ్చినదాని లాగా, కృష్ణుని దగ్గర మెరిసిపోయింది. అది అద్భుతం. పారిజాతధారణంతో రుక్మిణికి క్రొత్త శోభ వచ్చిందని సారాంశం.

ఇక,రాబోయే పద్యంలో, రాముడు అయోధ్యకువచ్చి సీతతో కలసి ఉండటాన్ని విలోమంలోను,రుక్మిణి కృష్ణుడితో కలసి ఇంటికి వెళ్ళటాన్ని అనులోమంలోను, చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

8. సారసాసమధాతాక్షిభూమ్నాధామసుసీతయా
సాధ్వసావిహరేమేక్షేమ్యరమాసురసారహా

ఇది అనుష్టుప్పు.

ఈ పద్యంలో, రాముడు అయోధ్యకువచ్చి సీతతో కలసి ఉండటాన్ని చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

పదవిభాగము :

సారస-అసమ-ధాతా, అక్షి-భూమ్నా, ధామసు, సీతయా, సాధు, అసౌ, ఇహ, రేమే, క్షేమీ, అరమ్, ఆసుర-సారహా.

సమాసములు

సారసానామ్ అసమమ్ దధాతి ఇతి, సారసాసమధాతా = సారసములకు అసమమును(అసాధుత్వమును) కలిగించువాడు, సారసాసమధాతా.
అక్ష్ణోః భూమా, అక్షిభూమా = అక్షుల భూమము, అక్షిభూమా.
అక్షిభూమ్నా – తృతీయా
అసురానామ్ సంబంధీ, ఆసురః = అసురలకు సంబంధించినది, ఆసురః.
ఆసురశ్చ అసౌ సారః, ఆసురసారః = ఆసురమైన సారము, ఆసురసారః.
ఆసురసారం హంతి ఇతి, ఆసురసారహా = ఆసురసారమును హరించువాడు, ఆసురసారహా (రాముడు).

అన్వయము:

అరమ్, అసుర-సార-హా, క్షేమీ, అక్షి-భూమ్నా, సారస-అసమ-ధాతా, అసౌ, ఇహ, ధామసు, సీతయా, రేమే.

అర్థము:

అరమ్=శీఘ్రముగా. హా= హరించువాడు. భూమా= మహిమ. అసమమ్ (భావార్థంలో) =అసాధుత్వము . ధాతా = కలిగించువాడు. ధామ=నిలయం, మందిరం. రేమే = అరమత. రము-క్రీడాయాం ధాతువు ఆత్మ- లిట్.

క్షేమీ = క్షేమముగలవాడు,
అరమ్, ఆసుర-సార-హా = క్షణంలో రాక్షసుల బలమును హరించువాడు,
అక్షి-భూమ్నా, సారస-అసమ-ధాతా = తన నేత్రమహిమతో పద్మాలను మంచివి కావనిపించే వాడు, ఐన
అసౌ (రామః), సీతయా = ఆ రాముడు, సీతతో కలసి
ఇహ, ధామసు, సాధు, రేమే = అయోధ్యలో భవనములలో చక్కగా విహరించెను.

తాత్పర్యము

కుశలముగాఉన్నవాడు, అసురుల బలమును క్షణములో హరించే వాడు, తన నేత్రసౌందర్యం ముందు పద్మాలు కూడ మంచివికావనిపించేవాడు, ఐన రాముడు, అయోధ్యానగరసౌధాలలో సీతతో చక్కగా విహరించెను.
రాముడు సీతతో అయోధ్యలో క్రీడిస్తూ ఉన్నాడని సారాంశం.

ఇక, విలోమంలో, రుక్మిణి కృష్ణుడితో కలసి ఇంటికి వెళ్ళటాన్ని చెప్పుతున్నాడు.

**హారసారసుమారమ్యక్షేమేరేహవిసాధ్వసా**

**యాతసీసుమధామ్నాభూక్షితాధామససారసా**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

హార-సార-సుమా, రమ్య-క్షేమ-ఇరా, ఇహ, విసాధ్వసా, యా, అతసీ-సుమ-ధామ్నా, భూక్షితా, ధామ, ససార, సా.

సమాసములు

హార ఇవ సారమ్ (శ్రేష్ఠమ్), హారసారమ్ = హారమువలె సార(శ్రేష్ఠ)మైనది, హారసారమ్.

హారసారమ్ చ తత్ సుమమ్, హారసారసుమమ్ = హారసారమైన సుమము, హారసారసుమమ్.

హారసారసుమమ్ అస్యా అస్తి ఇతి, హారసారసుమా = హారసారసుమము గలది, హారసారసుమా. (రుక్మిణి)

రమ్యమ్ చ  తత్ క్షేమమ్, రమ్యక్షేమమ్ = రమ్యమైన క్షేమము, రమ్యక్షేమమ్.

రమ్యక్షేమస్య ఇరా (భూమిః) యాసా, రమ్యక్షేమేరా = రమ్యక్షేమమునకు ఇర ఎవరో ఆమె, రమ్యక్షేమేరా.

విగతమ్ సాధ్వసమ్ యస్యాః సా, విగతసాధ్వసా = సాధ్వసము పోయినది ఎవరికో ఆమె, విగతసాధ్వసా.

అతసీ ఇతి సుమమ్, అతసీసుమమ్ = అతసి అనే సుమము, అతసీసుమమ్.

అతసీసుమస్య ఇవ ధామ యస్య సః, అతసీసుమధామా = అతసీసుమమువంటి కాంతి ఎవనికో వాడు, అతసీసుమధామా.

అతసీసుమధామ్నా – తృతీయా.

అన్వయము:

హార-సార-సుమా, రమ్య-క్షేమ-ఇరా, ఇహ, విసాధ్వసా, యా, సా, అతసీ-సుమ-ధామ్నా, భూ-క్షితా, ధామ, ససార.

అర్థము:

హారః=ముత్యాల దండ. సారం=శ్రేష్ఠము. ఇరా = భూమి/స్థానం. అతసీ=చీకటి కానుగు. సాధ్వసమ్= భయము. ధామ=గృహము.
ససార = వెళ్ళెను స్రు గతౌ ధాతువు - లిట్.

హార-సార-సుమా =ముత్యాల దండ వంటి శ్రేష్ఠమైన పుష్పాన్ని ధరించినది,
రమ్య-క్షేమ-ఇరా = మంచి క్షేమానికి నెలవైనది,
ఇహ, వి-సాధ్వసా, యా, సా (రుక్మిణీ) = ఇక్కడ (ద్వారకలో), భయం లేనిదైనది ఎవరో, ఆ రుక్మిణి,
అతసీ-సుమ-ధామ్నా, భూక్షితా = నల్ల కానుగు పూవు వంటి శరీరకాంతి గలవాడు, రాజు, ఐన కృష్ణునితో కలసి,
ధామ, ససార = ఇంటికి పోయెను.

తాత్పర్యము

ముత్యాలదండలాంటి ఆ పారిజాతాన్ని ధరించినది, క్షేమానికి నెలవు ఐనది, ఏ విధమైన జంకు లేనిది, ఐన ఆ రుక్మిణి, నల్లకానుగు పూవు వంటి మేనికాంతి గల కృష్ణునితో కలసి ఇంటికి పోయెను.
రుక్మిణి పారిజాతం ధరించి, కృష్ణుడితో కలసి ఇంటికి వెళ్ళిందని సారాంశం.

అక్షిధామ్నా, భూక్షితా, రమ్యక్షేమ మొదలైన గొట్టు పదాలను వాడుతూ కూడ, రెండు వైపుల రెండు అర్థాలను ఎంత అనాయాసంగా కవి నడిపాడో చూడండి.

ఇక, రానున్న పద్యంలో, కైక తన కొడుకు భరతుడికోసం రాజ్యాన్ని అడగటాన్ని అనులోమంలోను, పారిజాతాన్ని రుక్మిణికి ఇచ్చినందుకు సత్యభామ కోపించటాన్ని ప్రతిలోమంలోను, చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

9. సాగసాభరతాయేభమాభాతా మన్యుమత్తయా
సాత్రమధ్యమయాతాపేపోతాయాధిగతా రసా

ఇది అనుష్టుప్పు.

కైక తన కొడుకు భరతుడికోసం రాజ్యాన్ని అడగటాన్ని అనులోమంలో చెప్పుతున్నాడు.

పదవిభాగము :

స-ఆగసా, భరతాయ, ఇభ-మా-భాతా, మన్యుమత్తయా, సా, అత్ర, మధ్యమయా, తాపే, పోతాయ, అధిగతా, రసా.

సమాసములు

ఆగసా సహితా సాగాః = ఆగస్సుతో కూడినది, సాగాః
సాగసా-తృతీయావిభక్తి.
ఇభానామ్ మా ఇభమా = ఇభముల యొక్క మా (లక్ష్మి), ఇభమా.
ఇభమయా భాతా, ఇభమాభాతా = ఇభమతో శోభించినది, ఇభమాభాతా.
మన్యుః అస్య అస్తి ఇతి, మన్యుమాన్ = మన్యువు ఉన్నవాడు, మన్యుమాన్.
మన్యుమతః లక్షణమ్, మన్యుమత్తా = మన్యుమంతుని లక్షణం, మన్యుమత్తా.
మన్యుమత్తయా – తృతీయా.

అన్వయము:

అత్ర (అయోధ్యాయామ్), ఇభ-మా-భాతా, సా, రసా, మన్యుమత్తయా, తాపే (ఇది సతి సప్తమి) సాగసా, మధ్యమయా (భార్యయా), పోతాయ, అధిగతా (దశరథాత్).

అర్థము:

ఇభః = ఏనుగు. మా=లక్ష్మి. భాతా = శోభించినది (భా ధాతువు మీద క్తప్రత్యయం, స్త్రీలింగం). రసా= భూమి. ఆగః (స్) = పాపము. మధ్యమా= మధ్యమభార్య (కైకయి). పోతః = కొడుకు (భరతుడు).

ఇక్కడ కైకను దశరథుని మధ్యమభార్యగా చెప్పాడు కవి. అంటే, ముగ్గురిలో మధ్యది అని కాదు. మధ్యమా అంటే మూడవది అని సంఖ్యాపరమైన అర్థం.

అత్ర = అయోధ్యలో,

తాపే (సతి సప్తమి), మన్యుమత్తయా = తనకు (కైకకు) సంతాపము కలుగగా, కోపముతో ఉండుటచేత,

సాగసా ,మధ్యమయా (భార్యయా) = పాపముతొ కూడినదైన మూడవ భార్యచేత (కైకచేత),

పోతాయ = తన బిడ్డకొరకు (భరతునికొరకు)

ఇభ-మా-భాతా, సా, రసా = గజసంపదతో శోభిల్లిన ఆ భూమి (రాజ్యం),

అధిగతా (దశరథాత్). = పొందబడెను (దశరథునినుండి)

తాత్పర్యము:

తనకొడుకుకు రాజ్యం రాక బాధగలిగి, కోపంతో, పాపపు బుద్ధి ఉన్న కైక, గజసంపదతో శోభించే రాజ్యాన్ని తన కొడుకుకోసం దశరథునినుండి పొందింది. అలిగిన కైక, భరతుడికోసం రాజ్యాన్ని అడిగి దశరథుడిచేత ఇప్పించుకొన్నదని సారాంశం.

ఇక, విలోమంలో, పారిజాతాన్ని రుక్మిణికి ఇచ్చినందుకు సత్యభామ కోపించటాన్ని చెప్పుతున్నాడు.

ప్రతిలోమము - యాదవీయము:

సారతాగధియాతాపో పేతాయామధ్యమత్రసా

యాత్తమన్యుమతాభామాభయేతారభసాగసా

పదవిభాగము:

సారతా-గ-ధియా, తాప-ఉపోపేతా, యా, మధ్యమ-త్రసా, యా, ఆత్త-మన్యు-మతా, భామా, భయ-ఇతా, రభస-ఆగసా.

సమాసములు

సారమ్ = శ్రేష్ఠమ్.
సారస్య భావః, సారతా = సారముయొక్క భావము, సారతా.
సారతామ్ (శ్రేష్ఠతామ్) గచ్ఛతి ఇతి, సారగా = సారతను పొందునది, సారతాగా.
సారతాగా చ సా ధీః, సారతాగధీః = సారతను పొందు ధీ, సారతాగధీః.
సారతాగధియా – తృతీయా.
తాపేన ఉపోపేతా, తాపోపేతా = తాపముచేత ఉపోపేత (పొందబడినది), తాపోపేతా.
మధ్యమం త్రస ఇవ యస్యాః సా, మధ్యమత్రసా = మధ్యమము త్రస వలె ఎవరికో ఆమె, మధ్యమత్రసా.
మన్యుః ఏవ మతమ్, మన్యుమతమ్ = మన్యువే మతము, మన్యుమతమ్ (కోపబుద్ధి).
ఆత్తమ్ మన్యుమతమ్ యస్యాః సా, ఆత్తమన్యుమతా = ఆత్తమైన మన్యుమతము ఎవరికో ఆమె, ఆత్తమన్యుమతా (పొందబడినకోపబుద్ధి గలది).
రభసేన కృతం ఆగః, రభసాగః = రభసంతో చెయబడిన ఆగస్సు, రభసాగః. రభసాగసా

– తృతీయా.

భయమ్ ఇతా ఇతి, భయేతా == భయమును పొందినది, భయేతా.

అన్వయము:

యా, మధ్యమ-త్రసా, యా, సారతా-గ-ధియా, భయ-ఇతా, సా. భామా, రభస-ఆగసా, ఆత్త-మన్యు-మతా, తాప-ఉపేతా (బభూవ).

అర్థము:

మధ్యమమ్ = నడుము. త్రసః = సన్నని రేణువు. సారమ్ = శ్రేష్ఠమ్. గః/గా/గమ్ = పొందునది. ధీః = బుద్ధి. ఇతా = పొందినది (ఇణ్ ధాతువు మీద క్త, స్త్రీలింగం). రభసః = తొందర. ఆగః (స్) = అపరాధము. ఆత్తమ్ = పొందబడినది. మన్యుః = కోపము. మతమ్ = మనసు,భావము. ఉప+ఇతా = పొందెను.

యా, మధ్యమ-త్రసా = ఎవరైతే, త్రసరేణువు వంటి సన్నని నడుముగలదో,
యా, సారతా-గ-ధియా, భయ-ఇతా = ఎవరైతే, తాను శ్రేష్ఠను అనే బుద్ధితో ఉంటుందో, అందుకే ఎవరైతే భయాన్ని పొందినదో,
సా. భామా = ఆ సత్యభామ,
రభస-ఆగసా = తొందరపాటుతో చేసిన (కృష్ణుడి) అపరాధంచేత
ఆత్త-మన్యు-మతా = పొందబడిన కోపభావం కలదై,
తాప-ఉపేతా (బభూవ) = బాధను పొందెను.

తాత్పర్యము

తాను అందరికంటె గొప్పదానను అనుకొనే అందగత్తె సత్యభామ, కృష్ణుడు రుక్మిణికి పారిజాతాన్ని ఇవ్వటంద్వారా తొందరపాటుతో చేసిన అపరాధానికి కోపఒ తెచ్చుకొని, బాధ పడినది.

కృష్ణుడు రుక్మిణికి పారిజాతాన్ని ఇవ్వటం అనేదానిని అపరాధంగా భావించిన సత్యభామ, తన శ్రేష్ఠత్వానికి హాని వచ్చిందని, అలిగి సంతాపపడ్డది అని సారాంశం.

ఇక, రాబోయే పద్యంలో, కైక రాముడిని అడవులకు పంపటాన్ని అనులోమంలోను, సత్యభామ కోపాన్ని ప్రతిలోమంలోను,చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

10. **తానవాదపకోమాభా రామే కాననదాససా**
**యాలతావృద్ధసేవాకా కైకేయీమహదాహ హ**

ఇది అనుష్టుప్పు.
కైక రాముడిని అడవులకు పంపటాన్ని అనులోమంలో చెప్పబోతున్నాడు.

పదవిభాగము :

తానవాత్, అప-కా, ఉమా-భా, రామే, కాననదా, ఆస, సా. యా, లతా,అ-వృద్ధ-సేవాకా, కైకేయీ, మహ-దా, హహ .

సమాసములు

అపగతం కం యస్యాః సా, అపకా = అపగతమైన కం(సుఖం) ఎవరికో ఆమె, అపకా.

ఉమా(హరిద్రా) ఇవ ఆభా యస్యాః సా, ఉమాభా = ఉమ(పసపు) వంటి భా(కాంతి) ఎవరికో ఆమె, ఉమాభా.

వృద్ధానామ్ సేవా, వృద్ధసేవా = వృద్ధులయొక్క సేవ, వృద్ధసేవా.

న విద్యతే వృద్ధసేవా యస్యాః సా, అవృద్ధసేవాకా = వృద్ధసేవ లేనిది ఎవరికో ఆమె, అవృద్ధసేవాకా.

కాననాని దదాతి ఇతి, కాననదా = కాననములను ఇచ్చునది, కాననదా.

మహమ్ ద్యతి ఇతి , మహదా = మహమును ఖండించునది, మహదా.

అన్వయము:

ఉమా-భా, అప-కా, తానవాత్, లతా, యా, అ-వృద్ధ-సేవాకా, సా, కైకేయీ, రామే, మహ-దా, కానన-దా, ఆస. హహ!

అర్థము:

ఉమా = పసపు.   భా= కాంతి.   తానవమ్ = కృశత్వము.   మహః = ఉత్సవము.
దా (దో అవఖండనే ) = ఖండించునది.    దా (దా దానే) = ఇచ్చునది.

ఉమా-భా = పసపు వంటి కాంతిగలది,

అప-కా = తొలగిపోయిన సుఖము గలది,

తానవాత్, లతా = కృశత్వంవలన తీగలాగా ఉన్నది,

అ-వృద్ధ-సేవాకా, యా , సా, కైకేయీ = వృద్ధుల సేవ లేనిది ఎవరో ఆ కైకేయి,
రామే, మహ-దా, కానన-దా = రామునిపట్ల, (రాజ్యాభిషేకపు) ఉత్సవాన్ని
ఖండించునదియు, అడవులను ఇచ్చునదియు,
ఆస = అయ్యెను. (ఇక్కడ ఆస అనేది బభూవ అని అర్థం ఇచ్చే అవ్యయమే కాని,
క్రియాపదం కాదు అని కవి వ్యాఖ్యలో చెప్పాడు.)
హ హ = అయ్యో! విషాదము!

తాత్పర్యము

పెద్దలసేవ ఎరుగని కైకేయి,తన కొడుకుకు రాజ్యము రానందువలన హాయిగా ఉండలేక కృశించి, రాముని రాజ్యాభిషేకోత్సవాన్ని చెడగొట్టి, అతడిని అడవులపాలు చేసింది.

కైక, అసూయతో రాముని రాజ్యాభిషేకాన్ని చెరచి, అతడిని అడవులకు పంపింది, అని సారాంశము.

ఇక, విలోమంలో, సత్య కోపాతిశయాన్ని చెప్పబోతున్నాడు.

హహ దాహమయీ కేకైకావాసేద్ధవృతాలయా
సాసదాననకామే రాభామాకో పదవానతా

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

హహా, దాహమయీా, కేకా-ఏక-ఆవాస-ఇద్ధ-వృత-ఆలయా, సా, సత్-ఆననకా, ఆమ-ఇరా, భామా, కోప-దవ-ఆనతా.

సమాసములు

కేకా-ఏక-ఆవాస-ఇద్ధ-వృత-ఆలయా.

కేకానామ్ ఏకః ఆవాసః, కేకైకావాసః = కేకలకు ఏకమైన ఆవాసము, కేకైకావాసః (నెమలి కూతలకు ప్రముఖస్థానం.).

కేకైకావాసః చ ఇద్ధః చ వృతః చ సః ఆలయః,

కేకైకావాసేద్ధవృతాలయః = కేకైకావాసము సమృద్ధము వృతము ఐన ఆలయము, కేకైకావాసేద్ధవృతాలయః

కేకైకావాసేద్ధవృతాలయః యస్యాః సా, కేకైకావాసేద్ధవృతాలయా= కేకైకావాసేద్ధ వృతాలయము ఎవరికో ఆమె, కెకైకావాసేద్ధవృతాలయా.

సత్-ఆననకా,

ఆననమ్ ఏవ, ఆననకమ్ (స్వార్థకప్).

సత్ ఆననకమ్ యస్యాః సా, సదాననకా = మంచి ఆనననకము ఎవరికో ఆమె, సదాననకా.

ఆమ-ఇరా

ఆమస్య ఇరా, ఆమేరా = ఆమమునకు ఇర, ఆమేరా.

కోప-దవ-ఆనతా

కోపః ఇతి దవః, కోపదవః = కోపము అను దవము, కోపదవః.

కోపదవేన ఆనతా, కోపదవానతా = కోపదవముచేత ఆనత, కోపదవానతా.

అన్వయము:

దాహమయీ, కేకా-ఏక, ఆవాస-ఇద్ధ-వృత-ఆలయా, సత్-ఆననకా (స్వార్థకప్), సా, భామా, కోప-దవ-ఆనతా, ఆమ-ఇరా, (బభూవ).

అర్థము:

కేకా = నెమలి కూత. మనం తెలుగులో పెట్టే కేక వేరు, నెమళ్ళు సంస్కృతంలో పెట్టే ఈ కేకా/కేక వేరు. కేకా/కేక పెట్టేది కాబట్టే, నెమలికి కేకీ అని పేరు.

ఏకః = ముఖ్యము. ఇద్ధః = సమృద్ధము. వృతః = పిహితము, మూయ బడినది.

సత్ = మంచిది. ఆననకమ్=ఆననమ్=ముఖము. ఆమః = రోగము (ఇక్కడ ఆమః- రోగం అంటే దానివలన వచ్చిన ఖేదం అని భావం.). ఇరా = భూమి/స్థానము. దవః = వనాగ్ని. ఆనతా = నమ్ర, క్రుంగిపోయినది.

సత్-ఆననకా (స్వార్థకప్) = మంచి ముఖముగల

సా, భామా = ఆ సత్యభామ

దాహమయీ = మిక్కిలి సంతాపముగలదై,

కేకా-ఏక, ఆవాస-ఇద్ధ-వృత-ఆలయా = నెమలి కేకలకు నిలయము, సమృద్ధము, తలుపులు మూసినది ఐన గృహము గలదై,

కోప-దవ-ఆనతా = కోపం అనే దావాగ్నిచేత క్రుంగి పోయినదై,

ఆమ-ఇరా, (బభూవ) = ఖేదమునకు స్థానము అయ్యెను.

తాత్పర్యము

అందగత్తె ఐన ఆ సత్యభామ, కోపం దావాగ్నిలాగా రేగగా, దానిని తట్టుకోలేక, నెమలి కేకలతో నిండి ఉండే తన భవనపు తలుపులు మూసుకొని, తనకు సంతాపము అధికముకాగా, దుఃఖమునకు స్థానమైపోయెను.

కృష్ణుడి మీద అలిగిన సత్య, విపరీతమైన కోపంతో, తన భవనపు తలుపులు మూసి, దుఃఖపడుతూ లోపల ఉన్నదని సారాంశం.

ఇక, తరువాతి శ్లోకంలో, తండ్రిమాటమేరకు రాముడు అడవికి పోవటాన్ని అనులోమంలోను, సత్యభామను ఊరడించటానికి ఆమె యింటికి కృష్ణుడు పోవటాన్ని ప్రతిలోమంలోను, చెప్పుతున్నాడు.

11. వరమానదసత్యాసప్రీతపిత్రాదరాదహో
    భాస్వరస్థిరధీరోపహారోరావనగామ్యసౌ

ఇది అనుష్టుప్పు.

పదవిభాగము :

వర-మాన-ద-సత్య-ఆస-ప్రీత-పితృ-ఆదరాత్, అహో, భాస్వరః, స్థిర-ధీరః, అపహార-ఉరాఃవన-గామీ, అసౌ.

సమాసములు

వర-మాన-ద-సత్య-ఆస-ప్రీత-పితృ-ఆదరః

( ఇక్కడ వ్యాఖ్యలో, "వరాణామ్-శ్రేష్ఠానామ్, మానదే-పూజాప్రదే, సత్యాసః-సత్య నిరసనమ్, తతః ప్రీతే-లజ్జితే" అని వ్రాసాడుగాని, వరమానదమునందు సత్యనిరసనం ఏమిటా అని నాకు శంక / నా కుశంక! వరమానద శబ్దాన్ని సత్యాసశబ్దంతో అన్వయించటంకంటె, వరమానదశబ్దాన్ని కేవలసత్యశబ్దంతో అన్వయించి, 'వరమానదసత్యముయొక్క ఆసమువలన ప్రీతుడు' అని అనవచ్చేమో అనిపిస్తున్నది. ఇంకొకరకంగా, వరమానదశబ్దాన్ని సత్యాసశబ్దంతోనే అన్వయించాలంటే గనుక, మానదః = పూజా ప్రదః అన్న అర్థంకంటె, మాన-దః = గౌరవమును ఖండించునది, అనే అర్థం బాగా సరిపోతుందని నా ఊహ. కనుక, మానదః అంటే 'మానమ్ దదాతి' అని కాకుండ, 'మానమ్ ద్యతి (=ఖండయతి)' అని చెప్పవచ్చు. ఒకవేళ, ఇదంతా ఆకాశముష్టిహననమే నేమో! ఏదైన సవరణ ఉంటే పెద్దలు తెలుపగలరు.)

వర-మాన-ద-సత్య-ఆస-ప్రీత-పితృ-ఆదరః

దీనికి ఒక విధంగా విగ్రహవాక్యం:

వరాణామ్ మానమ్ దదాతి ఇతి, వరమానదమ్ = వరులకు మానమును ఇచ్చునది, వరమానదమ్.

వరమానదం చ తత్ సత్యం చ, వరమానదసత్యమ్ = వరమానదమైన సత్యము, వరమానదసత్యమ్.

వరమానదసత్యస్య ఆసః, వరమానదసత్యాసః = వరమానదసత్యముయొక్క ఆసము, వరమానదసత్యాసః.

వరమానదసత్యాసాత్ ప్రీతః, వరమానససత్యాసప్రీతః.

దీనికి రెండవ విధంగా విగ్రహవాక్యం:

మానమ్ ద్యతి ఇతి, మానదః = మానమును ఖండించునది, మానదః.

వరాణామ్ మానదః, వరమానదః = వరులకు(శ్రేష్ఠులకు) మానదము, వరమానదః.

సత్యస్య ఆసః, సత్యాసః = సత్యముయొక్క ఆసము, సత్యాసః.

వరమానదః చ సః సత్యాసః, వరమానదసత్యాసః = వరమానదమైన సత్యాసము, వరమానదసత్యాసః.

వరమానదసత్యాసాత్ ప్రీతః, వరమానదసత్యాసప్రీతః = వరమానద సత్యాసమువలన ప్రీతుడు, వరమానదసత్యాసప్రీతః.

వరమానదసత్యాసప్రీత చ, సః పితా, వరమానదసత్యాసాప్రీతపితా= వర మానదసత్యాసప్రీతుడైన పిత, వరమానదసత్యాసప్రీతపితా.

వరమానదసత్యాసప్రీతపితరి ఆదరః, వరమానదసత్యాసప్రీతపిత్రాదరః = వర మానదసత్యాసప్రీతపిత యందలి ఆదరము, వరమానదసత్యాసప్రీతపిత్రాదరః.

వరమానదసత్యాసప్రీతపిత్రాదరాత్ – పంచమీ.

వ్రాసేదేమో అనులోమవిలోమకావ్యం! అందునా గద్యం కాదు, ఛందోబద్ధం! అక్కడకూడ చేదతాడు అంత సమాసం ఇరికించాడంటే, కవి ఎంత ప్రతిభాశాలి!

స్థిరధీరః

స్థిరః చ సః ధీరః, స్థిరధీరః = స్థిరుడైన ధీరుడు, స్థిరధీరః.

అపహారోరాః

అపగతాః హారాః యస్మాత్ తత్, అపహారమ్ = అపగతములైన హారములు దేనినుండియో అది, అపహారమ్.

అపహారం చ తత్ ఉరః చ, అపహారోరః = అపహారములైన ఉరము, అపహారోరః.
అపహారోరః యస్య సః, అపహారోరాః = అపహారోరస్సు ఎవనికో వాడు, అపహారోరాః (స్).
వనగామీ
వనాని గచ్ఛతి ఇతి, వనగామీ = వనములనుగురించి గమించువాడు, వనగామీ = వనములకు వెళ్ళువాడు.

అన్వయము:

వర-మాన-ద-సత్య-ఆస-హ్రీత-పితృ-ఆదరాత్, భాస్వర-స్థిర-ధీరః, అప-హార-ఉరాః, అసౌ (రామః), వన-గామీ.

అర్థము:

వరః= శ్రేష్ఠుడు. మానః=అభిమానము, గౌరవము. దః=ఖండించునది.
ఆసః = నిరసనము. హ్రీతః = లజ్జితుడు. అపహారమ్ = హారములు తొలగిపోయినది (ఉరము).

వర-మాన-ద-సత్య-ఆస-హ్రీత-పితృ-ఆదరాత్ = శ్రేష్ఠులకు గౌరవహాని కలిగించు సత్యనిరసనమునకు లజ్జితుడైన తండ్రిమీది ప్రేమతో,
భాస్వరః = ప్రకాశమానుడు,
స్థిర-ధీరః = స్థిరుడు, ధీరుడు ఐన
అసౌ (రామః) = ఆ రాముడు,

అప-హార-ఉరాః = హారములు తొలగిపోయిన వక్షస్స్థలము కలవాడై,

వన-గామీ (బభూవ)= వనములకు వెళ్ళువాడు అయ్యెను.

అహో! = ఆశ్చర్యము!

తాత్పర్యము

సజ్జనులకు గౌరవాన్ని పోగొట్టే సత్యభంగమువలన సిగ్గిల్లుచున్న తండ్రిమీద ప్రేమతో - స్థిరుడు, ధీరుడు, ప్రకాశమానుడు ఐన రాముడు, హారాదులగు అలంకారాలను వదలి, అడవులకు పోయెను.

తండ్రికి వాగ్దానభంగం వలన అపకీర్తి రాగూడదని, రాముడు సాధారణవేషంతో అడవికి వెళ్ళాడని సారాంశం.

ఇక, ప్రతిలోమంలో, సత్యభామను ఊరడించటానికి ఆమె యింటికి కృష్ణుడు పోవటాన్ని చెప్పుతున్నాడు.

**సౌమ్యగానవరారోహాపరో, ధీరస్థిరస్వభాః,**

**హోదరాదత్రాపితహ్రీసత్యాసదన మార వ**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

సౌమ్య-గాన-వరారోహా-పరః, ధీరః, స్థిర-స్వ-భాః, హో (హః ఇతి చ. హః=హరిః.),

దరాత్, అత్ర, ఆపిత-హ్రీ-సత్యా-సదనమ్, ఆర, వ.

సమాసములు

సౌమ్య-గాన-వరారోహా-పరః
సౌమ్యం చ తత్ గానమ్, సౌమ్యగానమ్ = సౌమ్యమైన గానము, సౌమ్యగానమ్
సౌమ్యగానమ్ యస్యాః సా, సౌమ్యగానా =సౌమ్యగానము ఎవరికో ఆమె,
సౌమ్యగానా.
సౌమ్యగానాః చ వరారోహాః చ, సౌమ్యగానవరారోహాః = సౌమ్యగానయు,
వరారోహయు ఐనది, సౌమ్యగానవరారోహా.
సౌమ్యగానవరారోహాసు తత్పరః, సౌమ్యగానవరారోహపరః.
స్థిర-స్వ-భాః
స్థిరా చ స్వా చ భాః యస్య సః, స్థిరస్వబాః = స్థిరమైన తన తేజస్సు గలవాడు,
స్థిరస్వభాః.
ఆపిత-హ్రీ-సత్యా-సదనమ్
ఆపితా హ్రీ యస్యాః సా, ఆపితహ్రీ = ఆపిత ఐన హ్రీ ఎవరికో ఆమె, ఆపితహ్రీ.
ఆపితహ్రీ చ సా సత్యా, ఆపితహ్రీసత్య = ఆపితహ్రీ  ఐన సత్య, ఆపితహ్రీసత్యా.
ఆపితహ్రీసత్యాయాః సదనమ్, ఆపితహ్రీసత్యాసదనమ్ = ఆపితహ్రీసత్యయొక్క
సదనము, ఆపితహ్రీసత్యాసదనమ్.

అన్వయము:

అత్ర, సౌమ్య-గాన-వరారోహా-పరః, స్థిర-స్వ-భాః, హః, ఆపిత-హ్రీ-సత్యా-సదనమ్,

దరాత్, వ (అత్ర వశబ్దః ఇవార్థకః.),ఆర.

అర్థము:

స్వమ్ = తనది.  భాః (స్)= కాంతి.  హో = సంబుద్ధివాచకం.  లేదా, హః=హరి.
హ్రీ=సిగ్గు.  దరః/దరమ్ = భయము.   వ=వలె.  ఆర (ఋ గతౌ ధాతువు – లిట్) = పొందెను

అత్ర = ఇక్కడ, ద్వారకలో,
సౌమ్య-గాన-వరారోహా-పరః = మంచి సంగీతంపాడే స్త్రీలను చూచి ఆనందించేవాడు,
స్థిర-స్వ-భాః = శాశ్వతమైన తన తేజస్సుగలవాడు, ఐన
హః = హరి, కృష్ణుడు,
ఆపిత-హ్రీ-సత్యా-సదనమ్ = సిగ్గిలజేయబడిన సత్య యొక్క గృహమును,
దరాత్, వ (ఇక్కడ వశబ్దం ఇవార్థకం..), ఆర = జంకుతో చేరినట్లు చేరెను.

తాత్పర్యము

గాననిపుణలైన స్త్రీల గానాన్నిఅనందించేవాడు, స్థిరమైన తేజస్సుగలవాడు, ఐన హరి (కృష్ణుడు), రుక్మిణికి పారిజాతం ఈయటంద్వారా తనచేత సిగ్గుపడ జేయబడిన సత్య యొక్క ఇంటిని, జంకుతో చేరినట్లుగా చేరెను.
సవతికి దక్కిన గౌరవంవలన అవమానం పొందిన సత్య ఇంటికి కృష్ణుడు జంకుతున్నట్లుగా వచ్చాడని సారాంశం.

ఇక, తరువాతి పద్యంలో, సీత రాముడితో అడవికి వెళ్ళటాన్ని అనులోమంలోను, సత్యభామ శ్రీకృష్ణుని పట్టించుకోకపోవటాన్ని విలోమంలోను, చెప్పుతున్నాడు.

12. యానయానఘధీతాదా రసాయాస్తనయాదవే
   సాగతాహివియాతాహ్రీసతాపానకిలోనభా

ఇది అనుష్టుప్పు.

సీత రాముడితో అడవికి వెళ్ళటాన్ని చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

పదవిభాగము :

యా, నయ-అనఘధీతా-దా, రసాయాః, తనయా, దవే, సా, గతా, హి, వియాతా, హ్రీ-స-తాపా-న, కిల, ఊన-భా.

సమాసములు

నయ-అనఘ-ధీతా-దా

నయేన అనఘా, నయానఘా = నయముచేత అనఘ, నయానఘా.

నయానఘా చ సా ధీః, నయానఘధీ = నయానఘ ఐన ధీ, నయానఘధీః.

నయానఘధియః భావః లక్షణః వా, నయానఘధీతా.

నయానఘధీతామ్ దదాతి ఇతి, నయానఘధీతాదా = నయానఘధీతను ఇచ్చునది, నయానఘధీతాదా.

హ్రీ-స-తాపా

తాపేన సహితా, సతాపా = తాపముతో కూడి ఉన్నది, సతాపా.

హ్రియా సతాపా యా సా, హ్రీసతాపా = హ్రీతో సతాప ఐనది, హ్రీసతాపా.

ఊన-భా

ఊనా భా యస్యాః సా ఊనభా = ఊన ఐన భా ఎవరికో ఆమె, ఊనభా.

అన్వయము:

నయ-అనఘ-ధీతా-దా, యా,సా, రసాయాః, తనయా, వియాతా, హ్రీ-స-తాపా, దవే (=వనే), గతా, హి, న, కిల, ఊన-భా.

అర్థము:

నయః=శాస్త్రము, నీతి, పద్ధతి. ధీః=బుద్ధి. దా=ఇచ్చునది. రసా=భూమి. వియాతా = శంకలేనిది, ధైర్యవతి (వియాతః=నిశ్శంకః). హ్రీ=సిగ్గు. దవః = వనము (దవ దావ శబ్దాలకు, దావాగ్ని అనే అర్థంతోపాటు, అడవి అనే అర్థం కూడ ఉన్నది.). ఊనా = తక్కువైనది. భాః= కాంతి.

నయ-అనఘ-ధీతా-దా, యా = శాస్త్రంద్వారా అనఘబుద్ధిత్వమును కలిగించునది ఎవరో,

సా, రసాయాః, తనయా = ఆ భూమిసుత, సీత,

వియాతా = జంకు లేనిదై,

హ్రీ-స-తాపా = సిగ్గుతో సంతాపము కలదై,

దవే (=వసే), గతా, హి అడవికి పోయెను సుమా!

ఊన-భా, న, కిల = తగ్గిన తేజస్సుకలది మాత్రము కాలేదట!

తాత్పర్యము

శాస్త్రపద్ధతులద్వారా అనఘమైన బుద్ధిని ఈయగల సీత, తన భర్త అభిషేకము చెడినందుకు సిగ్గు, తాపము కలిగినప్పటికి, ముఖకాంతి ఏ మాత్రము తగ్గకుండి, నిర్భయముగా అడవికి పోయెను.

సీత నిర్వికారంగా ధైర్యంగా అడవికి పోయిందని సారాంశం.

ఇక, విలోమంలో, సత్యభామ శ్రీకృష్ణుడిని పట్టించుకోలేదని  చెప్పుతున్నాడు

**భానలోకినపాతాసా ప్రీతాయావిహితాగసా**

**వేదయానస్తయాసార దాతాధీఘనయానయా**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

భాస్, అలోకి, న, పాతా, సః, ప్రీతా, యా, విహిత-ఆగసా, వేదయానః, తయా, సారదాతా, ధీ-ఘనయా, అనయా (సత్యయా) .

సమాసములు

విహిత-ఆగసా

విహితమ్ ఆగః విహితాగః = విహితమైన ఆగస్సు విహితాగః.

విహితాగసా – తృతీయా.

వేదయానః

వేదాః (=వేదాత్మకమ్) యానమ్ యస్య సః, వేదయానః = వేదములు (వేదాత్మకుడైన గరుడుడు) యానము ఎవనికో వాడు, వేదయానః.

సార-దాతా

సారస్య దాతా, సారదాతా = సారముయొక్క దాత, సారదాతా (గొప్పగా ఇచ్చువాడు)

ధీ-ఘనా

ధియా ఘనా, ధీఘనా = ధీచేత ఘన ఐనది, ధీఘనా

అన్వయము:

(ఆత్మని భర్త్రా) విహితాగసా, హ్రీతా, ధీ-ఘనతయా, తయా, అనయా (సత్యయా), సారదాతా, భాస్ (భా దీప్తౌ ధాతోః శత్రంతరూపమిదం), పాతా (పా రక్షణే ధాతోః తృజంతరూపమిదం), సః, వేదయానః, న, అలోకి.

అర్థము:

ఆగః(స్)= అపరాధము. హ్రీ=సిగ్గు. హ్రీతా=లజ్జితా. భాస్ (భా ధాతువు శత్రంతరూపం) = ప్రకాశించేవాడు. పాతా (పా ధాతువు-తృచ్ ప్రత్యయాంతరూపం)= కాపాడేవాడు. యానమ్ = వాహనము. వేదయానః = వేదాత్మకుడైన గరుడుడు వాహనముగాకలవాడు, కృష్ణుడు. న, అలోకి (లోకృ ధాతువు-కర్మణి-లుజ్-ప్ర.

పు. ఏ.)  = చూడబడలేదు.

వేదాత్మా విహగేశ్వరః అని, వైష్ణవసంప్రదాయములో గరుడుడు వేదాత్మకుడు..

(ఆత్మని భర్త్రా) విహితాగసా = (తనయెడ భర్తచేత) చేయబడిన అపరాధముకారణముగా

ధీ-ఘనతయా = బుద్ధియొక్క ఆధిక్యముచేత,

యా, హ్రీతా,తయా, అనయా (సత్యయా) ఏ సత్యభామ లజ్జించినదో, ఆ సత్యభామచేత,

సారదాతా = శ్రేష్ఠమైనవాటిని ఇచ్చువాడు,

భాస్ (భా దీప్తౌ ధాతోః శత్రంతరూపమిదం) = ప్రకాశించుచున్నవాడు,

పాతా (పా రక్షణే ధాతోః తృజంతరూపమిదం) = రక్షించువాడు, ఐన

సః, వేదయానః = ఆ గరుడవాహనుడు (కృష్ణుడు),

న, అలోకి = చూడబడలేదు.

తాత్పర్యము

భర్త సవతిని గౌరవించాడన్న అపరాధం కారణంగా,తన అభిమానాధిక్యం కొలది సిగ్గుపడి ఉన్న సత్యభామ - రక్షకుడు, దాత, తేజస్వి, గరుడవాహనుడు ఐన శ్రీకృష్ణుడిని చూడలేదు.

అలిగి ఉన్న సత్యభామ, తన దగ్గరకు వచ్చిన కృష్ణుడిని పట్టించుకోలేదని, అతడివైపు కన్నెత్తి కూడ చూడలేదని సారాంశం.

రాముడు అడవులకు పోతూ భరద్వాజాదిమునులను చూడటాన్ని అనులోమంలోను,  అలిగిన సత్యభామ కృష్ణుడికి ప్రసన్నం కావటాన్ని ప్రతిలోమంలోను, చెప్పుతున్నాడు.

13. రాగిరాధుతిగర్వాదారదాహోమహసాహహ

యానగాతభరద్వాజ మాయాసీదమగాహినః

ఇది అనుష్టుప్పు.

రాముడు అడవులకు పోతూ భరద్వాజాదిమునులను చూడటాన్నిచెప్పుతున్నాడు.
అనులోమము - రాఘవము:

పదవిభాగము :

రాగి-ర-ఆధుతి-గర్వ-అద-ఆర-దాహః, మహసా, హహ, యాన్, అగాత,
భరద్వాజమ్, ఆయాసీ, దమగాహినః.

సమాసములు

రాగి-ర-ఆధుతి-గర్వ-అద-ఆర-దాహః
రాగః అస్య అస్తి ఇతి, రాగి = రాగము కలది, రాగి.
రాగి చ రం చ , రాగిరమ్ = రాగియు, రముయు ఐనది, రాగిరమ్.
ఆధుతౌ గర్వః, ఆధుతిగర్వః = ఆధుతియందు గర్వము, ఆధుతిగర్వము.
దా న విద్యతే యస్య తత్, అదమ్ = దా లేనిది, అదమ్.
ఆధుతిగర్వేణ అదమ్ , ఆధుతిగర్వాదమ్ = ఆధుతిగర్వముచేత అదము,
ఆధుతిగర్వాదమ్.

అరీణాం సమూహః, ఆరమ్ = అరుల సమూహము, ఆరమ్.

రాగిరం చ,ఆధుతిగర్వాదం చ తత్ ఆరమ్, రాగిరాధుతిగర్వాదారమ్ =రాగి రము, ఆధుతిగర్వాదము ఐన ఆరము, రాగిరాధుతిగర్వాదారమ్.

రాగిరాధుతిగర్వాదారమ్ దహతీతి, రాగిరాధుతిగర్వాదారదాహః = రాగిరాధుతిగర్వాదారమును దహించువాడు, రాగిరాధుతిగర్వాదారదాహః

దమగాహినః

దమమ్ గాహంతే ఇతి, దమగాహినః = దమమును పొందువారు, దమగాహినః.

అన్వయము:

మహసా, రాగి-ర-ఆధుతి-గర్వ-అ-ద-ఆర-దాహః (అరీణాం సమూహః, ఆరమ్), యాన్, ఆయాసీ, భరద్వాజమ్, దమ-గాహినః, అగాత(గాజ్ గతౌ –లుజ్).హహ

అర్థము:

రాగి = రాగముకలది. రం=తీక్ష్ణము. ఆధుతిః=ఖండనము. దా=క్షాంతి, ఓర్పు. అ-దం=క్షాంతి లేనిది. ఆరమ్ (అరీణామ్ సమూహః, ఆరమ్ ) = అరుల సమూహము. దాహః = దహించువాడు. యాన్ = పోవుచున్న వాడు. ఆయాసీ = ఆయాసము(శ్రమ) కలవాడు. దమః = చిత్తప్రశాంతి. గాహీ=ప్రవేశించువాడు. అగాత (గా గతౌ ధాతువు లజ్ = చేరెను/పొందెను. హ హ = అయ్యో! (విషాదసూచకము.)

మహసా = తన తేజస్సుతో,

రాగి-ర-ఆధుతి-గర్వ-అ-ద-ఆర-దాహః = రాగముగలది, తీక్ష్ణము, ఖండించు

గర్వముచేత దాంతి లేనిది, ఐన శత్రుసమూహమును దహించువాడు , రాముడు, యాన్, ఆయాసీ, (రామః) = పోవుచు, శ్రమగలవాడై,

భరద్వాజమ్, దమ-గాహినః, అగాత (గాజ్ గతౌ –లుజ్) = భరద్వాజుని, శాంతులైన మునులను, చేరెను.

తాత్పర్యము

రాగదూషితము, తీక్ష్ణము, ఖండనగర్వమువలన క్షాంతిరహితము, ఐన శత్రుగణమును సంహరించు రాముడు, వనగమనశ్రమతో పోవుచు, భరద్వాజుని, దాంతులైన ఇతరమునులను, చూచెను.

శత్రుసంహారకుడైన రాముడు అడవులకు పోతూ భరద్వాజాది మునులను కలిసాడని సారాంశం.

ఇక, విలోమంలో, అలిగిన సత్యభామ కృష్ణుడికి ప్రసన్నం కావటాన్ని చెప్పుతున్నాడు.,

**నోహిగామదసీయామాజద్వారభతగానయా**

**హహసాహమహోదార దార్వాగతిధురాగిరా**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

నో, హి, గామ్, అదసీయామ్, ఆజత్, వా, ఆరభత, గాః, న, యా, హహ, సా, ఆహ,

మహోదారదార్వాగతిధురాగిరా. (వ్యాఖ్యలో దారు అని నపుంసక లింగంగా చెప్పాడుగాని, సర్వశబ్దసంబోధినీనిఘంటువులో దారుః అని పుంలింగరూపం కూడ ఉన్నది. దీనికి దేవదారువృక్షం అని అర్థం. ప్రస్తుతం, పారిజాతం అని అర్థం తీసుకోవాలి.)

సమాసములు

మహోదారదార్వాగతిధురాగిరా (ఇక్కడ, ధురా తృతీయ కాదు.)
మహత్ చ ఉదారం చ, మహోదారమ్ = మహత్తు ఉదారముఐనది, మహోదారమ్.
మహోదారం చ తత్ దారు ఇతి, మహోదారదారు.
మహోదారదారుణః ఆగతిః, మహోదారదార్వాగతిః = మహోదారదారువుయొక్క ఆగతి, మహోదారదార్వాగతిః.
మహోదారదార్వాగతిః ధూః యస్యాః సా, మహోదారదార్వాగతిధురా = మహో దార దార్వాగతి దేనికి ధురమో అది, మహోదారదార్వాగతిధురా.
(ఇక్కడ, ' ఋక్పూరప్...' (5. 4. 74) వలన, ఆగతిధురః అని సమాసం, స్త్రీలింగంలో ఆగతిధురా అని రూపం.)
మహోదారదార్వాగతిధురా చ సా గీః, మహోదారదార్వాగతిధురాగిరా = మహోదార దార్వాగతిధుర ఐన గీః, మహోదారదార్వాగతిధురాగీః.
మహోదారదార్వాగతిధురాగిరా - తృతీయా

అన్వయము:

యా, గాః, న, ఆరభత, అదసీయామ్, హి, గామ్, నో, ఆ జత్ (అజ గతౌ–లజ్ ),

వా, సా, మహా+ఉదార-దారు-ఆగతి-ధురా-గిరా, ఆహ, హహ! .

అర్థము:

గౌః = వాక్కు.   గామ్ =వాక్కును.   గాః = వాక్కులను.   అదసీయా = ఇతనికి సంబంధించినది.   ఆజత్ (అజ ధాతువు – లజ్ = పొందెను/తెలిసికొనెను.   ఆరభత = ఆరంభించెను.   దారు/దారుః = వృక్షము.   ఆగతిః=రాక.   ధూః= భారము.   ఆగతిధురా = వచ్చే(తెప్పించే) భారము గలది.

యా =  ఏ సత్యభామ ఐతే,
గాః, న, ఆరభత = మాటలను మొదలుపెట్టలేదో,
అదసీయామ్, గామ్ = ఇతనికి (కృష్ణునికి) సంబంధించిన మాటను
నో, ఆజత్ (అజ గతౌ–లజ్ ), వా = పొందనైనను పొందలేదో,
సా  = ఆ సత్యభామ,
మహా+ఉదార-దారు-ఆగతి-ధురా-గిరా ఎంతో గొప్పదైన ఆ పారిజాతపు రాకడే బాధ్యతగా ఉన్న మాటకారణంగా,
ఆహ, హి  = పలికినది కదా!
హహ! = ఆశ్చర్యము!

తాత్పర్యము

అలుకమీద ఉన్న సత్య తాను కృష్ణుడితో మాటలాడనూ లేదు, అతడి మాటను పట్టించుకోనూ లేదు. కాని, అంత గొప్ప పారిజాతాన్ని రప్పించే భారాన్ని  ప్రకటించే

(కృష్ణుడి) మాటతో మాత్రం, పలికింది. ఆశ్చర్యం!
కృష్ణుడితో పలుకక, అతడి మాటలను వినక, ఉన్న సత్య, పారిజాతాన్ని తెస్తానని కృష్ణుడు అనగానే, కోపం వదలి అతడితో మాటలాడిందని సారాంశం.

తరువాతి శ్లోకంలో రాముడు చిత్రకూటపర్వతానికి చేరటాన్ని అనులోమంలోను, కృష్ణుడు స్వర్గలోకానికి చేరటాన్ని విలోమంలోను, చెప్పుతున్నాడు.

14. **యాతురాజిదభాభారంద్యాంవ మారుతగంధగం**

**సోగమారపదంయక్షతుంగాభోనఘయాత్రయా**

ఇది అనుష్టుప్పు.

రాముడు చిత్రకూటపర్వతానికి చేరటాన్ని చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

పదవిభాగము :

యాతు-రాజి-ద-భా-భారమ్, ద్యామ్, వ, మారుత-గంధ-గమ్, సః, అగమ్, ఆర, పదమ్, యక్ష-తుంగ-ఆభః, అనఘ-యాత్రయా.

సమాసములు

యాతు-రాజి-ద-భా-భారః.

యాతూనామ్ రాజిః, యాతురాజిః = యాతువుల రాజి, యాతురాజిః.

యాతురాజిమ్ ద్యతి ఇతి, యాతురాజిదః = యాతురాజిని ఖండించునది,

యాతురాజిదః

భానామ్ భారః, భాభారః = భాలయొక్క భారము, భాభారః.

యాతురాజిదః భాభారః యస్య సః, యాతురాజిదభాభారః.

మారుత-గంధ-గః.

మారుతస్య గంధః, మారుతగంధః = మారుతముయొక్క గంధము, మారుతగంధః.

మారుతగంధమ్ గచ్ఛతి ఇతి, మారుతగంధగః.

యక్ష-తుంగ-ఆభః.

తుంగా ఆభా యస్య సః, తుంగాభః.

యక్ష ఇవ తుంగాభః, యక్షతుంగాభః.

అనఘ-యాత్రా

అఘమ్ న విద్యతే యస్యాః సా, అనఘా= అఘము లేనిది, అనఘా.

అనఘా చ సా యత్రా చ, అనఘయాత్రా = అనఘ ఐన యాత్ర, అనఘయాత్రా.

అన్వయము:

యక్ష-తుంగ-ఆభః, సః (రామః), యాతు-రాజి-ద-భా-భారమ్, మారుత-గంధ-గమ్, అగమ్, పదమ్, అనఘ-యాత్రయా, ద్యామ్, వ, ఆర.

అర్థము:

యాతుః/యాతు= రాక్షసుడు. రాజిః=సమూహము. దః (దో అవఖండనే ధాతువు) =ఖండించునది. భా= తేజస్సు. భారః=అతిశయము, ఎక్కువ. ద్యౌః = స్వర్గము. గంధః =లేశము. గః= పొందునది. అగః = కొండ.
పదమ్ = స్థానము. ఆర (ఋ గతౌ ధాతువు లిట్.) = పొందెను. యక్షః = కుబేరుడు. తుంగా = గొప్పది, ఎక్కువైనది. ఆభా = కాంతి. యాత్రా = ప్రయాణము.

యక్ష-తుంగ-ఆభః = కుబేరునివలె గొప్ప తేజస్సుగల
సః (రామః) = ఆ రాముడు,
యాతు-రాజి-ద-భా-భారమ్ = రాక్షసబృందమును ఖండించు తేజోతిశయము గలది (ఈ విశేషణం రాముడికేమో అని భ్రాంతి కలుగుతుంది. కాని, పర్వతానికి.),
మారుత-గంధ-గమ్ = వాయువుయొక్క లేశమును పొందునది, ఐన
అగమ్, పదమ్ = కొండను స్థానముగా
అనఘ-యాత్రయా = నిర్దోషమైన ప్రయాణముతో
ద్యామ్, వ, ఆర = స్వర్గమును వలె, చేరెను. ( ఇక్కడ వశబ్దం ఇవార్థకం.)

తాత్పర్యము

కుబేరునివలె కాంతిశాలి ఐన రాముడు, బాగుగా ప్రయాణించి, మందమారుతములతో ఒప్పుచున్నది ,రాక్షసరాజిని సంహరించు తేజోతిశయముగలది, ఐన చిత్రకూట గిరిని, స్వర్గమును చేరినట్లు చేరెను.

రాముడు అందమైన చిత్రకూటపర్వతాన్ని చేరాడని సారాంశము.

ఇక, ప్రతిలోమంలో,కృష్ణుడు స్వర్గలోకానికి చేరటాన్ని చెప్పుతున్నాడు.

**యాత్రయాఘనభోగాతుం క్షయదంపరమాగసః**

**గంధగం తరు మావద్యాం రంభాభాదజిరాతుయా**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

యాత్రయా, ఘనభః, గాతుమ్(గాజ్ – గతౌ – తుమున్), క్షయదమ్, పరమ-ఆగసః, గంధగమ్, తరుమ్, ఆవ ద్యామ్, రంభాభాదజిరా, తు, యా.

సమాసములు

ఘనభః

ఘనస్య ఇవ భాః యస్య సః, ఘనభః = ఘనముయొక్క భా వలె భా ఎవనికో వాడు, ఘనభః.

క్షయదః

క్షయమ్ దదాతి ఇతి, క్షయదః = క్షయమును ఇచ్చునది, క్షయదః.

పరమాగః

పరమం చ తత్ ఆగః = పరమాగః

పరమాగసః – షష్ఠీ.

గంధగః

**గంధమ్ గతః ఇతి, గంధగః = గంధమును పొందినది, గంధగః.**

**రంభాభాదజిరా**

రంభయా భాత్ ఇతి, రంభాభాత్ = రంభతో భాసించునది, రంభాభాత్

(భా ధాతువు – శత్రంతరూపం భాన్ , దానికి నపుంసకరూపం, భాత్)

**రంభాభాత్ అజిరమ్ యస్యాః సా, రంభాభాదజిరా = రంభాభాత్తు ఐన అజిరము దేనికో అది, రంభాభాదజిరా.**

**అన్వయము:**

**ఘనభః (కృష్ణః), పరమ-ఆగసః, క్షయదమ్, గంధగమ్, తరుమ్, గాతుమ్, యాత్రయా, ద్యామ్, ఆవ (అవ-గత్యాదిషు-లిట్), యా (ద్యౌః), తు, రంభా-భాత్-అజిరా, (తామ్ ద్యామ్ ఇతి ).**

**అర్థము:**

**ఘనః = మేఘము. భా=కాంతి. గాతుమ్ (గాజ్ గతౌ ధాతువు-తుమున్) = పొందుటకు. క్షయః= ముగింపును, శమమును. దః=ఇచ్చునది. ఆగః = అపరాధము. గః = పొందినది. ద్యౌః =స్వర్గము. ద్యామ్ = స్వర్గమును. ఆవ (అవ ధాతువు - లిట్) = పొందెను. భాత్ (భా ధాతువుకు శత్రంతరూపం, నపుంసకం) = ప్రకాశించునది. అజిరమ్=అంగణము.**

**ఘనభః (కృష్ణః) = మేఘమువంతి వన్నెగల కృష్ణుడు,**

**పరమ-ఆగసః, క్షయదమ్ = తన పెద్ద తప్పిదమునకు శాంతిని ఇచ్చునది,,**

గంధగమ్, తరుమ్ = సువాసనను పొందినది ఐన చెట్టును (పారిజాతమును)

గాతుమ్ ( గాజ్ గతౌ ధాతువు – తుమున్) = పొందుటకు,

యా (ద్యౌః), తు = ఏ స్వర్గమైతే ,

రంభా-భాత్-అజిరా = రంభతో ప్రకాశించు ముంగిలిగలదో,

(తామ్) ద్యామ్ = ఆ స్వర్గమును,

యాత్రయా = ప్రయాణముతో

ఆవ (అవ ధాతువు-లిట్) = చేరెను.

తాత్పర్యము

తాను సత్యపట్ల చేసిన పెద్ద తప్పునకు ఉపశమమును కలిగించునది, సుగంధముగలది ఐన పారిజాతమును తెచ్చుటకు, మేఘవర్ణుడైన కృష్ణుడు ప్రయాణముచేసి, రంభతో ప్రకాశించు అంగణముగల స్వర్గమును చేరెను.

కృష్ణుడు పారిజాతాన్ని తేవటానికి స్వర్గానికి వెళ్ళాడని సారాంశం.

ఇక, తరువాత పద్యంలో,రాముడు దండకావనానికి చేరుకోవటాన్ని అనులోమంలోను, కృష్ణుడు నందనవనానికి చేరుకోవటాన్ని విలోమంలోను, చెప్పుతున్నాడు.

15. దండకాం ప్రదమో రాజాల్యా హతామయకారిహా

సనమానవతానేనోభోగ్యాభో న తదా సన

ఇది అనుష్టుప్పు.

రాముడు దండకావనానికి చేరుకోవటాన్ని, చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

పదవిభాగము :

దండకామ్, ప్ర-దమః, రాజ-ఆల్యాః, హతామయకారిహా, సః, స-మానవత-అనేనః(న-ఏనః)-భోగ్యాభః, న, తదా, ఆస, న.

సమాసములు

రాజాళిః (రాజాళ్యాః అనే పదం, హతామయశబ్దంతో అన్వయిస్తుంది.)
రాజ్ఞాం ఆళిః. రాజాళిః = రాజుల ఆళి, రాజాళిః.
ప్రదమః
ప్రకృష్టః దమః యస్య సః, ప్రకృష్టదమః = ప్రకృష్టమైన దమము ఎవనికో వాడు, ప్రకృష్టదమః.
హతామయకారిహా
హతః ఆమయః యేన సః, హతామయః = ఎవనిచేత ఆమయము హతమో అతడు, హతామయః. హతామయః ఏవ హతామయకః(స్వార్థకప్). ఈ శబ్దానికి రాజాళ్యాః తో అన్వయం.).
హతామయకః చ సః అరిః చ, హతామయకారిః =హతామయకుడైన అరి, హతామయకారిః.

హతామయకారిమ్ హంతి ఇతి, హతామయకారిహా =హతామయకారిని హింసించువాడు, హతామయకారిహా.

సమానవతానేనోభోగ్యాభః

మానవతయా  సహితాః యే తే, సమానవతాః = మానవతతోకూడి ఉన్నవారు, సమానవతాః (సమానవతః, సమానవతౌ, సమానవతాః).

ఏనః(స్) యేషామ్ న విద్యతే తే, అనేనసః = ఏనస్సు ఎవరికి లేదో వారు, అనేనసః.

సమానవతాః చ అనేనసః, సమానవతానేనసః. సమానవతులు అనేనసులు ఐనవారు, సమానవతానేనసః.

సమానవతానేనసామ్ భోగ్యా ఆభా యస్య సః, సమానవతానేనోభోగ్యాభః = సమానవతానేనసులకు భోగ్యమైన ఆభ ఎవనికో వాడు, సమానతానేనోభోగ్యాభః.

అన్వయము:

ప్ర-దమః, రాజ-ఆల్యాః, హత-ఆమయక-అరి-హా, స-మానవత-అనేనః (న+ఏనః)-భోగ్య-ఆభః, తదా, దండకామ్, ఆస, న, న (నద్వయం, ప్రకృతార్థ స్థాపకమ్).

అర్థము:

ప్ర దమః= బాగుగా దమము/నిగ్రహము  కలవాడు, రాముడు.

దండకా= దండక అను అడవి.   ఆళిః = పంక్తి (సమూహము).   ఆమయః = రోగము(ఇక్కడ గర్వం అని.).   అరిః = శత్రువు.   హా= హింసించువాడు (ఇక్కడ అవమానమే హింసనం.).   అరిః=శత్రువు.   మానవతా= నరత్వం.   ఏనః(స్)= పాపం.   అనేనః = పాపం లేనివాడు.   ఆభః = కాంతి, తేజస్సు.  ఆస

(అస ధాతువు లిట్) = చేరెను.

ప్ర-దమః = ఎంతో నిగ్రహముకలవాడు,

రాజ-ఆల్యాః, హత-ఆమయక-అరి-హా = రాజుల రోగాన్ని హరించిన శత్రువును (పరశురాముని) హింసించువాడు.

స-మానవత-అనేనః(న+ఏనః)- భోగ్య – ఆభః = పాపరహితులైన మనుజులకు భోగ్యమైన తేజస్సు కలవాడు, ఐన రాముడు,

తదా, దండకామ్ = అప్పుడు దండక అను అడవిని ,

ఆస, న, న (నద్వయం ప్రకృతార్థస్థాపకమ్) = చేరలేదని లేదు, అనగా, చేరెను.

(రెండు నకారాలు వాడటం ఒక కవిసంప్రదాయం.) .

తాత్పర్యము

నిగ్రహశాలి, రాజుల రోగం పోగొట్టిన పరశురాముని (గెలిచి) అవమానించిన వాడు, పాపరహితులైన మనుష్యులకు సేవ్యమైన తేజస్సు గలవాడు, ఐన రాముడు, దండక అనే అడవిని చేరెను. (దండకా=దండకం)

రాముడు దండకారణ్యం చేరుకొన్నాడని సారాంశం.

ఇక, ప్రతిలోమంలో,కృష్ణుడు నందనవనానికి చేరుకోవటాన్ని చెప్పుతున్నాడు

**నసదాతనభోగ్యాభో నోనేతావనమానసః**

**హారికాయమతాహల్యాజారామోదప్రకాండదం**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

న, సదాతన-భోగ్య-ఆభః, నో, నేతా, వనమ్, ఆస, సః, హారి-కాయ-మత-అహల్యాజార-ఆమోద-ప్రకాండదమ్

సమాసములు

సదాతనభోగ్యాభః
సదాతనీ చ భోగ్యా చ ఆభా యస్య సః, సదాతనభోగ్యాభః = సదాతని మరియు భోగ్య ఐన ఆభ ఎవనికో వాడు, సదాతనభోగ్యాభః.
హారి-కాయ-మత-అహల్యాజార-ఆమోదప్రకాండ-దః.
హారీ కాయః, హారికాయః= హారి ఐన కాయము, హారికాయః.
హారికాయేన మతః(సమ్మతః), హారికాయమతః = హారికాయముచేత మతుడు, హారికాయమతః.
అజల్యాయై జారః, అహల్యాజారః =అహల్యకొరకు జారుడైనవాడు, అహల్యాజారః.
హారికాయమతః చ అహల్యాజారః చ సః, హారికాయమతాహల్యాజారః = హారికాయమతుడైన అహల్యాజారుడు, హారికాయమతాహల్యాజారః.
ప్రకాణ్డః(ప్రశస్తః) ఆమోదః, ఆమోదప్రకాండః. = ప్రశస్తమైన ఆమోదము, ఆమోదప్రకాండః.
ఆమోదప్రకాండం దదాతి ఇతి, ఆమోదప్రకాండదః = ఆమోదప్రకాండమును ఇచ్చునది, ఆమోదప్రకాండదః.
హారికయమతాహల్యాజారస్య ఆమోదప్రకాండదః ఇతి, హారికాయమతాహల్యా

జారామోదప్రకాండదః= హారికాయమతాహల్యాజారునకు ఆమోదప్రకాండదము, హారికాయమతాహల్యాజారామోదప్రకాండదః

లేదా, హారికాయమతాహల్యా అని విడగొట్టి, హారికాయమతా అనేదానిని అహల్యకు విశేషణంగాకూడ చెప్పవచ్చు.

హారికాయమతాహల్యాజారామోదప్రకాండదమ్ - ద్వితీయావిభక్తి.

చూసారుగా, పద్యంలోని ఉత్తరార్థం మొత్తం ఒకే సమాసం! అనులోమవిలోమ నియమంలో సైతం ఇంత దీర్ఘసమాసాన్ని అలవోకగా ఇమిడించటం అచ్చెరువు కలిగిస్తుంది.

అన్వయము:

సదాతన-భోగ్య-ఆభః, సః, నేతా, హరి-కాయ-మత-అహల్యాజార-ఆమోద-ప్రకాండ-దమ్, వనమ్, ఆస, నో, న (అత్ర చ నయుగ్మం, ప్రకృతార్థస్థాపకమ్. )

అర్థము:

సదాతనః/నీ/నమ్ = శాశ్వతము. ఆభా = కాంతి. నేతా = నాయకః (కృష్ణః), హారీ = మనోహరము. మతః = ఇష్టుడు, సమ్మతుడు. ఆమోదః= సంతోషము, ప్రకాండః= ప్రశస్తము. దః= ఇచ్చునది. ఆస (అస ధాతువు లిట్.)= పొందెను నో న అనే రెండు నిషేధాలతో ప్రకృతార్థం స్థిరపడుతుంది. “నో న ఆస= ఆస”.

సదాతన-భోగ్య-ఆభః = నిత్యభోగ్యమైన తేజస్సు గలవాడైన డు,

సః, నేతా = ఆ నాయకుడు ( శ్రీకృష్ణుడు),

హరి-కాయ-మత-అహల్యాజార-ఆమోద-ప్రకాండ-దమ్ = సుందరమైన శరీరముచే సమ్మతుడైన ఇంద్రునకు ప్రశస్తానందమును ఇచ్చు
వనమ్, ఆస, న, న (అత్ర చ నయుగ్మం, ప్రకృతార్థస్థాపకమ్.) = తోటను (నందనమును చేరలేదని లేదు ) చేరెను.

తాత్పర్యము

సుందరుడైన ఇంద్రునకు ప్రశస్తమైన ఆనందమునిచ్చు నందనవనమును, శాశ్వతతేజశ్శాలి ఐన కృష్ణుడు చేరనే చేరెను.

కృష్ణుడు నందనాన్ని చేరాడని సారాంశము.

ఇక, తరువాత పద్యంలో, రాముడు విరాధవధం చేసి అగస్త్యుడి దగ్గరకు చేరటాన్ని అనులోమంలోను, కృష్ణుడు స్వర్గానికి వచ్చిన సంగతి తెలిసి ఇంద్రుడు భయపడటాన్ని ప్రతిలోమంలోను, చెప్పుతున్నాడు.

16. **సోరమారదన జ్ఞానో వేదేరాకంఠకుంభజం**
**తంద్రుసారపటో నాగానానాదోషవిరాధహా**

ఇది అనుష్టుప్పు.

అనులోమము - రాఘవము:

రాముడు విరాధవధం చేసి అగస్త్యుడి దగ్గరకు చేరటాన్ని చెప్పుతున్నాడు.

పదవిభాగము:

సః, అరమ్, ఆరత్, అనజ్ఞానః, వేద-ఇరా-కంఠ-కుంభజమ్, తం, ద్రుసారపటః,
అనాగాః, నానా-దోష-విరాధహ్.

సమాసములు

అనజ్ఞానః
అజ్ఞానస్య విరోధీ, అనజ్ఞానః = అజ్ఞానమునకు విరోధి, అనజ్ఞానీ (అజ్ఞానము లేని వాడు=జ్ఞాని)
వేద-ఇరా-కంఠ-కుంభజ
వేదానామ్ ఇరా, వేదేరా = వేదములయొక్క ఇర, వేదేరా.
వేదేరా కంఠే యస్య సః, వేదేరాకంఠః = వేదేరలు కంఠమున ఎవనికో వాడు, వేదేరాకంఠః (ఇది కుంభజునికి విశేషణము.)
వేదేరాకంఠః చ సః కుంభజః, వేదేరాకంఠకుంభజః = వేదేరాకంఠుడైన కుంభజుడు, వేదేరాకంఠకుంభజః.
ద్రుసారపటః
ద్రూణామ్ సారః, ద్రుసారః =ద్రువులయొక్క (ద్రుమములయొక్క) సారము, ద్రుసారః.
ద్రుసారః ఏవ పటః యస్య సః, ద్రుసారపటః = ద్రుసారమే పటము ఎవనికో వాడు, ద్రుసారపటః.
అనాగాః
ఆగః(స్) న విద్యతే యస్య సః, అనాగాః =ఆగస్సు ఎవనికి లేదో వాడు, అనాగాః.

నానా-దోష-విరాధహా

నానావిధాః దోషాః, నానాదోషాః = నానావిధములైన దోషములు, నానాదోషాః.

నానాదోషాః అస్య సంతి ఇతి, నానాదోషః = నానాదోషములు గలవాడు , నానాదోషః.

నానాదోషః చ అసౌ విరాధః చ, నానాదోషవిరాధః = నానాదోషుడైన విరాధుడు, నానాదోషవిరాధుడు.

నానాదోషవిరాధం హంతి ఇతి, నానాదోషవిరాధహా = నానాదోషవిరాధుడిని చంపినవాడు, నానాదోషవిరాధహా.

అన్వయము:

న- అజ్ఞానః, న-ఆగః, నానా-దోష-విరాధ-హా, సః (రామః), తమ్, ఇరా-కంఠ-కుంభజమ్, అరమ్, ఆరత్

అర్థము:

ఆగః(స్) = దోషము. హా= చంపువాడు. ఇరా=వాక్కు. ద్రుః=చెట్టు.
ద్రుసారః=చెట్టు బెరడు. పటః = వస్త్రము. అరమ్ = శీఘ్రముగా. ఆరత్ (ఋ గతౌ ధాతువు –లుఙ్) =చేరెను.

న- అజ్ఞానః = అజ్ఞానమునకు విరోధి ఐనవాడు,
న-ఆగః = ఏ అపరాధములు లేనివాడు,,
నానా-దోష-విరాధ-హా= అనేకదోషములున్న విరాధుని చంపినవాదు, ఐన
సః (రామః) = ఆ రాముడు,

ఇరా-కంఠ-కుంభజమ్, తమ్ = వేదవాక్కులు నిండిన కంఠము ఉన్న ఆ అగస్త్యుని (స్వాధ్యాయశీలుడిని అని భావం),

అరమ్, ఆరత్ (ఋ ధాతువు లుఙ్ ) = శీఘ్రముగా చేరెను.

తాత్పర్యము

అజ్ఞానమును పోగొట్టువాడు, ఏ దోషములును లేనివాడు, బహుదోషములుగల విరాధునిచంపినవాడు, ఐన ఆ రాముడు, వేదవాక్కులకు నెలవైన కంఠ ముగల అగస్త్యుని శీఘ్రముగా చేరెను.

రాముడు విరాధుని చంపి, అగస్త్యుడిని చేరాడని సారాంశం.

ఇక, విలోమంలో,కృష్ణుడు స్వర్గానికి వచ్చినసంగతి తెలిసి ఇంద్రుడు భయపడటాన్ని, చెప్పుతున్నాడు.

హాధరావిషదోనానాగానాటోపరసాద్ద్రుతం
జంభకుంఠకరాదేవే నోజ్ఞాన దరమారసః

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

హా, ధరావిషదః, నానాగానాటోపరసాత్, ద్రుతమ్, జంభకుంఠకరాః, దేవేనః,

అజ్ఞానదరమ్, ఆర, సః .

సమాసములు

ధరావిషదః (విషం=జలం. ఇక్కడ కవి, గరళం అనే అర్థంతో ఒక విశేషాన్ని చెప్పాడు గాని, అది ఏమంత సమంజసంగా అనిపించలేదు.)

ధరాయై విషం దదాతి ఇతి, ధరావిషదః = ధరకు విషమును ఇచ్చువాడు, ధరవిషదః.

నానాగానాటోపరసాత్ (తకారాంతశబ్దః)

నానావిధాని గానాని, నానాగానాని = బహువిధములైన గానములు, నానాగానాని.

నానాగానానామ్ ఆటోపః, నానాగానాటోపః = నానాగానముల ఆటోపము, నానాగానాటోపః.

నానాగానాటోపస్య రసః, నానాగానాటోపరసః = నానాగానాటోపముయొక్క రసము, నానాగానాటోపరసః. ్

నానాగానాతోపరసమ్ అత్ ఇతి, నానాగానాటోపరసాత్ = నానాగానాటోప రసమును పొందువాడు, నానాగానాటోపరసాత్

(అత సాతత్యగమనే ధాతువు-శతృప్రత్యయము అత్. అత్, అతౌ, అతః. )

జంభకుంఠకరాః

జంభస్య కుంఠికా రాః యస్య సః, జంభకుంఠకరాః = జంభునికి కుంఠిక ఐన రా ఎవనికో వాడు, జంభకుంఠకరాః (రాః=శ్రీః, గతిః.)

దేవేనః

దేవానామ్ ఇనః, దేవేనః = దేవులకు ఇనుడు, దేవేనః.

అజ్ఞానదరమ్

అజ్ఞానం చ దరః, అజ్ఞానదరమ్ = అజ్ఞానమును, దరమును, అజ్ఞానదరమ్ (సమాహారద్వంద్వం. కనుక ఏకవద్భావం, నపుంసకం).

అన్వయము:

ధరా-విషదః, నానా-గాన-ఆటోప-రస-అత్, జంభ-కుంఠక-రాః, సః, దేవ-ఇనః, అజ్ఞాన-దరమ్, ధ్రుతమ్, ఆప. హా

అర్థము:

ధరా=భూమి. విషమ్ = నీరు. దః= ఇచ్చువాడు. ఆటోపః=ఆడంబరము. రసః=ఆనందము. అత్ (అత సాతత్యగమనే ధాతువు-శతృప్రత్యయాంత రూపం. అత్, అతౌ, అతః.)= పొందువాడు/అనుభవించువాడు. జంభః= జంభుడను రాక్షసుడు. కుంఠికా = భంగము చేయునది. రాః = సంపద / గతి. ఇనః = ప్రభువు. అజ్ఞానమ్ = మోహము. దరః = భయము. ఆర (ఋ గతౌ ధాతువు లిట్.) = పొందెను.

ధరా-విషదః = భూమికి జలమును ఇచ్చువాడును,

నానా-గాన-ఆటోప-రస-అత్ = వివిధగానముల ఆడంబరముల ఆనందమును పొందువాడును,

జంభ-కుంఠక-రాః = జంభుని భంగపరచిన సంపద/గతి కలవాడును, ఐన

సః, దేవ-ఇనః = ఆ దేవేంద్రుడు,

అజ్ఞాన-దరమ్, = మోహమును, భయమును,

ధృతమ్, ఆప.= వెంటనే పొందెను.

హా = అయ్యో! విషాదసూచకం.

తాత్పర్యము

బహువిధగానరసానాందమును అనుభవించువాడు, జంభుని సంహరించినవాడు, భూమికి నీటిని ఇచ్చువాడు, ఐన ఆ ఇంద్రుడు, (కృష్ణుడు రాగనే) మోహమును భయమును పొందెను.

కృష్ణుడి రాక తెలియగనే ఇంద్రుడు భయపడ్డాడని సారాంశము.

ఇక, తరువాత పద్యంలో,అడవిలో జటాయువు రాముని సేవించటాన్ని, శూర్పణఖ రాముని కామించటాన్ని అనులోమంలోను, నందనంలో ఇంద్రుడు కృష్ణుని చేరటాన్ని విలోమంలోను, చెప్పుతున్నాడు.

17. **సాగమాకరపాతాహాకంకేనావనతోహిసః**

**న సమానర్దమారామాలంకారాజస్వసారతం**

ఇది అనుష్టుప్పు.

అడవిలో జటాయువు రాముని సేవించటాన్ని,శూర్పణఖ రాముని కామించటాన్ని చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

పదవిభాగము :

స-ఆగమ-ఆకర-పాతా, హా, కంకేన, అవనతః, హి, సః,న, సమానర్ధ, మా, అరామా, లంకా-రాజ-స్వసా, రతమ్.

సమాసములు

సాగమాకరపాతా = స-ఆగమ-ఆకర-పాతా
ఆగమైః సహితాః, సాగమాః = ఆగమములతో కూడినవారు, సాగమాః (ఋషులు).
సాగమానామ్ ఆకరః, సాగమాకరః = సాగమముల ఆకరము, సాగమాకరః.
సాగమాకరస్య పాతా, సాగమాకరపాతా = సాగమాకరముయొక్క పాత,
సాగమాకరపాతా (పాతా- పా ధాతువు తృచ్ )
అరామా = అ-రామా
రామా న భవతి ఇతి, అరామా = రామ కానిది అరామా.
లంకారాజస్వసా = లంకా-రాజ-స్వసా
లంకాయాః రాజా, లంకారాజః = లంకయొక్క రాజు, లంకారాజః (లంకాయాః రాట్ ఇతి వా. రాట్, రాజౌ, రాజః.)
లంకారాజస్య స్వసా, లంకారాజస్వసా = లంకారాజుయొక్క స్వస, లంకారాజస్వసా (లంకారాజః స్వసా ఇతి వా. రాజః, రాజోః, రాజామ్.)

అన్వయము:

స-ఆగమ-ఆకర-పాతా, సః (రామః),కంకేన, అవనతః, హి, అరామా, లంకారాజ-స్వసా, రతమ్, సమానర్ద (అర్ద యాచనాయామ్ లజ్), న, మా.
(వ్యతిరేకార్థకావ్యయద్వయం ప్రకృతార్థబోధకమ్.), హా (జుగుప్సా విషాద సూచకం).

అర్థము:

సాగమాః= ఆగమములతో కూడినవారు, ఋషులు. ఆకరః = సమూహము.
పాతా (పా ధాతువు తృచ్ ) = కాపాడువాడు. కంకః = గ్రద్ద, జటాయువు.
సమానర్ద , న, మా = అడుగలేదని లేదు , అడిగెను. రామా = మనోజ్ఞ. అరామా = మనోజ్ఞ కానిది.

స-ఆగమ-ఆకర-పాతా = ఋషులను కాపాడువాడు ఐన,
సః (రామః) = ఆ రాముడు,
కంకేన, అవనతః, హి = గ్రద్దయగు జటాయువుచేత సేవింపబడెను గదా!
అరామా = వికారాకారయగు
లంకారాజ-స్వసా = లంకారాజు సోదరి శూర్పణఖ,
రతమ్ = శృంగారచర్యను
సమానర్ద (అర్ద యాచనాయామ్ లజ్), న, మా. (వ్యతిరేకార్థకావ్యయద్వయం ప్రకృతార్థబోధకమ్.) = కోరలేదని లేదు, కోరెను.
రామమ్ = రాముడిని అని అధ్యాహారం చేసుకోవాలి.
హా (జుగుప్సావిషాదసూచకం).
ఋషిరక్షకుడైన రాముడిని జటాయువు సేవించెను. లంకారాజు రావణుడి సోదరి, వికారరూపిణి ఐన శూర్పణఖ, రాముడిని శృంగారచర్యను కోరెను.

పంచవటిలో జటాయువు రాముడిని సేవించాడని, శుర్పణఖ రాముడిని కామించిందని, సారాంశం.

ఇక, ప్రతిలోమపాఠంలో, నందనంలో ఇంద్రుడు కృష్ణుని చేరటాన్ని చెప్పుతున్నాడు

**తం రసాస్వజరాకాలం మారామార్దనమాసన**

**సహితో న వనాకే కం హోతాపారకమాగసా**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

తమ్, రసాసు, అజరాకాలమ్, మా, ఆరామార్దనమ్, ఆస, న, సః, హితః, అనవనాకే, అకం, హోతా (ఓహ్ గతౌ – తృన్ – ఇంద్రః ఇతి), అపారకం, ఆగసా,

సమాసములు

అజరాకాలః = అ-జరా-కాలః

జరా చ కాలః చ నవిద్యేతే యస్య సః, అజరాకాలః = జర, కాలము లేనిది ఎవనికో వాడు, అజరాకాలః.

ఆరామార్దనః = ఆరామ-అర్దనః

ఆరామస్య అర్దనః, ఆరామార్దనః = ఆరామమునకు అర్దనుడు, ఆరామార్దనుడు.

అనవనాకః= అ-నవ-నాకః

న నవః ఇతి, అనవః = నవము కానిది, అనవః.

అనవః చ నాకః, అనాకః = నవము కాని నాకము, అనవనాకః.

అన్వయము:

హితః, ఆగసా, అ-నవ-నాకే, అపారకమ్, అకం, హాతా, రసాసు, అ-జరా-కాలమ్, అపారకం, ఆరామ-అర్దనమ్, న మా ఆస.

అర్థము:

కాలః = మృత్యువు.   అకం= దుఃఖము.   హాతా (హా గతౌ ధాతువుపై తృన్. తృచ్ కాదు. )= పొందువాడు.   అపారకం=అపారం (స్వార్థ కప్.).   ఆగః(స్) = అపరాధము.   ఆస (అస ధాతువు –లిట్ ) = పొందెను/చేరెను.

హితః = (కృష్ణునకు) హితుడైనప్పటికి,
ఆగసా = ( పారిజాతాన్ని ఈయక పోవటం అనే) అపరాధంవలన,
అ-నవ-నాకే = పురాతనమైన స్వర్గంలో
అపారకమ్, అకం, హాతా,( ఇంద్రః) = అపారమైన దుఃఖాన్ని పొందినవాడైన ( ఇంద్రుడు ),
రసాసు, అ-జరా-కాలమ్ = (అన్ని) భూములలోను జరామృత్యువులు లేనివాడు,
ఆరామ-అర్దనమ్ = నందనవనమును భంజించినవాడు ఐన కృష్ణుని,
న మా ఆస = చేరలేదని లేదు, అనగా, చేరెను. న మా అని, రెండు నిషేధార్థకాల ప్రయోగం, ప్రస్తుతార్థాన్ని స్థిరపరుస్తుంది.

తాత్పర్యము

కృష్ణుడికి హితుడై ఉండికూడ, పారిజాతాన్ని ఈయక అపరాధం చేసిన ఇంద్రుడు, పురాతనమైన స్వర్గంలో ఉండికూడ అపారమైన దుఃఖమును పొందినవాడై, నందనవనమును భంజించిన జరామృత్యురహితుడైన కృష్ణుని చేరెను.

ఇంద్రుడు బాధతో కృష్ణుడి దగ్గరకు వెళ్ళాడని సారాంశం.

ఇక, తరువాత శ్లోకంలో, శూర్పణఖ ముక్కు కోయటంవలన ఆమె రాముడిమీద వైరం పెట్టుకోవటాన్ని అనులోమంలోను, , ఇంద్రుడు కృష్ణుడితో సంభాషణ మొదలుపెట్టటాన్ని విలోమంలోను, చెప్పబోతున్నాడు.

18. తాంసగోరమదోఃశ్రీదో విగ్రామసదరోతత
వైరమాసపలాహారా వినాసా రవివంశకే

ఇది అనుష్టుప్పు.

అనులోమంలో, శూర్పణఖ ముక్కు కోయటం వలన ఆమె రాముడిమీద వైరం పెట్టుకోవటాన్ని చెప్పబోతున్నాడు.
అనులోమము - రాఘవము:

పదవిభాగము :

తామ్, సః, గో-రమ-దోః-శ్రీ-దః, విగ్రామ్, అసదరః, అతత ( =అకృత. తను ధాతువు లుఙ్ ), వైరమ్, ఆస (అస ధాతువు లిట్ ), పలాహారా, వినాసా, రవివంశకే.

సమాసాలు

గోరమదోఃశ్రీదః = గో-రమ-దోః-శ్రీ-దః

గోః రమః (రమణః), గోరమః = భూమియొక్క రముడు/రమణుడు, గోరమః.

గోరమస్య దోః, గోరమదోః = గోరమునియొక్క దోః (దోషం=బాహువు) , గోరమదోః.

గోరమదోషః శ్రియమ్ దదాతి ఇతి, గోరమదోఃశ్రీదః = గోరమదోషమునకు శ్రీని ఇచ్చువాడు, గోరమదోఃశ్రీదః. (రాముని భుజబలమునకు సంపత్తిని ఇచ్చువాడు, అనగా సహాయకుడు, లక్ష్మణుడు.)

అసదరః = అ-స-దరః

దరేణ సహితః, సదరః = దరముతో ఉన్నవాడు, సదరః.

సదరః న భవతి ఇతి, అసదరః = సదరుడు కానివాడు, అసదరః.

పలాహారా = పల-ఆహారా

పలమ్ ఆహారః యస్యాః స, పలాహారా = పలము ఆహారముగా దేనికో అది, పలాహారా.

వినాసా

విగతా నాసా యస్యాః సా, వినాసా = విగత ఐన నాస దేనికో అది, వినాసా.

రవివంశకః

రవేః వంశః యస్య సః, రవివంశః = రవియొక్క వంశము ఎవనికో వాదు, రవివంశః.

రవివంశః ఏవ, రవివంశకః = రవివంశుడే రవివంశకః. ( = రవివంశకుడు = రవివంశ జాతుడు.)

అన్వయము:

గో-రమ-దోః-శ్రీ-దః, సః (లక్ష్మణః), అ-స-దరః, తామ్, విగ్రామ్, అతత ( = అకృత. తనుధాతోః కరోతీత్యర్థే, లుఙ్). పల-ఆహారా, వి-నాసా, రవివంశకే, వైరమ్. ఆస (అస-గతిదీప్త్యాదానేషు-లిట్ ).

అర్థము:

గౌః (గో)=భూమి. రమః = రమణుడు. దోః = బాహువు. శ్రీః = సంపద. దః =ఇచ్చువాడు. విగ్రా = ముక్కు లేనిది. అతత (తను ధాతువు లుఙ్ ఆత్మ.) = చేసెను. ఆస (అస గతిదీప్త్యాదానేషు లిట్) = తీసుకొనెను/ పొందెను.
పలమ్ = మాంసము. వినాసా= ముక్కు పోయినది.

గో-రమ-దోః-శ్రీ-దః = రాజైన రముని భుజబలమునకు సంపత్తిని ఇచ్చువాడగు
సః (లక్ష్మణః) = ఆ లక్ష్మణుడు ,
అ-స-దరః = నిర్భయుడై,
తామ్, విగ్రామ్, అతత ( = అకృత. తనుధాతోః కరోతీత్యర్థే, లుఙ్). = ఆ
శూర్పణఖను ముక్కు లేనిదానినిగా చేసెను ( విగ్రో విగతనాసికః - ఇతి అమరః).
వి-నాసా, పల-ఆహారా = ముక్కు పోయిన ఆ మాంసాహార (రాక్షసి),,
రవివంశకే సూర్యకులుడైన రామునియందు
వైరమ్. ఆస (అస-గతిదీప్త్యాదానేషు-లిట్ ) = పగను పెట్టుకొనెను.

తాత్పర్యము

రామునికి సహాయుడిగా ఉండి అతడి భుజబలమునకు సంపత్తిని కలిగించు లక్ష్మణుడు నిర్భయుడై ఆ శూర్పణఖ ముక్కును కోసెను. అట్లు ముక్కును కోలుపోయిన ఆ రాక్షసి శూర్పణఖ, రామునిమీద పగ పెట్టుకొనెను.
లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు కోసాడని, ఆమె రాముడి మీద పగబట్టిందని, సారాంశము.

ఇంద్రుడు కృష్ణుడితో సంభాషణ మొదలుపెట్టటాన్ని విలోమంలో చెప్పబోతున్నాడు.

**కేశవంవిరసానావి రాహాలాపనమారవైః**

**తతరోదసమగ్రావిదోశ్రీదోమరగోఽసతాం**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

కేశవమ్, వి-రస-అన-అవిః, ఆహ, ఆలాప-సమ-ఆరవైః, తత-రోదసమ్, అగ్ర-అవి-దః, అశ్రీదః, అమరగః, అసతామ్.

సమాసములు

విరసానావిః = వి-రస-అన-అవిః
విగతాః రసః చ అనం చ అవిః చ యస్య సః, విరసానావిః = విగతములైన రసము, అనము, అవి, ఎవనికో వాడు, విరసానావిః.
ఆలాపసమారవాః = ఆలాప-సమ-ఆరవాః.

ఆలాపైః సమాః ఆరవాః, ఆలాపసమారవాః = ఆలాపములతో సమములైన ఆరవములు, ఆలాపసమారవాః.

తతరోదసమ్ = తత-రోదసమ్

తతే రోదసీ యేన తమ్, తతరోదసమ్ = రోదసులు ఎవనిచేత తతములో వానిని, తతరోదసమ్.

అగ్రావిదః = అగ్ర-అవి-దః

అగ్రాన్ అవీన్ ద్యతి ఇతి, అగ్రావిదః = అగ్రములైన అవులను ఖండించువాడు, అగ్రావిదః

అశ్రీదః = అ-శ్రీ-దః

శ్రియమ్ దదాతి ఇతి, శ్రీదః = శ్రీని ఇచ్చువాడు, శ్రీదః.

శ్రీదః న భవతి ఇతి, అశ్రీదః = శ్రీదుడు కానివాడు, అశ్రీదః.

అమరగః = అమర-గః

అమరాన్ గచ్ఛతి ఇతి, అమరగః = అమరులను పొందువాడు, అమరగః.

అన్వయము:

వి-రస-అన-అవిః, అ-సతామ్, అ-శ్రీ-దః, అమర-గః, అగ్ర-అవి-దః, తత-రోదసమ్, కేశవమ్, ఆలాపనసమారవైః, ఆహ.

అర్థము:

రసః=ఆనందము. అనమ్ = ప్రాణనం, బలం. అవిః = కాంతి. అసతామ్ = అసురులకు. దః = ఇచ్చువాడు. గః = పొందువాడు. అగ్రః = శ్రేష్ఠము. అవిః = కొండ. దః=ఖండించువాడు. ఆరవైః = శబ్దములతో/ మాటలతో. ఆహ= చెప్పెను.

అ-సతామ్, అ-శ్రీ-దః = అసజ్జనులకు సంపదలను ఈయనివాడు,

అగ్ర-అవి-దః = శ్రేష్ఠమైన గిరులను ఖండించినవాడు, ఐన ఇంద్రుడు,

వి-రస-అన-అవిః = సంతోషము, శక్తి, కాంతి పోయినవాడు,

అమర-గః = దేవతలతో కూడుకొన్నవాడై,

ఆలాపనసమారపైః, = అనునయవాచకములవంటి మాటలతో

తత-రోదసమ్ = రోదసిని నిర్మించినవాడైన ,

కేశవమ్ =విష్ణురూపకృష్ణుని గురించి ,

ఆహ = పలికెను.

తాత్పర్యము

అసజ్జనులైన అసురులకు సంపదలను ఈయనివాడు, పర్వతాలను ఖండించినవాడు ఐన ఇంద్రుడు, కృష్ణుని రాకతో దిగులుపడి, తన సత్తువను, కాంతిని సంతోషాన్ని కోలుపోయి, రోదసిని నిర్మించిన స్రష్ట ఐన విష్ణురూపు డగు కృష్ణునిదగ్గరకు దేవతలతో కలసి వెళ్ళి, సాంత్వనపూర్వకముగా పలికెను.

పారిజాతంకోసం కృష్ణుడిరాకతో నిస్తేజుడైన ఇంద్రుడు, దేవతలతో కలసి అతడి యొద్దకు వెళ్ళి వినయంగా మాటలాడాడు అని సారాంశం.

ఇక, తరువాతి శ్లోకంలో, ఖరుడి సైన్యాన్ని సంహరించి రాముడు కీర్తిని పొందటాన్ని అనులోమంలోను, పారిజాతం భూమికి తీసుకొనిపోవద్దని ఇంద్రుడు కృష్ణుడితో చెప్పటాన్ని ప్రతిలోమంలోను, వర్ణిస్తున్నాడు.

19. గోద్యుగోమస్వమాయోభూదశ్రీగఖరసేనయా

సహసాహవధారోవికలోరాజదరాతిహా

ఇది అనుష్టుప్పు.

ఖరుడి సైన్యాన్ని సంహరించి రాముడు కీర్తిని పొందటాన్ని వర్ణిస్తున్నాడు.

అనులోమము - రాఘవము:

పదవిభాగము :

గోద్యుగోమః (గో-ద్యు-గ-ఉమః), స్వమాయః (సు+అ-మాయః), అభూత్, అ-శ్రీ-గ-ఖర-సేనయా, సహ, సాహవధారః (స-ఆహవ-ధారః), అ-వికలః, అరాజత్, అరాతి-హా.

సమాసములు

గోద్యుగోమః
గాం చ దివం చ గచ్ఛతి ఇతి, గోద్యుగః = భూమిని, స్వర్గమును పొందునది, గోద్యుగః.
గోద్యుగా ఉమా యస్య సః, గోద్యుగోమః =గోద్యుగ ఐన ఉమ ఎవనికో వాడు, గోద్యుగోమః.
స్వమాయః
మాయా నాస్తి అస్య ఇతి, అమాయః = మాయ లేనివాడు, అమాయః.
శోభనం అమాయః ఇతి, స్వమాయః = బాగుగా అమాయుడు, స్వమాయః.
అశ్రీగఖరసేనా
శ్రియం గచ్ఛతి ఇతి, శ్రీగా=శ్రీని పొందునది శ్రీగా.

శ్రీగా న భవతి ఇతి, అశ్రీగా = శ్రీగ కానిది, అశ్రీగా.

ఖరస్య సేనా, ఖరసేనా =ఖరునియొక్క సేన, ఖరసేన.

అశ్రీగా చ సా ఖరసేనా, అశ్రీగఖరసేనా = అశ్రీగ ఐన ఖరసేన, అశ్రీగఖరసేనా.

అశ్రీగఖరసేనయా – తృతీయా.

సాహవధారః

ఆహవస్య ధారా, ఆహవధారా = ఆహవముయొక్క ధార, ఆహవధారా.

ఆహవధారయా సహితః ఇతి, సాహవధారః = ఆహవధారతో కూడినవాడు, సాహవధారః.

అవికలః

విగతా కలా యస్య సః, వికలః = విగత ఐన కల (కళ) ఎవనికో వాడు, వికలః.

వికలః న భవతి ఇతి, అవికలః = వికలుడు కానివాడు, అవికలః.

అన్వయము:

గోద్యుగోమః, స్వమాయః, అశ్రీగఖరసేనయా, సహ, సాహవధారః, అభూత్.

అరాతిహా(రామః), అవికలః, అరాజత్.

అర్థము:

గౌః (గో)= భూమి. ద్యౌః(ద్యు) = దివి. గః=పోవునది. ఉమా=కీర్తి.

అమాయః =మాయకు విరోధి, మాయకులోబడనివాడు. స-ఆహవ-ధారః = సంతత యుద్ధము కలవాడు. అరాతి-హా = శత్రువులను చంపువాడు. అభూత్=అయ్యెను.

అరాజత్ = ప్రకాశించెను.

గోద్యుగోమః = భువికి దివికి వ్యాపించిన కీర్తిగలవాడు,
స్వమాయః (రామః) = ఏమాత్రము కపటము లేనివాడు ఐన రాముడు.
అశ్రీగఖరసేనయా, సహ = మేలును పొందని ఖరుని సేనతో
సాహవధారః, అభూత్ = నిరంతరయుద్ధము కలవాడయ్యెను.
అరాతిహా(రామః), అవికలః, అరాజత్ = శత్రువులను సంహరించువాడై,
కలతచెందనివాడై, ప్రకాశించెను.

భూమిలోను స్వర్గములోను కూడ పేరుగన్న అకపటుడైన రాముడు, (తన చేత ఓడి)
మేలును పొందని ఖరుని సైన్యముతో నిరంతరాయముగా యుద్ధము చేసెను.
శత్రుసంహారకుడై, నిబ్బరముగా నిలచెను.
రాముడు ఖరుడి సైన్యాన్ని చంపి అక్షతుడై నిలిచాడని సారాంశం.

ఇక, పారిజాతం భూమికి తీసుకొనిపోవద్దని ఇంద్రుడు చెప్పటాన్ని విలోమంలో
వర్ణిస్తున్నాడు.

ప్రతిలోమము - యాదవీయము:

**హాతిరాదజరాలోకవిరోధావహసాహస**

**యానసేరఖగ శ్రీద భూయో మా స్వమగో ద్యుగః.**

పదవిభాగము:

హా, అతిరాత్-అజర-ఆలోక-విరోధ-ఆవహ-సాహస,యాన-సేర-ఖగ, శ్రీద, భూయః

మా స్వమ్ అగః ద్యుగః .

ఇక్కడకూడ చూడండి. పూర్వార్థం మొత్తం ఒకే సమాసం.

అన్వయము:

అతి-రాత్-అజర-ఆలోక-విరోధ-ఆవహ-సాహస, యాన-సేర-ఖగ, శ్రీద, హా, స్వమ్, ద్యుగః, అగః, భూయః, మా.

అర్థము:

రాత్ (రా దానే ధాతువు శత్రంతం.) = ఇచ్చువాడు. అజరః=దేవత. ఆలోకః=తేజస్సు. యానమ్=వాహనము. ఖగః=పక్షి, గరుడుడు. ఇరా=వాక్కు, వేదవాక్కు. దః=ఇచ్చువాడు. భూః= భూమి. యః=పోవునది (యా ధాతువు . క ప్రత్యయము. దః, గః, మొదలైన వాటి లాగా.). ద్యుగః = స్వర్గమును చెందినది. అగః=చెట్టు. మా = వద్దు. హా= అయ్యో! విషాదసూచకము.

అతి-రాత్-అజర-ఆలోక-విరోధ-ఆవహ-సాహస = ఎంతైనా ఇచ్చు దేవతల తేజస్సుకు భంగం కలిగించే సాహసం కలవాడా! (నీతొందరపాటు మాకు హాని చేస్తుంది, అని.)

యాన-సేర-ఖగ = వాహనముగా ఉన్న వేదాత్మకపక్షి (గరుడుడు) గలవాడా!

శ్రీద = సంపదలను ఇచ్చువాడా!

హా = అయ్యో!

స్వమ్, ద్యుగః, అగః = మా సొంతది ఐన ఈ స్వర్గలోకవృక్షము,
భూయః, మా = భూమికి పోవునది కావద్దు.

తాత్పర్యము

కృష్ణుడితో ఇంద్రుడు అన్న మాట – 'సంపదలను ఇచ్చేవాడా! వేదస్వరూపుడైన గరుడుడు వాహనముగా ఉన్నవాడా! ఎంతైనా ఈయగల దేవతల తేజస్సునే భంగపరచే సాహసము కలవాడా! మా సొంతము ఐన ఈ స్వర్గలోక వృక్షము, భూమికి పోవునది కాగూడదు.'
స్వర్గలోకపారిజాతాన్ని భూమికి తీసుకొనిపోగూడదని ఇంద్రుడు కృష్ణుడికి చెప్పాడని సారాంశం.

ఇక, రాబోయే పద్యంలో, రాముని పట్ల రావణుడు జిగీషాహంకారాన్ని చూపటాన్ని అనులోమంలోను, కృష్ణుని పట్టుకొండని ఇంద్రుడు ఆదేశించటాన్ని విలోమంలోను, చెప్పుతున్నాడు.

20. **హతపాపచయే హేయోలంకేశో యమసారధీః**
**రాజిరావిరతేరాపో హాహాహంగ్రహమారఘః**

ఇది అనుష్టుప్పు.

రాముని పట్ల రావణుడు జిగీషాహంకారాన్ని చూపటాన్ని చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

పదవిభాగము :

హత-పాప-చయే, హేయః, లంకేశః, అయమ్, అ-సార-ధీః, రాజి, ర-అవిరత-ఇరా-పః, హే హే, అహంగ్రహమ్, ఆర, ఘః.

సమాసములు

రావిరతేరాపః

రాః=తీక్ష్ణాః=క్రూరులు.

విరతమ్ వినా అవిరతమ్ = విరతం లేక ఎట్లో అట్లు, అవిరతమ్.

ఇరామ్ పిబంతి ఇతి ఇరాపాః – ఇరను త్రావువారు, ఇరాపాః.

అవిరతమ్ ఇరపాః, అవిరతేరాపాః.

రాః చ అవిరతేరాపాః చ, రావిరతేరాపాః = తీక్ష్ణులు  అవిరతేరాపులు ఐనవారు, రావిరతేరాపాః.

అవిరతేరాపాః యస్య సః, అవిరతేరాపః = అవిరతేరాపులు ఎవనికో వాడు, అవిరతేరాపః (రావణః)

అసారధీః

సారా ధీః యస్య సః, అసారధీః = సార ఐన ధీ ఎవనికో వాడు, సారధీః.

సారధీః న భవతి ఇతి, అసారధీః = సారధీ కానివాడు, అసారధీః.

హతపాపచయః

పాపానాం చయః , పాపచయః = పాపులయొక్క చయము, పాపచయః.

హతః పాపచయః యేన సః, హతపాపచయః = పాపచయము ఎవనిచేత హతమో వాడు, హతపాపచయః.

అన్వయము:

ర-అవిరత-ఇరా-పః, అ-సార-ధీః, హేయః, ఘః, అయమ్, లంకేశః, హత-పాప-

చయే, రాజి, అహంగ్రహమ్, ఆర. హా హా.

అర్థము:

రః = తీక్ష్ణుడు. ఇరా=సురా. కల్లు. పాః = తాగువాడు. ఘః= ఘోరుడు. రాజి (రాట్-సప్తమీ)= రాజునందు. అహంగ్రహమ్= అహంకారమును. ఆర (ఋ గతౌ ధాతువు లిట్) = పొందెను.

ర-అవిరత-ఇరా-పః = తీక్ష్ణులు, నిరంతరము కల్లు త్రావువారు ఐన రాక్షసులు గలవాడు,

అ-సార-ధీః = అప్రశస్తమైన బుద్ధి గలవాడు,

హేయః = నీచుడు

ఘః = ఘోరుడు, ఐన

అయమ్, లంకేశః = ఈ లంకాపతి రావణుడు,

హత-పాప-చయే = సంహరింపబడిన పాపులసమూహము (ఖరాదులు) గలవాడగు

రాజి = రాజైన రామునియందు,

అహంగ్రహమ్, ఆర = అహంకారబుద్ధిని (గెలిచి చంపుదునని) పొందెను/వహించెను.

హా హా =అయ్యయ్యో! (విషాదసూచకం)

తాత్పర్యము

మద్యపాయులు క్రూరులు ఐన రాక్షసుల నాయకుడు, అయోగ్యమైన బుద్ధి గలవాడు, దుష్టుడు, భయంకరుడు, ఐన లంకాపతి రావణుడు, ఖరాది పాపులను సంహరించిన రాజగు రామునియందు, జిగీషారూపకమైన అహంకారమును తాల్చెను.

ఖరాదులను చంపినందుకు, రాముడిని గెలుస్తానని రాక్షసరాజైన రావణుడు పట్టుబట్టాడని సారాంశము.

ఇక, విలోమంలో, కృష్ణుని పట్టుకొండని ఇంద్రుడు ఆదేశించటాన్ని, చెప్పుతున్నాడు.

ఘోరమాహ గ్రహంహాహాపో ఽరాతేరవిరాజిరాః

ధీరసామయశోకేఽలం యో హేయేచ పపాత హ

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

రవిరాజిరాః. యః, హాహాపః, హేయే, ధీరస-ఆమయ-శోకే, అలం, పపాత, అరాతేః, ఘోరమ్, గ్రహమ్, ఆహ, చ. హ.

సమాసములు

రవిరాజిరాః = రవి-రాజి-రాః

రవిః ఇవ రాజీ, రవిరాజీ = రవి వలె  రాజించునది, రవిరాజీ.

రవిరాజీ రాః యస్య సః, రవిరాజిరాః = రవిరాజిరా ఎవనికో వాడు, రవిరాజిరాః.

హాహాపః = హాహా-పః (హాహా ఇతి కస్యచిత్  గంధర్వస్య నామ.)

హాహాం పాతి యః సః, హాహాపః =హాహా (గంధర్వుడు) ను పాలించువాడు,

హాహాపః . (ఇక్కడ హాహా అంటే హాహాను, ఇతరగంధర్వులను, అని.)

ధీరసామయశోకః = ధీ-రస-ఆమయ-శోకః

ధియః రసః, ధీరసః = ధీయొక్క రసము, ధీరసః.

ధీరసస్య ఆమయః, ధీరసామయః = ధీరసముయొక్క ఆమయము, ధీరసామయః.

ధీరసామయాత్ శోకః, ధీరసామయశోకః =ధీరసామయమువలన శోకము,

ధీరసామయశోకః.

అన్వయము:

రవి-రాజి-రాః, హాహాపః, యః,హేయే,ధీరస-ఆమయ-శోకే, అలం, పపాత, అరాతేః,

ఘోరమ్, గ్రహమ్, ఆహ. చ. హ.

అర్థము:

రవిః=సూర్యుడు.   రాజీ=ప్రకాశించునది.   రాః = బంగారు (నగలు).   హాహా= ఒక

గంధర్వుడు. ధీరసః = జ్ఞానానందము. ఆమయః=రోగము (దుఃఖము).
అలమ్=మిక్కిలి. పపాత=పడెను. గ్రహమ్=బంధనమును. ఆహ=చెప్పెను.

రవి-రాజి-రాః = సూర్యునివంటి కాంతిగల బంగరు నగలు గలవాడు,
హాహాపః హాహా అను గంధర్వునకు (హంధర్వజాతికి) ఏలిక,
యః = ఎవడో, ఆ ఇంద్రుడు,
హేయే = నీచమైన
ధీరస-ఆమయ-శోకే = వివేకసంబంధిరోగమువలన వచ్చిన శోకములో
అలం, పపాత = మిక్కిలిగా పడిపోయెను.
అరాతేః, ఘోరమ్, గ్రహమ్, ఆహ. చ. = శత్రువైన కృష్ణునియొక్క , ఘోరమగు
బంధనమునుగురించి చెప్పెను కూడ.
హ= అయ్యో! (ఎంత పని జరిగెను!)

తాత్పర్యము

హాహా మొదలగు గంధర్వులకు ఏలిక ఐ, సూర్యకాంతితో మెరసిపోవు బంగరునగలు ధరించిన ఇంద్రుడు, అవివేకరోగమువలన వచ్చిన దుఃఖములో పడిపోయి, శత్రువైన కృష్ణుని పట్టుకొనుడని ఘోరముగా ఆనతి ఇచ్చెను.

కృష్ణుడిని బంధించండని ఇంద్రుడు తనవాళ్ళను ఆదేశించాడని సారాంశం.

ఇక, తరువాతి శ్లోకంలో, రాముడు మారీచుని చంపటాన్ని, సీత ఏకాకినిగా ఉండటాన్ని అనులోమంగాను, పారిజాతాన్ని అపహరించి సంచరిస్తున్న కృష్ణుని

ఇంద్రుడు వెంబడించలేకపోవటాన్ని విలోమంగాను, చెప్పుతున్నాడు.

21. **తాటకేయలవాదేనో హరీహారిగిరాస సః**

**హాసహాయజనాసీతా నాప్తేనా దమనా భువి**

ఇది అనుష్టుప్పు.

అనులోమము - రాఘవము:

రాముడు మారీచుని చంపటాన్ని, సీత ఏకాకినిగా ఉండటాన్ని అనులోమంలో చెప్పుతున్నాడు.

పదవిభాగము :

తాటకేయ-లవాత్, ఏనః-హారీ, హారి-గిరా, ఆస, సః. హా, అ-సహాయ-జనా, సీతా, (అనాప్తేనా) న-ఆప్త-ఇనా, అ-ద-మనాః, భువి, (జాతా).

సమాసములు

తాటకేయలవః = తాటకేయ-లవః

తాటకేయలవాత్ – పంచమీ

తాటకాయాః అపత్యమ్ పుమాన్, తాటకేయః = తాటకయొక్క కొడుకు, తాటకేయః

తాటకేయస్య లవః, తాటకేయలవః.

ఏనోహారీ = ఏనః-హారీ

ఏనసామ్ హారీ, ఏనోహారీ = ఏనస్సులయొక్క హారి, ఏనోహారీ.

హారిగీః = హారి-గీః

హారిణీ చ సా గీః చ, హారిగీః = హారిణి ఐన గీస్సు, హారిగీః.

హారిగిరా – తృతీయా

అసహాయజనా = అ-సహాయ-జనా

సహాయః చ అసౌ జనః, సహాయజనః =సహాయుడైన జనుడు, సహాయజనుడు.

సహాయజనః న యస్యాః సా, అసహాయజనా = సహాయజనుడు లేనిది ఎవరికో ఆమె, అసహాయజనా.

అనాప్తేనా =న-ఆప్త-ఇనా

ఆప్తః న భవతి ఇతి, అనాప్తః = చేరని/చేరబడని వాడు ఎవడో వాడు, అనాప్తః.

అనాప్తః చ సః ఇనః, అనాప్తేనః = అనాప్తుడైన ఇనుడు, అనాప్తేనః.

అనాప్తేనేనః యస్యాః సా, అనాప్తేనా = అనాప్తేనుడు ఎవరికో ఆమె, అనాప్తేనా.

( కాని, అనాప్తేనా అంటే, 'న -ఆప్త-ఇనా = ఆప్తస్స ఇనశ్చ నాస్తి యస్యాః సా' = 'ఆప్తుడు, ఇనుడు , ఇరువురును లేనిది' = 'భర్త ఐన రాముడు గాని, ఆప్తుడైన లక్ష్మణుడుగాని లేనిది', కనుకనే 'అసహాయజనా' ఐనది - అని చెప్పితే ఇంకా మేలేమో అని నా ఊహ.)

అదమనాః =అ-ద-మనాః

దా (క్షాంతిః) యస్య న , తత్, అదమ్ = దము (క్షాంతి) లేనిది దేనికో అది, అదమ్.

అదం చ తత్ మనః, అదమనః = అదము ఐన మనస్సు, అదమనః.

అదమనః యస్యాః సా, అదమనాః = అదమనస్సు ఎవరికో ఆమె, అదమనాః.

అన్వయము:

ఏనః-హారీ, సః (రామః), తాటకేయ-లవాత్, హారి-గిరా, ఆస. భువి (సీతాయాః

స్వస్థానే ఆశ్రమభువి ఇతి), సీతా, అ-ద-మనాః, న-ఆప్త-ఇనా (అనాప్తేనా), అ-సహాయ-జనా, ( జాతా ఇతి). హా.
(అత్ర, న-ఆప్త-ఇనా = అప్రాప్తనాథా/అసన్నిహితనాథా ఇతి మూలవ్యాఖ్యా. కింతు, ఏవం చేత్ సాధుతరమితి మన్యే యథా, న-ఆప్త-ఇనా= అవిద్యమాన ఆప్తశ్చ, అవిద్యమాన ఇనశ్చ, యస్యాః సా, అనాప్తేనా ఇతి, అత ఏవ అసహాయ జనా చేతి. అత్ర ఆప్తో లక్ష్మణ, ఇనో రామశ్చ.)

అర్థము:

ఏనః (స్) = పాపము. లవః = ఛేదనము. హారీ=మనోహరము. గీః=మాట, పలుకు. ఆస= దీపించెను భువి = ఆశ్రమస్థానమునందు. దా= క్షాంతి. ఇనః=నాథుడు. ఆప్తః= చేరినవాడు/హితుడు. హా! = అయ్యో! విషాదసూచకము.

ఏనః-హారీ = పాపములను హరించువాడైన,
సః (రామః) = ఆ రాముడు,
తాటకేయ-లవాత్ = తాటక కొడుకును (మారీచుని) చంపటంవలన,
హారి-గిరా = మనోహరమైన పలుకుతో (తన గొప్ప తారకనామముతో)
ఆస = వెలుగునొందెను, దీపించెను.
భువి (సీతాయాః స్వస్థానే ఆశ్రమభువి ఇతి) = ఆశ్రమభూమియందు,
సీతా = సీత,
అ-ద-మనాః = ఓపిక లేని మనస్సు గలదై (మారీచుని ఆర్తరావమువలన),
న-ఆప్త-ఇనా (అనాప్తేనా) = తనదగ్గరకు చేరని తన భర్తగలదియు ,

అ-సహాయ-జనా, (బభూవ ఇతి) = సహాయజనుడు (లక్ష్మణుడు) లేనిదియును అయ్యెను.

హా = అయ్యో! విషాద సూచకము.

(ఇనుడు = భర్త –రాముడు, ఆప్తుడు = హితుడు-లక్ష్మణుడు, ఇరువురును దగ్గర లేనిది, కనుకనే సహాయజనరహిత అయ్యెను, అని కూడ చెప్ప వచ్చును. )

తాత్పర్యము

పాపహారి ఐన శ్రీరాముడు, తాను తాటక కొడుకగు మారీచుని సంహరించి, మహిమగల తన పేరను మాటతో వెలుగొందెను. ఓర్పులేని మనస్సుతో (కలవరపడ్డ)సీత, భర్త తన దగ్గర లేనిదై, సహాయుడైన లక్ష్మణుడుకూడ లేనిది అయ్యెను. అయ్యో! కష్టము!

రాముడు మారీచుని సంహరించాడని, (వాడి మాయ కేకలకు) ఓర్పు కోల్పోయిన సీత, భర్త తనను చేరేలోపు, లక్ష్మణుడుకూడ దగ్గర లేకుండ ఏకాకిని ఐనదని సారాంశము.

పారిజాతాన్ని అపహరించి సంచరిస్తున్న కృష్ణుని ఇంద్రుడు వెంబడించలేక పోవటాన్ని విలోమంలో చెప్పుతున్నాడు.

**విభునా మదనాప్తేనాతాసీనాజయహాసహా**
**స సరా గిరిహారీ హా నో దేవాలయకేఽటతా**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

విభునా, మదన-ఆప్తేన, ఆత, ఆసీన-అ-జయ-హాస-హా, స-రాః, సః, గిరి-హారీ, హా, నో, దేవాలయకే, అటతా.

సమాసములు

మదనాప్తః = మదన-ఆప్తః.

మదనేన ఆప్తః, మదనాప్తః = మదనునితో ఆప్తుడు (కూడినవాడు), మదనాప్తః.

ఆసీనాజయహాసహా = ఆసీన-అ-జయ-హాస-హా

జయస్య(జయంతస్య) విరోధీ ఇతి, అజయః (ప్రద్యుమ్నః) =జయునియొక్క విరోధి, అజయః.

ఆసీనః చ అజయః, ఆసీనాజయః = ఆసీనుడైన అజయుడు, ఆసీనాజయః.

ఆసీనాజయస్య హాసః (అట్టహాసః), ఆసీనాజయహాసః =ఆసీనాజయునియొక్క హాసము, ఆసీనాజయహాసః.

ఆసీనాజయహాసం హంతి ఇతి, ఆసీనాజయహాసహా = ఆసీనాజయహాసమును హరించువాడు, ఆసీనాజయహాసహా (ఇంద్రుడు)

సరాః = స-రాః (రై)

రాయా సహా వర్తతే ఇతి, సరాః.

గిరిహారీ = గిరి-హారీ

గిరీన్ ప్రహరతి ఇతి, గిరిహారీ = గిరులను ప్రహరించువాడు, గిరిహారీ.

దేవాలయకః = దేవ-ఆలయకః

దేవానామ్ ఆలయః, దేవాలయః = దేవులయొక్క ఆలయము, దేవాలయః.

దేవాలయః ఏవ దేవాలయకః =దేవాలమే దేవాలయకః (స్వార్థకప్)

అన్వయము:

స-రాః, సః, గిరి-హారీ, ఆసీన-అ-జయ-హాస-హా, దేవాలయకే, అటతా.
విభునా, మదన-ఆప్తేన, నో, ఆత, హా,

అర్థము:

రాః (రై) = సంపద. జయః=జయంతుడు. అజయః=జయుని విరోధి, ప్రద్యుమ్నుడు. హా=హరించువాడు, దెబ్బతీయువాడు. దేవాలయకః = స్వర్గము. అటస్ = చరించువాడు. మదనః = ప్రద్యుమ్నుడు. ఆత = పొందెను. న ఆత = పొందలేదు. హా= ఆశ్చర్యసూచకము.

స-రాః = సంపదతో కూడినవాడైన ,
సః,గిరి-హారీ= ఆ గిరిహారి (ఇంద్రుడు),
ఆసీన-అ-జయ-హాస-హా = (తన వాహనమందు) ఆసీనుడైఉన్న ప్రద్యుమ్నుని విజయాట్టహాసమును నివారించినవాడు (ఐనప్పటికీ)
దేవాలయకే, అటతా = స్వర్గంలో తిరుగుతూ ఉన్నవాడును,
మదన-ఆప్తేన, విభునా = ప్రద్యుమ్నునితో కలిసి ఉన్నవాడును, ఐన కృష్ణునితో,
నో, ఆత (ఆత = అత-లిట్-ప్ర.పు-ఏక.) = చేరలేదు.

హా = ఆశ్చర్యము.

తాత్పర్యము

కొండలను నరకిన శ్రీశాలి ఆ ఇంద్రుడు, ప్రద్యుమ్నుడు తన వాహనమునందు కూర్చొని చేసిన జయాట్టహాసమును నివారించినప్పటికి,ప్రద్యుమ్నునితో కలసి స్వర్గమంతట చరిస్తున్న కృష్ణుని చేరలేకపోయెను.
ప్రద్యుమ్నాదులను నిలువరించగలిగినా, కృష్ణుని స్వైరవిహారాన్ని మాత్రం అడ్డుకోలేకపోయాడని సారాంశం.

ఇక, తరువాతి పద్యంలో, రావణుడు సీతను అపహరించటాన్ని అనులోమంలోను, ఇంద్రుడు ప్రద్యుమ్నుడిని నిలువరించటాన్ని విలోమంలోను, చెప్పుతున్నాడు.

22. భారమాకుదశాకేనాశరాధీకుహకేనహా
చారుధీవనపాలోక్యావైదేహీ మహితా హృతా

ఇది అనుష్టుప్పు.

రావణుడు సీతను అపహరించటాన్ని అనులోమంలో చెప్పుతున్నాడు.

అనులోమము - రాఘవము:

పదవిభాగము :

భాః-రమా(ఇక్కడ భాః సకారాంతం. విలోమంలో అకారాంతం.), కుదశాకేన, ఆశర-అధీ-కుహకేన, హా, చారు-ధీ-వనప-ఆలోక్యా, వైదేహీ, మహితా, హృతా.

సమాసములు

భారమా = భాః-రమా (భాః అని సకారాంతం.)

భాసా రమా యా సా, భారమా = భాసచేత రమ ఎవరో ఆమె, భారమా (సీత)

కుదశాకః = కు-దశాకః

కుత్సిత దశా యస్య సః, కుదశాకః = కుత్సితమైన దశ ఎవనికో వాడు,

కుదశాకః (రావణుడు)

ఆశరాధీకుహకమ్ = ఆశర-అ-ధీః-కుహకమ్

ధీః న యస్య సః, అధీః = ధీ లేనిది ఎవనికో వాడు, అధీః (ఆలోచన లేనివాడు).

అధియామ్ కుహకమ్, అధీకుహకమ్ = ఆలోచన లేనివాళ్ళకు కుహకము,

అధీకుహకమ్ (ఆలోచన లేనివారికి కుహకము - మోసగించునది.)

ఆశరస్య అధీకుహకమ్, ఆశరాధీకుహకమ్ = ఆశరునియొక్క అధీకుహకము,

ఆశరాధీకుహకమ్.( రాక్షసుడు చేసిన అధీకుహకము)

ఆశరాధీకుహకేన – తృతీయా. రాక్షసుడు చేసిన అధీకుహకముతో

(వ్యాఖ్యలో –'రాక్షసరూపేణ, అబుద్ధివంచకేన' అని మాత్రం వ్రాసాడు, వివరణం లేదు. నాకు ఇలా తోచింది. 'దుర్గతుడైన రావణునిచేత, రాక్షసులు చేసే అమాయికజనవంచనతో…')

చారుధీవనపాలోక్యా = చారు-ధీ-వన-ప-ఆలోక్యా

వనమ్ పాంతి ఇతి, వనపాః= వనమును పాలించువారు, వనపాః.

చార్వీ ధీః యేషామ్ తే, చారుధియః= చారు ఐన ధీ ఎవరికో వారు, చారుధియః.

చారుధియః చ తే వనపాః, చారుధీవనపాః=చారుధియులైన వనపులు
చారుధీవనపాః.
చారుధీవనపైః ఆలోక్యా, చారుధీవనపాలోక్యా = చారుధీవనపులచేత ఆలోక్య,
చారుధీవనపాలోక్యా.

అర్థము

భాః (స్) = కాంతి. రమా=లక్ష్మి. కు-దశా = దుర్దశ. కుదశాకః=దుర్దశను
పొందినవాడు. ఆసరః= రాక్షసుడు. అధీః= ఆలోచనలేనివాడు, అమాయికుడు.
కుహకమ్=వంచనము. అధీకుహకమ్=అమాయికుల వంచనము.
ధీః=బుద్ధి. వన-పః = వనరక్షకులు, వనదేవతలు. ఆలోక్యా=చూడదగ్గది.
మహితా=గొప్పది.

అన్వయము:

కు-దశాకేన, ఆశర-అ-ధీ-కుహకేన, చారు-ధీ-వన-ప-ఆలోక్యా, భాః-రమా,
మహితా,వైదేహీ, హృతా. హా.
కు-దశాకేన = దుర్దశనుపొందినవానిచేత (రావణునిచేత),
ఆశర-అ-ధీ-కుహకేన = రాక్షసులు చేయు అమాయికుల వంచనతో,
చారు-ధీ-వన-ప-ఆలోక్యా = శుద్ధబుద్ధులైన వనదేవతలచేత
చూడబడుచున్నదియు,
భాః-రమా = కాంతిచేత లక్ష్మివంటిదియు,
మహితా, వైదేహీ, హృతా = గొప్పదియు ఐన విదేహపుత్రి (సీత) హరింపబడినది.

హా.= అయ్యో! విషాదము!

తాత్పర్యము

దుర్దశను పొందిన రావణునిచేత, అమాయికులకు రాక్షసులు  చేయు వంచనతో, నిష్కల్మషమతులైన వనదేవతలచేత  చూడబడుచున్నదియు, లక్ష్మివంటి కాంతిగలదియు, గొప్పదియు, ఐన సీత అపహరింపబడెను. అయ్యో! కష్టము! నిస్సహాయులైన వనదేవతలు చూస్తూ ఉండగా, రావణుడు రాక్షసమాయతో సీతను అపహరించాడని సారాంశం.

ఇక, ఇంద్రుడు ప్రద్యుమ్నుడిని నిలువరించటాన్ని విలోమంలో, చెప్పుతున్నాడు.

**తా హృతా హి మహీదేవైక్యాలోపానవధీరుచా**

**హానకేహకుధీరాశ నాకేశా దకుమారభాః**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

తాః, హృతాః, హి, మహీదేవ-ఐక్య-అలోప-అ-నవ-ధీ-రుచా, హానక-ఈహ-కు-ధీర-ఆశ-నాక-ఈశా, అ-ద-కుమార-భాః.

సమాసములు

మహీదేవైక్యాలోపానవధీరుక్ = మహీదేవ-ఐక్య-అలోప-అ-నవ-ధీ-రుచా

మహ్యామ్ దేవః, మహీదేవః = మహియందు దేవుడు, మహీదేవుడు.

మహీదేవస్య ఐక్యమ్, మహీదేవైక్యమ్ = మహీదేవునియొక్క ఐక్యము, మహీదేవైక్యమ్.

ధీః చ రుక్ చ, ధీరుచౌ = ధీయును, రుక్కును, ధీరుచౌ (ద్వివచనము)

లోపః నాస్తి యయోః తే, అలోపే = లోపము లేనివి ఏవో అవి, అలోపే (ద్వివచనము).

నవే న యే తే, అనవే = క్రొత్తవి కానివి ఏవో అవి, అనవే (ద్వివచనము)

అలోపే చ అనవే చ ధీరుచౌ, అలోపానవధీరుచౌ = అలోపములు అనవములు ఐన ధీరుచులు, అలోపానవధీరుచౌ.

అలోపానవధీరుచౌ యస్య సః, అలోపానవధీరుక్ = అలోపానవధీరుక్కులు ఎవనికో వాడు, అలోపానవధీరుక్.

మహీదేవైక్యేన అలోపానవధీరుక్, మహీదేవైక్యాలోపానవధీరుక్ = మహీదేవైక్యముచేత అలోపానవధీరుక్కు ఐనవాడు, మహీదేవైక్యాలోపానవధీరుక్.

మహీ....రుచా - తృతీయావిభక్తి.

హానకేహకుధీరాశనాకేశా = హానక-ఈహ-కు-ధీర-ఆశ-నాక-ఈశా

హానమ్=హానకమ్ (స్వార్థకప్)= త్యాగము.

హానకే ఇహా యేషామ్ తే, హానకేహాః = హానకమునందు ఈహ ఎవరికో వారు, హానకేహాః.

కుత్సితాః చ ధీరాః చ, కుధీరాః = కుత్సితులైన ధీరులు, కుధీరాః (అల్పధైర్యవంతులు)

హానకేహాః చ కుధీరాః చ తే, హానకేహకుధీరాః = హానకేహులు, కుధీరులు ఐనవారు, హానకేహకుధీరాః.

హానకేహకుధీరేషు ఆశా యస్య సః, హానకేహకుధీరాశః = హానకేహకుధీరులపట్ల ఆశ ఎవనికో వాడు, హానకేహకుధీరాశః.

నాకస్య ఈట్, నాకేశః = నాకముయొక్క ఈట్ /ఈశుడు, నాకేశః

(నాకేశా - నాకేట్ –శవర్ణాంతశబ్దానికి , తృతీయావిభక్తి.)

హానకేహకుధీరాశః చ సః నాకేట్ చ, హానకేహకుధీరాశనాకేట్ = హానకేహ

కుధీరాశుడైన నాకేట్, హానకేహకుధీరాశనాకేట్ .

హానకేహకుధీరాశనాకేశా - తృతీయావిభక్తి.

అదకుమారభాః = అ-ద-కుమార-భాః

దా న విద్యతే యస్య సః, అదః = క్రాంతి లేనిది ఎవనికో వాడు, అదః.

అదః చ సః కుమారః, అదకుమారః = అదుడైన కుమారుడు ఎవడో వాడు,

అదకుమారః

అదకుమారస్య భాః (ఆకారంత భాశబ్దః), అదకుమారభాః = అదకుమారుని యొక్క

భాలు(భాసములు), అదకుమారభాః.

అన్వయము:

మహీదేవ-ఐక్య-అలోప-అ-నవ-ధీ-రుచా, హానక-ఈహ-కు-ధీర-ఆశ-నాక-ఈశా,

తాః, అ-ద-కుమార-భాః, హృతాః, హి.

అర్థము:

(మహీదేవః=విప్రః, ప్రవరుడనే విప్రుడు. ఇంద్రునికి యుద్ధంలో సాయం చేసాడని

హరివంశంలో పారిజాతహరణకథలో.)

ఐక్యమ్=మైత్రి. హానకం=హానం=త్యాగము, యుద్ధత్యాగము. ఈహా=కోరిక.

కుధీరాః= కుత్సితులైనధీరులు, ధైర్యముతగ్గినవారు. ఆశా =ఆశ. ఈశా ( ఈట్

శబ్దతృతీయాంతరూపం.)= ఈశునిచేత. అలోపః = పోనిది. అనవ= కొత్తది కానిది,

చిరంతనము. ధీః=బుద్ధి. రుచా (రుక్-తృతీయా) = కాంతి. దా=ఖాంతి. కుమారః=ప్రద్యుమ్నుడు. భాః (భా -ఆకారాంతము) = కాంతులు. హృతాః= పోగొట్టబడినవి.

మహీదేవ-ఐక్య-అలోప-అ-నవ-ధీ-రుచా, హానక-ఈహ-కు-ధీర-ఆశ-నాక-ఈశా, తాః, అ-ద-కుమార-భాః, హృతాః, హి.

మహీదేవైక్యాలోపానవధీరుచా = బ్రాహ్మణునియొక్క సౌహార్దముచే, బుద్ధియు తేజస్సును స్థిరములైనవాడును, హానకేహకుధీరాశనాకేశా = యుద్ధమును వదలగోరిన తనవారియందు ఆశలుగల ఇంద్రునిచేత,

అదకుమారభాః = సహనములేని ప్రద్యుమ్నునియొక్క కాంతులు హరింపబడినవి.

తాత్పర్యము

ప్రవరుడనే ఒక బ్రాహ్మణుని సౌహార్దముచే తన బుద్ధియు తేజస్సును మరల స్థిరపడగా, ఇంద్రుడు, యుద్ధమును వీడిపోగోరుచున్న తనవారిమీద అపేక్షతో, అసహనముతో విజృంభించిన ప్రద్యుమ్నుని కాంతులను పోగొట్టెను. తెప్పరిల్లిన ఇంద్రుడు, పారిపోబోతున్న తనవారిని నిలుపగోరి, ప్రద్యుమ్నుడిని నిలువరించాడని సారాంశము.

ఇకతరువాత పద్యంలో, సీతావియుక్తుడైన రామునితో హనుమదాదులు కలవటాన్ని అనులోమంలోను, ఇంద్రునిచేతిలో యుద్ధంలో భంగపడ్డ ప్రద్యుమ్నుడు వెంటనే తేరుకోవటాన్ని విలోమంలోను, చెప్పుతున్నాడు.

23. హారితోయదభో రామావియోగేనఘవాయుజః
    తం రుమామహితోపేతా మోదో౽ సారజురామయః

ఇది అనుష్టుప్పు.

అనులోమము - రాఘవము:

సీతావియుక్తుడైన రామునితో హనుమదాదులు కలవటాన్ని అనులోమంలో చెప్పుతున్నాడు.

పదవిభాగము :

హారి-తోయద-భః, రామా-వియోగే, అనఘ-వాయుజః, తం, రుమా-మహితః, అపేత-ఆమోదః, అ-సార-జః, ఆమ, యః.

సమాసములు

హారితోయదభః = హారి-తోయద-భః,
హారీ చ సః తోయదః, హారితోయదః = హారి ఐన తోయదము, హారితోయదః.
హారితోయదస్య ఇవ భా యస్య సః, హారితోయదభః = హారితోయదముయొక్క కాంతి వంటి కాంతి ఎవరికో వాడు, హారితోయదభః.
రామావియోగః = రామా-వియోగః,
రామయా వియోగః, రామావియోగః = రామతో వియోగము, రామావియోగః.
అనఘవాయుజః = అనఘ-వాయుజః,

అనఘః వాయుజః యస్య సః, అనఘవాయుజః = అనఘుడైన వాయుజుడు ఎవనికో వాడు, అనఘవాయుజః .

రుమామహితః = రుమా-మహితః,

రుమయా మహితః, రుమామహితః = రుమచేత మహితుడు/పూజితుడు, రుమామహితః.

అపేతామోదః = అపేత-ఆమోదః,

అపేతః ఆమోదః యస్య సః, అపేతామోదః =ఆపేతమైన ఆమోదము ఎవనికో వాడు, అపేతామోదః.

అ-సార-జుః అసారజుః

సారః చ జుః చ న యస్య సః, అసారజుః = సారము, జువు, లెనివాడు ఎవడో వాడు, అసారజుః.

అన్వయము:

రామా-వియోగే (సతి), హరి-తోయద-భః, యః, తమ్ (రామమ్), అనఘ-వాయుజః, అ-సార-జుః,అపేత-ఆమోదః, రుమా-మహితః, ఆమ.

అర్థము:

రామా =వనిత, సీత. వియోగః=ఎడబాటు. భా=కాంతి. తోయదభః = మేఘమువంటి కాంతిగలవాడు, రాముడు. అనఘః = నిష్కల్మషుడు. వాయుజః = హనుమంతుడు. సారః=బలము. జుః=కీర్తి. అసారజుః = బలము, కీర్తి, లేనివాడు. రుమా=సుగ్రీవునిభార్య. మహితః = పూజింప బడినవాడు.

అనఘో వాయుజో యస్య సః అనఘవాయుజః= ఇది సుగ్రీవుడికి విశేషణము.

అసారజుః = బలము, కీర్తి, లేనివాడు. ఇది సుగ్రీవునికి విశేషణము.

(ఆమ = ఆమ గతౌ – లిట్ ) = ప్రాప్తవాన్.

రామా-వియోగే (సతి) = (రామునకు) భార్యావియోగము కలుగగా,

హారి-తోయద-భః, యః = మనోహరమైన మేఘము వంటి కాంతి గలవాడు ఎవడో,

తమ్ (రామమ్) = ఆ రాముని.,

అనఘ-వాయుజః = అనఘుడైన హనుమంతుడు తనతో గలవాడును,

అ-సార-జుః = బలమును కీర్తియును లేనివాడును,

అపేత-ఆమోదః = సంతోషము తొలగిపోయినవాడును, ఐన

రుమా-మహితః = రుమాభర్త, సుగ్రీవుడు,

ఆమ (ఆమ-అమ గతౌ ధాతువు – లిట్ ) = చేరెను.

తాత్పర్యము

రామునకు భార్యావియోగము కలుగగా, మేఘమువంటి కాంతి గల ఆ రాముని దగ్గరకు, బలమును కీర్తియు సంతోషమును పోయినవాడును, అనఘుడైన హనుమంతునితో కూడినవాడును, రుమాభర్తయు ఐన సుగ్రీవుడు, చేరెను. భార్యావియుక్తుడైన రాముడిని, కష్టాలలో ఉన్న సుగ్రీవుడు హనుమంతుడితో సహ కలిసాడని సారాంశము.

ఇక, ఇంద్రునిచేతిలో యుద్ధంలో భంగపడ్డ ప్రద్యుమ్నుడు వెంటనే తేరుకోవటాన్ని విలోమంలో చెప్పుతున్నాడు.

యో౽మరాజు రసాదోమోతాపేతో హిమమారుతం
జో యువా ఘనగేయో విమారాభోదయతోరిహా

ప్రతిలోమము - యాదవీయము:

ప్రద్యుమ్నుడు తేరుకోవటాన్ని చెప్పుతున్నాడు.

పదవిభాగము:

యః, అమర-అ-జుః, అసాద-ఉమః, అ-తాప-
తః, హిమ-మారుతమ్, జః,
యువా, ఘనగేయః, విమ్, ఆర, ఆభా-ఉదయతః, అరి-హా.

సమాసములు

అమరాజుః = అమర-అ-జుః
జుః యుద్ధం న ఇతి అజుః = యుద్ధము లేకపోవుట, అజుః.
అమరైః అజుః యస్య సః, అమరాజుః = అమరులతో యుద్ధము లేమి ఎవనికో
వాడు, అమరాజుః (ప్రద్యుమ్నుడు.)
అతాపేతః = అ-తాప-ఇతః
తాపమ్ ఇతః, తాపేతః = తాపమును పొందినవాడు, తాపేతః.
తాపేతః న భవతి ఇతి, అతాపేతః =తాపేతుడు కానివాడు, అతాపేతః.
ఆభోదయతః = ఆభా-ఉదయతః

ఆభాయాః ఉదయః, ఆభోదయః = ఆభయొక్క ఉదయము, ఆభోదయః.

ఆభోదయాత్, ఆభోదయతః = ఆభోదయము వలన= ఆభోదయతః.

అరిహా = అరి-హా

అరీన్ హంతి ఇతి, అరిహా = అరులను చంపువాడు, అరిహా.

అసాదోమః = అ-సాద-ఉమః (ఉమా)

సాదః న యస్యాః సా , అసాదా = సాదము లేనిది, అసాదా.

అసాదా ఉమా యస్య సః, అసాదోమః = అసాద ఐన ఉమ ఎవనికో వాడు, అసదోమః.

ఘనగేయః = ఘన-గేయః.

ఘనైః గేయః, ఘనగేయః = ఘనులచేత గేయుడు (పొగడదగ్గవాడు), ఘనగేయః.

అన్వయము:

యువా, యః, ప్రద్యుమ్నః, అమర-అ-జుః, హిమ-మారుతమ్, తమ్, విమ్, ఆప. అ-తాప-ఇతః, ఆభా-ఉదయతః, అరి-హా, జః, అ-సాద-ఉమః, ఘన-గేయః,( బభూవ).

అర్థము:

జుః = యుద్ధము. అజుః= యుద్ధము లేకపోవుట. అమరాజుః=అమరులతో యుద్ధము లేనివాడు. విమ్ = ఆకాశము. ఇతః = పొందినవాడు. ఆభా= కాంతి. అరిః=శత్రువు. హా= చంపువాడు. సాదః=అవసానము. ఉమా= కీర్తి. యువా= యువకుడు. జః= జయించువాడు. గేయః=స్తుత్యుడు.

యువా, ప్రద్యుమ్నః, యః (సః) = యువకుడైన ప్రద్యుమ్నుడు,

అమర-అ-జుః =అమరులతో యుద్ధము లేక ఉన్నవాడై నప్పటికి,

హిమ-మారుతమ్, తమ్, విమ్, ఆప = చల్లని గాలులుగల ఆ ఆకాశమును పొందెను. (కనుకనే),

అ-తాప-ఇతః = తాపమును పొందినవాడుగాక,

ఆభా-ఉదయతః = తన తేజస్సు ఉదయించుటవలన,

అరి-హా, జః = శత్రువులను దెబ్బతీయువాడు, విజేతయు,

అ-సాద-ఉమః = నశించని కీర్తిగలవాడు,

ఘన-గేయః,( బభూవ) = గొప్పవారిచేత పొగడదగినవాడు, అయ్యెను.

తాత్పర్యము

కొంత సేపు అమరులతో యుద్ధమును మాని ఉన్నప్పటికీ, యువకుడైన ప్రద్యుమ్నుడు, బయటి చల్లగాలుల వలన సేదతీరి, తన తేజస్సుతో మరల శత్రువులను దెబ్బతీసి విజేతయై, పెద్దల పొగడితలను అందుకొనెను. ప్రద్యుమ్నుడు తేరుకొని శత్రువులను దెబ్బతీయటంతో అతనిని అందరు పొగడారని సారాంశం.

ఇక, తరువాత పద్యంలో, రాముడు చేసిన వాలివధను అనులోమంలోను, దేవతలశరఘాతాలు తగిలిన గరుత్మంతుడిని శ్రీకృష్ణుడు రక్షించటాన్ని ప్రతిలోమంలోను, చెప్పుతున్నాడు.

24. భానుభానుతభావామాసదామోదపరో హతం
    తం హ తామరసాభాక్షో౽ తిరాతాకృతవాసవిం

ఇది అనుష్టుప్పు.

అనులోమము - రాఘవము:

రాముడు చేసిన వాలివధను అనులోమంలో చెప్పుతున్నాడు.

పదవిభాగము :

భాను-భా-నుత-భాః, వామా-సదా-ఆమోదపరః, హతం, తం, హ, తామరసాభాక్షః, అతిరాతా, అకృత, వాసవిమ్, హ (హ ఇతి పాదపూరణే.) రాతా – రా ధాతోః తృచ్ ప్రత్యయః).

సమాసములు

భానుభానుతభాః = భాను-భా-నుత-భాః

భానోః భా, భానుభా = భానునియొక్క భా, భానుభా.( ఇక్కడ భా ఆకారాంతం. విలోమంలో భాః-సకారాంతం.)

భానుభయా నుతా, భానుభానుతా = భానుభ చేత నుత ఐనది, భానుభానుతా.

భానుభానుతా భాః యస్య సః, భానుభాః = భానుభానుత ఐన భాః ఎవనికో వాడు, భానుభానుతభాః (ఇక్కడ చివరి భాః సకారాంతం, విలోమంలో మాత్రం ఆకారాంతం.)

వామాసదామోదపరః = వామా-సత్-ఆమోదపరః.

సస్ ఆమోదః, సదామోదః = మంచి ఆనందము, సదామోదః.

సదామోదే తత్పరః, సదామోదపరః = సదామోదమునందు తత్పరుడు, సదామోదపరః.

భామయా సదామోదపరః, భామాసదామోదపరః = భామతో సదామోదపరుడు, భామాసదామోదపరః.

తామరసాభాక్షః = తామరస-ఆభ-అక్షః

తామారసానామ్ ఆభా, తామరసాభా = తామరసముల ఆభ , తామరసాభా.

తామరసాభా అక్ష్ణోః యస్య సః, తామరసాభాక్షః = తామరసాభ ఎవని కన్నులకో వాడు, తామరసాభాక్షః.

అతిరాతా

అత్యంతం రాతి ఇతి, అతిరాతా = అతిగా ఇచ్చువాడు, అతిరాతా.

అన్వయము:

భానుభానుతభాః, వామాసదామోదపరః, అతిరాతా, తామరసాభాక్షః (రామః), తమ్, వాసవిమ్, హతమ్, అకృత.

అర్థము:

భాను-భా-నుత-భాః = సూర్యకాంతిచేత పొగడబడిన కాంతి గలవాడు,

వామాసదామోదపరః= స్త్రీతోసహ (సీతతో కలసి ఉండి) ఎల్లప్పుడు ఉత్తమానందమును కలిగించుటలో నిమగ్నుడైనవాడు,

అతిరాతా = అత్యంతము ఇచ్చువాడు,

తామరసాభాక్షః (రామః) = తామరలవంటి కాంతిగల కన్నులు ఉన్నవాడు,( రాముడు)

తమ్, వాసవిమ్ = ఆ ఇంద్రసుతుని (ప్రసిద్ధుడైన వాలిని)

హతమ్, అకృత = హతుని కావించెను.

తాత్పర్యము

సూర్యతేజస్సును మించిన తెజస్సు గలవాడు, తామరల వంటి కన్నులుగలవాడు, సీతతో ఉండి ఉత్తమానందమును ఇచ్చువాడు, అత్యంతము దాతయు ఐన రాముడు, ప్రసిద్ధుడైన ఆ ఇంద్రసుతుడు వాలిని చంపెను.

వాలిని రాముడు చంపాడని సారాంశము.

ఇక, దేవతలశరఘాతాలు తగిలిన గరుత్మంతుడిని శ్రీకృష్ణుడు రక్షించటాన్ని ప్రతిలోమంలో చెప్పుతున్నాడు.

**విం స వాతకృతారాతిక్షోభాసారమతాహతం**

**తం హరోపదమో దాస మావాభాతనుభానుభాః**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

విమ్, సః, వాత-కృత-అరాతి-క్షోభా-అసార-మత-ఆహతమ్, తమ్, హర-ఉపదమః, దాసమ్, ఆవ, ఆభా-తను-భాను-భాః,

సమాసములు

వాతకృతారాతిక్షోభాసారమతాహతః = వాత-కృత-అరాతి-క్షోభ-అసార-మత-ఆహతః

మతస్య ఆహతమ్, మతాహతమ్ = అభిమతమునకు ఆహతము, అభిమతాహతమ్.

క్షోభః చ అసారః చ మతాహతమ్ చ, క్షోభాసారమతాహతాని = క్షోభము అసారము మతాహతము, క్షోభాసారమతాహతాని.

అరాతీనాం క్షోభాసారమతాహతాని, అరాతిక్షోభాసారమతాహతాని = అరాతుల యొక్క క్షోభాసారమతాహతములు, అరాతిక్షోభాసారమతాహతాని.

వాతేన కృతాని అరాతిక్షోభాసారమతాహతాని యేన సః = వాతకృతారాతి క్షోభాసారమతాహతః

వాతకృతారాతిక్షోభాసారమతాహతమ్ – ద్వితీయా.

అన్వయము:

ఆభా-తను-భానుభాః, హర-ఉపదమః, వాత-కృత-అరాతి-క్షోభా-అసార-మత-ఆహతమ్, తమ్, దాసమ్, విమ్, ఆవ.

అర్థము:

ఆభా =కాంతి. తనుః/తన్వీ= తక్కువది. భాః (స్) = కాంతి. ఉపదమః = నిగ్ర హించినవాడు. అసారః = బలహైన్యము. మతమ్ = అభీష్టము. ఆహతమ్ ( భావే క్త) = దెబ్బ.. విమ్ = పక్షిని (గరుత్మంతుడిని). ఆవ (అవ ధాతువు లిట్) = కాపాడెను.

ఆభా-తను-భానుభాః = తన కాంతిచేత సూర్యకాంతియే తక్కువ ఐనవాడు,

హర-ఉపదమః = శివుని నిగ్రహించినవాడు (బాణునితో యుద్ధమప్పుడు), ఐన

సః (కృష్ణః) = అతడు, కృష్ణుడు,

వాత-కృత-అరాతి-క్షోభా-అసార-మత-ఆహతమ్ = తన రెక్కలగాలిచేత

శత్రువులకు క్షోభ చేసి, వారి బలమును పోగొట్టి, వారి ఆశలను

దెబ్బతీసినవాడు,

దాసమ్, తమ్, విమ్ = తన దాసుడును ఐన ఆ పక్షిని , అనగా గరుడుని,

ఆవ (అవ ధాతువు -లిట్) = కాపాడెను.

తాత్పర్యము.

తన రెక్కలగాలి చేత శత్రువులకు క్షోభమును, బలహీనతను, అభిమతహానిని,
కలిగించు పక్షిరాజు గరుత్మంతుని - సూర్యతేజస్సును మించిన తేజస్సుగలవాడు,
శివుని నిగ్రహించిన వాడు, ఐన శ్రీకృష్ణుడు, కాపాడెను.
దెబ్బతిన్న గరుత్మంతుడిని కృష్ణుడు కాపాడాడని సారాంశం. ఈ దెబ్బ ఏమిటో
తరువాత శ్లోకంలో చెప్పాడు. ఆ మాటలతో ఈ శ్లోకంలోని పదాలకు అన్వయం.

ఇక, రాబోయే పద్యంలో, వాలివధ తరువాత రామునికి రావణవధార్థ
జయలక్ష్మిశోభతోపాటు సుగ్రీవసైన్యలాభంవలన తేజోవృద్ధికూడ
ఐనదని అనులోమంలోను, గరుత్మంతుని రక్షించిన కృష్ణునికి జయలక్ష్మిసిద్ధి
కలిగిందని ప్రతిలోమంలోను చెప్పుతున్నాడు.

25. హంసజారుద్ధబలజాపరోదారసుభాజని
రాజిరావణరక్షోరవిఘాతాయరమారయం

ఇది అనుష్టుప్పు.

అనులోమము - రాఘవము:

వాలివధ తరువాత రామునికి రావణవధార్థజయక్ష్మీశోభతోపాటు సుగ్రీవసైన్యలాభంవలన తేజోవృద్ధికూడ ఐనదని చెప్పుతున్నాడు.

పదవిభాగము :

హంస-జ-అ-రుద్ధ-బల-జా, పర-ఉదార-సు-భా, అజని, రాజి, రావణ-రక్షః-ర-విఘాతాయ, రమా, ఆర, యమ్ (రామమ్).

సమాసములు

హంసజారుద్ధబలజా = హంస-జ-అ-రుద్ధ-బల-జా
హంసజః = సూర్యసుతుడు, సుగ్రీవుడు.
న రుద్ధమ్ బలమ్ యత్ తత్, అరుద్ధమ్ = రుద్ధముకాని బలము, అరుద్ధబలమ్
(వ్యాఖ్యలో అరుద్ధ=అతిప్రహ్వ అని చెప్పాడుగాని, నాకు ఇది మేలనిపించింది.)
హంసజస్య అరుద్ధబలమ్, హంసజారుద్ధబలమ్ = హంసజుని అరుద్ధబలము, హంసజారుద్ధబలమ్.
హంసజారుద్ధబలాత్ జాతా, హంసజారుద్ధబలజా = హంసజారుద్ధ

బలమునుండి పుట్టినది, హంసజారుద్ధబలజా.

పరోదారసుభా = పర-ఉదార-సుభా.

శోభనమ్ భా, సుభా= మంచి తేజస్సు, సుభా.

పరా చ ఉదారా చ సుభా, పరోదారసుభా = పరయు, ఉదారయు ఐన సుభా, పరోదారసుభా.

రావణరక్షోరవిఘాతమ్ = రావణ-రక్షః-ర-విఘాతమ్

రావణః నామ రక్షః, రావణరక్షః = రావణుడనే రక్షస్సు, రావణరక్షః.

రావణరక్షసః రాణి, రావణరక్షోరాని = రావణరక్షస్సుయొక్క రములు(తలలు), రావణరక్షోరాణి.

రావణరక్షోరాణామ్ విఘాతమ్ = రావణరక్షోరవిఘాతమ్ = రావణరక్షోరములయొక్క విఘాతము, రావణరక్షోరవిఘాతమ్.

రావణరక్షోవిఘాతాయ - చతుర్థీవిభక్తి.

అన్వయము:

యమ్, రామమ్, రావణ-రక్షః-ర-విఘాతాయ, రమా, ఆర. (తస్మిన్) రాజి (రామే), హంస-జ-అ-రుద్ధ-బల-జా, పర-ఉదార-సుభా, అజని.

అర్థము:

రక్షః ( స్) = రాక్షసుడు. రమ్ = తల. రమా= లక్ష్మి,కాంతి. ఆర (ఋ గతౌ లిట్) = పొందెను. రాజి (రాట్-సప్తమీ) = రాజునందు-రామునియందు. హంసః= సూర్యుడు.

హంసజః=సూర్యపుత్రుడు, సుగ్రీవుడు.    అరుద్ధా=అడ్డ గింపబడనిది.

బలమ్=సైన్యము.       జా=పుట్టినది.    పరా=ఉత్తమమైనది.

ఉదారా= గొప్పది.    సుభా = మంచి తేజస్సు.    అజని = పుట్టెను,కలిగెను.

(జనీ ధాతువు ఆత్మ-లుఙ్ )

యమ్, రామమ్ = ఏ రాముని,

రావణ-రక్షః-ర-విఘూతాయ =  రావణుడను రాక్షసుని తలల నరకుటకు,

రమా, ఆర (ఋ గతౌ - లిట్)  = జయలక్ష్మి చేరెనో,

(తస్మిన్) రాజి (రామే) = రాజగు ఆ రామునియందు,

హంస-జ-అ-=రుద్ధ-బల-జా = సుగ్రీవునియొక్క అడ్డగింపబడని సైన్యమునుండి పుట్టిన

పర-ఉదార-సుభా =  అత్యుత్తమము గొప్పది ఐన గొప్ప తేజస్సు,

అజని (జనీ ధాతువు - ఆత్మ-లుఙ్ )=   కలిగెను.

తాత్పర్యము

వాలివధ తరువాత, రాక్షసుడైన రావణుని తలలు నరకుటకై, జయలక్ష్మి చేరిన రామునియందు, అడ్డములేని సుగ్రీవసైన్యమువలన,  అత్యుత్తమము ఉదారము ఐన గొప్ప తేజస్సు కలిగెను.

రావణసంహారానికి సిద్ధపడ్డ రాముని జయశోభ,  సుగ్రీవసైన్యసంపత్తివలన కొత్త తేజస్సును సంతరించుకొన్నదని సారాంశము.

ఇక, గరుత్మంతుని ఎందుకు రక్షించాడో అని, ఆ  రక్షించిన కృష్ణునికి జయలక్ష్మీసిద్ధి

కలిగిందని ప్రతిలోమంలో చెప్పుతున్నాడు.

**యంరమారయతాఘావిరక్షోరణవరాజిరా**

**నిజభాసురదారోపజాలబద్ధరుజాసహం**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

యమ్, రమా, ఆర, యత-అఘా, వి-రక్షః-రణ-వర-అజిరా, నిజ-భా, సుర-దా, రోప-జాల-బద్ధ-రుజా-సహమ్.

సమాసములు

యతాఘా = యత-అఘా

యతాః అఘాః యస్యాః సా, యతాఘా =

యతములైన అఘములు కలది, యతాఘా.

విరక్షోవరరణాజిరా = వి-రక్షః-వర-రణ-అజిరా

రణస్య అజిరమ్, రణాజిరమ్ = రణముయొక్క అజిరము, రణాజిరమ్.

వరం చ తత్ రణాజిరమ్, వరరణాజిరమ్ = వరమైన రణాజిరము, వరరణాజిరమ్.

విగతా రక్షాంసి యస్యాః/యస్మాత్ తత్, విరక్షాః = విగతులైన రాక్షసులు దేనికో అది విరక్షాః.

విరక్షాః చ వరరణాజిరం చ తత్, విరక్షోవరరణాజిరమ్ = విరక్షసమైన వరరణాజిరము, విరక్షోవరరణాజిరమ్.

విరక్షోవరరణజిరమ్ యస్యాః సా, విరక్షావరరణాజిరా = విరక్షావరరణాజిరము ఎవరికో

అది (స్త్రీలింగం), విరక్షోవరరణాజిరా.

నిజభా = నిజ-భా

నిజా చ సా భా, నిజభా = నిజ ఐన భా, నిజభా. (నిజా=అవినాశినీ)

నిజభా యస్యాః సా, నిజభా = నిజభా ఎవరికో ఆమె, నిజభా (శాశ్వతకాంతి గలది)

సురదా = సుర-దా

సురాన్ ద్యతి ఇతి, సురదా = సురలను ఖండించునది, సురదా.

రోపజాలబద్ధరుజాసహః = రోప-జాల-బద్ధ-రుజా-సహః.

రోపానామ్ జాలమ్, రోపజాలమ్ = రోపములయొక్క జాలము, రోపజాలమ్.

రోపజాలేన బద్ధమ్, రోపజాలబద్ధమ్ = రోపజాలముచేత బద్ధము, రోపజాలబద్ధమ్.

రోపజాలబద్ధా సా రుజా, రోపజాలబద్ధరుజా = రోపజాలబద్ధ ఐన రుజ,
రోపజాలబద్ధరుజా.

రోపజాలబద్ధరుజామ్ సహతే ఇతి, రోపజాలబద్ధరుజాసహః =
రోపజాలబద్ధరుజను సహించువాడు, రోపజాలబద్ధరుజాసహః.

రోపజాలబద్ధరుజాసహమ్ – తృతీయా.

అన్వయము:

వి-రక్షాః-రణ-వర-అజిరా, నిజ-భా, సుర-దా, రమా, యమ్ (కృష్ణమ్), ఆర, (సః అనే పూర్వపద్యపదంతో అన్వయం.).

రోప-జాల-బద్ధ-రుజా-సహమ్, ( తం, విం, ఆవ. అని పూర్వశ్లోకంలోని పదాలతో అన్వయం. )

( రమాం ప్రాప్తః కృష్ణః, ‘ దాసం తం విం (= గరుత్మంతం) ఆవ ఇతి పూర్వపద్య వాక్యేనాన్వయః. = జయలక్ష్మి చేరిన కృష్ణుడు ఆ గరుత్మంతుడిని రక్షించాడని

ఇంతకు ముందటి శ్లోకంలోని వాక్యంతో అన్వయం.)

అర్థము:

రమా = లక్ష్మి. ఆర (ఋ గతౌ-లిట్) =పొందెను. అఘమ్ = పాపము. యతమ్ = పోగొట్టబడినది. రక్షః(స్) = రాక్షసుడు. విరక్షాః = తొలగి పోయిన రాక్షసులు గలది. అజిరమ్ = అంగణము. వరమ్ = శ్రేష్ఠము. నిజా=అవినాశినీ. భా= తేజస్సు. దా (దో అవఖండనే) = ఖండించునది.
రోపః = బాణము. రుజా= దుఃఖము, పీడ. సహః = సహించువాడు.

యత-అఘా = అణచివేయబడిన పాపములు గలది,
వి-రక్షాః-రణ-వర-అజిరా = తొలగిపోయిన రాక్షసులు గల శ్రేష్ఠమైన రణాంగణము గలది,
నిజ-భా = శాశ్వతమైన కాంతి గలది,
సుర-దా, రమా = దేవతలను ఖందించునది ఐన లక్ష్మి (జయలక్ష్మి)
యమ్, ఆర = ఎవరిని చేరెనో, ఆ కృష్ణుడు (గరుడుని కాపాడెను అని వెనుకటి శ్లోకముతో అన్వయము.).
రోప-జాల-బద్ధ-రుజా-సహమ్ = బాణసమూహముచేత కల్పించబడిన దుఃఖమును సహించువానిని (దాసుడైన గరుత్మంతుని రక్షించెను అని ఇంతకు ముందటి శ్లోకములోని పదాలతో అన్వయము.)

తాత్పర్యము

రణాంగణమునుండి రాక్షసులను పారద్రోలునది, పాపములను అణచునది, శాశ్వతమైనది, సురలను ఖండించునది ఐన జయలక్ష్మిని పొందిన కృష్ణుడు, బాణముల గుంపువలన కలిగిన పీడను సైచిన వానిని (దాసుని, గరుత్మంతుని, రక్షించెను అని వెనుకటి శ్లోకములోని పదాలతో అన్వయము.)
దేవతల బాణాలదెబ్బతిన్న గరుడుడిని కృష్ణుడు కాపాడాడని సారాంశం. దీనికి ఇంతకు ముందు శ్లోకపు పదాలతో అన్వయం.

ఇక, తరువాతి శ్లోకంలో, సీతాన్వేషణానంతరం రాముడు హనుమదాదులతో కలసి సముద్రతీరం దగ్గరకు చేరటాన్ని అనులోమంలోను, కృష్ణుడు ఇంద్రుని అతిక్రమించి పారిజాతాన్ని పట్టుకోవటాన్ని విలోమంలోను, చెప్పుతున్నాడు.

26. **సాగరాతిగమాభాతి నాకేశోసురమాసహః**

**తం సమారుతజం గోప్తా భాదాసాద్యగతోగజం**

ఇది అనుష్టుప్పు.

అనులోమము - రాఘవము:

సీతాన్వేషణానంతరం రాముడు హనుమదాదులతో కలసి సముద్రతీరం దగ్గరకు చేరటాన్ని అనులోమంలో చెప్పుతున్నాడు.

పదవిభాగము :

సాగర-అతి-గమ్, ఆభా-అతి-నాక-ఈశః, అ-సుర-మా-అ-సహః, తమ్, సః,

మారుతజమ్, గోష్ఠా, అభాత్, ఆసాద్య, గతః, అగజమ్.

సమాసములు

ఆభాతినాకేశః = ఆభా-అతి-నాక-ఈశః

నాకస్య ఈశః, నాకేశః = నాకమునకు ఈశుడు, నాకేశః.

అతిక్రామతి నాకేశమ్ యేన సః, అతినాకేశః = నాకేశుని అతిక్రమించినవాడు, అతినాకేశః

ఆభయా అతినాకేశః, ఆభాతినాకేశః = ఆభచేత అతినాకేశుడు, ఆభయాతినాకేశః.

అసురమాసహః = అ-సుర-మా-అసహః

సురాః న భవంతి ఇతి, అసురాః = సురలు కానివారు అసురాః.

అసురాణాం మా, అసురమా = అసురుల మా (లక్ష్మి), అసురమా.

అసురమామ్ న సహతే ఇతి, అసురమాసహః.

సాగరాతిగమ్ = సాగర-అతిగమ్.

అగజమ్ అగ-జమ్

అగాః పర్వతాశ్చ  జా సముద్రవేలా చ  ఇతి అగజమ్, సమాహారద్వంద్వస్య ఏకవద్భావనపుంసకత్వాభ్యామ్.

అగానాంచ జాయాః చ సమాహారః, అగజమ్ = అగములయొక్కయు జా యొక్కయు సమాహారము, అగజమ్.

( అగాః=కొండలు, జా=సముద్రతీరము. వీని సమాహారము – అజగమ్. సమాహారద్వంద్వము కనుక ఏకవచనము, నపుంసకలింగము.)

అన్వయము:

ఆభా-అతి-నాకేశః, అసుర-మా-అసహః, గోప్తా, సః (రామః), సాగర-అతిగమ్,
తమ్, మారుతజమ్, ఆసాద్య, అగ-జమ్, గతః, అభాత్.

అర్థము:

ఆభా = కాంతి. మా=లక్ష్మి. అగజమ్ = కొండలను, సముద్రతీరమును,
గతః=పొందినవాడు. అభాత్ (భా ధాతువు లఙ్) = ప్రకాశించెను.

ఆభాతినాకేశః = తన తేజస్సుతో ఇంద్రుని మించినవాడు,
అసుర-మా-అసహః = రాక్షసుల సంపదను సహించనివాడు,
గోప్తా, సః (రామః) = రక్షకుడు ఐన ఆ రాముడు,
సాగర-అతిగమ్ = సముద్రమును దాటిన
తమ్, మారుతజమ్, ఆసాద్య = ఆ హనుమంతుని పొంది,
అగ-జమ్, గతః, అభాత్ = (సహ్యాద్రి) పర్వతములను సముద్రతీరమును
పొందినవాడై, శోభించెను.

తాత్పర్యము

ఇంద్రుని మించిన తేజశ్శాలి, రాక్షసుల సంపదను సైచనివాడు, రక్షకుడు ఐన
రాముడు, సముద్రాన్ని లంఘించిన హనుమంతుని కూడి, పర్వతములను దాటి,
సముద్రతీరమును చేరి శోభించెను.
హనుమదాదులతో కూడి రాముడు సముద్రతీరాన్ని చేరాడని సారాంశం.

ఇక, ప్రతిలోమంలో, కృష్ణుడు ఇంద్రుని అతిక్రమించి పారిజాతాన్ని పట్టుకోవటాన్ని  చెప్పుతున్నాడు.

**జంగతో గద్యసాదాభాప్తాగోజంతరుమాసతం**

**హః సమారసుశోకేనాతిభామాగతిరాగసా**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

జమ్, గతః, గదీ, అసాద-ఆభా-ఆప్తా (ఆప్తా - ఆప్ఌ ధాతో స్తృచ్), గోజమ్, తరుమ్, ఆస, తమ్. హః, స-మార-సుశోకేన, అతి-భామ-ఆగతిః, ఆగసా.

సమాసములు

అసాదాభాప్తా = అ-సాద-ఆభా-ఆప్తా

సాదః న విద్యతే యస్య సా అసాదా = సాదము లేనిది, అసాదా.

అసాదా సా భా , అసాదాభా = అసాద ఐన భా, అసాదాభా.

అసాదాభామ్ ఆప్నోతి ఇతి, అసాదాభాప్తా = అసాద ఐన ఆభను పొందువాడు, అసాదాభాప్తా.

గోజః = గో-జః

గవి జాతః, గోజః = (గో)స్వర్గమునందు పుట్టినది, గోజః (పారిజాతము)

సమారసుశోకః = స-మార-సు-శోకః

అధికః శోకః, సుశోకః = మిక్కిలి శోకము, సుశోకః.

మారే సుశోకః, మారసుశోకః = మారునిపట్ల సుశోకము, మారసుశోకః.
మారసుశోకేన సహితమ్, సమారసుశోకమ్ = మారసుశోకముతో కూడినది, సమారసుశోకమ్. (ఇది ఆగః శబ్దానికి విశేషణం)
సమారసుశోకేన – తృతీయావిభక్తి.
అతి-భామ-ఆగతిః
భామస్య ఆగతిః, భామాగతిః = భామముయొక్క ఆగతి, భామాగతిః.
అత్యంతమ్ భామాగతిః, అతిభామాగతిః = మిక్కిలి భామాగతి, అతిభామాగతిః.
అతిభామాగతిః యస్య సః, అతిభామాగతిః = అతిభామాగతి ఎవనికో వాడు, అతిభామాగతిః (కృష్ణః).

అన్వయము:

స-మార-సుశోకేన, ఆగసా, అతి-భామ-ఆగతిః, గదీ, జమ్, గతః. అ-సాద-ఆభా-ఆప్తా, హః, గో-జమ్, తమ్, తరుమ్, ఆస.

అర్థము:

మారః = ప్రద్యుమ్నుడు. భామః=కోపము. ఆగతిః=రాక. సాదః=అవ సానము. ఆభా= కాంతి. ఆప్తా (ఆప్ఌ ధాతువు తృచ్ ) = పొందువాడు. గదీ = గద ఉన్నవాడు, కృష్ణుడు. జః= గెలుపు. హః=హరి. గోజమ్ = స్వర్గమునందు పుట్టినదానిని. ఆస = పొందెను, పట్టుకొనెను.

స-మార-సుశోకేన = ప్రద్యుమ్నుని విషయమున గొప్పశోకముతో కూడిన ,

ఆగసా = (దేవతలు చేసిన) అపరాధమువలన,

అతి-భామ-ఆగతిః = అత్యంతము కోపపు రాక గలవాడైన (ఎంతో కోపము వచ్చిన)

గదీ = గదాయుధుడైన కృష్ణుడు,

జమ్, గతః = గెలుపును పొందెను.

అ-సాద-ఆభా-ఆప్తా, హః = నశించని తేజస్సును పొందు హరి, కృష్ణుడు,

గో-జమ్, తమ్, తరుమ్, ఆస = స్వర్గమునందు పుట్టిన ఆ చెట్టును పొందెను/పట్టుకొనెను.

తాత్పర్యము

ప్రద్యుమ్నుని దేవతలు దెబ్బతీసినందున ఆ అపరాధమునకు మిక్కిలి కోపించిన కృష్ణుడు, దేవతలను గెలిచెను. ఎప్పటికి తగ్గని తేజస్సుగల ఆ హరి, స్వర్గమున పుట్టిన ఆ పారిజాతతరువును పట్టుకొనెను.

కృష్ణుడు కోపంతో దేవతలను గెలిచి, పారిజాతాన్ని అందుకొన్నాడని సారాంశం.

ఇక, తరువాతి శ్లోకంలో, సేతువుమీదగా సముద్రాన్ని దాటుతూ ఉన్న వానరసైన్యానికి రాముడు పాలకుడిగా ఉండటాన్ని అనులోమంలోను, పారిజాతాన్ని కైకొన్న కృష్ణుడి ప్రభావాన్ని విలోమంలోను, చెప్పుతున్నాడు.

27. **వీరవానరసేనస్య త్రాతాభాదవతాహినః**

**తోయధావరిగోయాదస్యయతో నవసేతునా**

ఇది అనుష్టుప్పు.

అనులోమము - రాఘవము:

సేతువుమీదగా సముద్రాన్ని దాటుతూ ఉన్న వానరసైన్యానికి రాముడు పాలకుడిగా ఉండటాన్ని అనులోమంలో చెప్పుతున్నాడు.

పదవిభాగము :

వీర-వానర-సేనస్య, త్రాతా, అభాత్, అవతా, హి, నః, తోయధౌ, అరిగోయాదసి, అయతః, నవసేతునా.

సమాసములు

అరిగోయాదః (స్) = అ-రి-గో-యాదః
రిః = క్షయము.
రిః న యేషామ్ తాని, అరీణి = రి (క్షయము) లేనిది వేనికో అవి, అరీణి (అక్షయాలు).
గావః చ యాదాంసి చ గోయాదాంసి = గోవులు (ఉదకము) యాదస్సులు , గోయాదాంసి.
అరీణి చ తాని గోయాదాంసి, అరిగోయాదాంసి. = అరులైన (అక్షయములైన) గోయాదస్సులు, అరిగోయాదాంసి.
అరిగోయాదాంసి యస్య సః, అరిగోయాదాః = అరిగోయాదస్సులు ఎవనికో వాడు, అరిగోయాదాః.
అరిగోయాదసి - సప్తమీవిభక్తి.
నవసేతుః = నవ-సేతుః

నవః చ సః సేతుః, నవసేతుః = నవమైన సేతువు, నవసేతుః.

నవసేతునా - తృతీయావిభక్తి.

వీరవానరసేనమ్ = వీర-వానర-సేనమ్

వీరాః చ తే వానరాః, వీరవానరాః = వీరులైన వానరులు, వీరవానరులు.

వీరవానరాణాం సేనా, వీరవానరసేనం .

విభాషా సేనాసురాఛాయాశాలానిశానామ్ (2-4-25) .

సేనా-సురా-ఛాయా-శాలా-నిశా, ఈ శబ్దాలతో ముగిసే తత్పురుషసమాసం వికల్పంగా నపుంసకమౌతుంది. కనుక వానరసేనా అన్నా వానరసేనం అన్నా ఒకటే. ఇది విశిష్టరూపం. దాదాపు, ఎవరూ ప్రయోగించి ఉండరేమో!

అన్వయము:

అ-రి-గో-యాదసి, తోయధౌ, అవతా, నవ-సేతునా, అయతః (ఈ ధాతువు-శతృప్రత్యయము), వీర-వానర-సేనస్య, త్రాతా ,( సస్), సః(రామః), అభాత్, హి.

అర్థము:

రిః=క్షయము. గౌః=జలము. యాదః= జలజంతువు. అయతః (ఈ ధాతువు – శతృ ప్రత్యయము-అయస్.) = పోవుచున్నవానియొక్క . అవతా = కాపాడుచున్న దానితో. (అవ ధాతువు శతృప్రత్యయము –అవస్). వీరవానరసేనమ్(పైన చెప్పిన సమాసాంతకార్యమువలన నపుంసకం)=వీరు లైన వానరులయొక్క సేన. అభాత్ (భా ధాతువు – లుఙ్) = భాసించెను.

అవతా, నవ-సేతునా = కాపాడుతూ ఉన్న కొత్త వంతెన మార్గాన,

అ-రి-గో-యాదసి = అక్షయములైన నీరు జలజంతువులు ఉన్న
తోయధౌ = సముద్రమునందు
అయతః (ఈ ధాతువు-శతృప్రత్యయము) = పోవుచున్న
వీర-వానర-సేనస్య = వీరవానరుల యొక్క సేనకు
త్రాతా ( సన్), సః (రామః), అభాత్, హి = రక్షకుడుగా ఉన్న ఆ రాముడు,
ప్రకాశించెను సుమా!

తాత్పర్యము

అప్పుడే కట్టిన వంతెనమీదుగా, ఆ వంతెన (వెళ్ళేవాళ్ళు నీటిలో పడకుండ) కాపాడుతూ ఉండగా, అంతులేని నీరు మరియు నీటి జంతువులును గల సముద్రములో నడచుచున్న వానవీరుల సైన్యమునకు రక్షకుడుగా ఉన్న ఆ రాముడు శోభించెను.
కొత్తగా కట్టిన వంతెనమీదుగా, రాముడి రక్షణలో,వానరసైన్యం సముద్రం దాటిందని సారాంశం.

ఇక, ప్రతిలోమంలో, పారిజాతాన్ని పట్టుకొన్న కృష్ణుడి మహిమను వర్ణిస్తున్నాడు.

**నా తు సేవనతోయస్య దయాగోఽరివధాయతః**

**సహితావదభాతాత్రాస్యనసేరనవారవీ**

ప్రతిలోమము - యాదవీయము:

పారిజాతాన్ని కైకొన్న కృష్ణుడి ప్రభావాన్ని విలోమంలో ఇప్పుడు చెప్పుతున్నాడు.

అంటే, అలాంటి కృష్ణుడు పారిజాతాన్ని పట్టుకొన్నాడు, అని వెనుకకు అన్వయం చేసుకోవాలి.)

పదవిభాగము:

నా, తు, సేవనతః, యస్య, దయా-గః, అరి-వధ-ఆయతః, సః, హి, తావత్, అభాతా, త్రాసీ, అనసేః, అనవారవీ

సమాసములు

దయాగః = దయా-గః

దయాం గచ్ఛతి ఇతి, దయాగః = దయను పొందువాడు, దయాగః.

అరివధాయతః = అరి-వధ-ఆయతః

అరేః వధః, అరివధః = అరియొక్క వధము, అరివధః.

అరివధాయ ఆయతః, అరివధాయతః.

అభాతా = అ-భాతా (భాతా - భా ధాతువు తృచ్ )

భాతి ఇతి, భాతా = భాసించువాడు, భాతా.

న భాతా ఇతి, అభాతా = భాత కానివాడు, అభాతా.

అనసిః = న-అసిః

అసిః యస్య న అస్తి సః, అనసిః = అసి లేనివాడు, అనసిః.

అనసేః - షష్ఠీవిభక్తి.

అనవారవీ

నవః= స్తోత్రమ్.   ఆరవః =శబ్దము, మాట.

నవస్య ఆరవః, నవారవః = నవముయొక్క ఆరవము, నవారవః.
నవారవః అస్య అస్తి ఇతి, నవారవీ = నవారవము ఉన్నవాడు, నవారవీ.
నవారవీ న భవతి ఇతి, అనవారవీ = నవారవి కానివాడు, అనవారవీ.

అన్వయము:

నా, తు, యస్య, సేవనతః, దయా-గః, అరి-వధ-ఆయతః. అ-నవ-ఆరవీ, సః, ( నా), అనసేః, త్రాసీ, అ-భాతా, హి., తావత్. ( సః కృష్ణః పారిజాతం జగ్రాహేతి పూర్వశ్లోకవాక్యేనాన్వయః. )

అర్థము:

నా= నరుడు. గః=పొందువాడు. దయాగః=దయను పొందువాడు. నవః= నుతి. ఆరవః=శబ్దము, మాట. ఆరవీ=ఆరవము కలవాడు. అసిః = కత్తి. అనసిః=అసి లేనివాడు. త్రాసీ=త్రాసముకలవాడు.

సేవనతః = సేవనం ద్వారా
యస్య, దయా- గః = ఎవని దయను పొందినవాడైన
నా, తు = నరుడైతే,
అరి-వధ-ఆయతః = శత్రువధతో సమృద్ధుడౌతాడు.
అ-నవ-ఆరవీ ( నా) = (శ్రీకృష్ణునిగురించి) స్తోత్రరూపమైన శబ్దాలు లేనివాడు (నరుడు),
అనసేః, త్రాసీ = కత్తిలేని శత్రువువలన భయపడినవాడౌతాడు. (ఇక కత్తి

ఉన్నవాడివలనైతే చెప్పాలా!)

అ-భాతా, హి., తావత్ = శోభించడు కదా మరి!

సః = అతడు (అట్టి శ్రీకృష్ణుడు పారిజాతమును గ్రహించెనని వెనుకటికి అన్వయము.)

తాత్పర్యము

సేవలతో ఎవని దయను పొందినవాడు శత్రువులను గెలిచి సమృద్ధుడగునో, ఎవనిగురించి స్తుతులు లేని(చేయని) వాడు నిరాయుధుడైన శత్రువునకైన భయపడుచు నిస్తేజునిగా అగునో, ఆ కృష్ణుడు, (పారిజాతమును గ్రహించెను అని వెనుకటి శ్లోకానికి అన్వయం.)

శ్రీకృష్ణుడు పారిజాతాన్ని గ్రహించాడని సారాంశము.

ఇక, తరువాత శ్లోకంలో, రాముడు రావణవధ చేసి, సీతను తిరిగి పొంది, విభీషణుని కాచి, పూజింపబడటాన్ని అనులోమంలోను - దేవతలను గెలిచి, అందరు స్తుతి చేస్తూ ఉండగా కృష్ణుడు భూమికి తిరిగి రావటాన్ని ప్రతిలోమంలోను చెప్పుతున్నాడు.

28. **హారిసాహసలంకేనాసుభేదీమహితోహిసః**

**చారుభూతనుజోరామోఽరమారాధయదార్తిహా**

ఇది అనుష్టుప్పు.

అనులోమము - రాఘవము:

రాముడు రావణవధ చేసి, సీతను తిరిగి పొంది, విభీషణుని కాచి, పూజింప బడటాన్ని అనులోమంలో చెప్పుతున్నాడు.

పదవిభాగము :

హారి-సాహస-లంకా-ఇన-అసు-భేదీ, మహితః, హి, సః, చారు-భూ-తనుజః, రామః, అరమ్, ఆరాధయత్-ఆర్తి-హా.

సమాసములు

హారిసాహసలంకేనాసుభేదీ = హారి-సాహస-లంకా-ఇన-అసు-భేదీ
హారి చ తత్ సాహసమ్, హారిసాహసమ్ = హారి ఐన సాహసము, హారిసాహసమ్.
హారిసాహసమ్ యస్య సః, హారిసాహసః = హారిసాహసముగలవాడు, హారిసాహసః.
లంకాయాః ఇనః, లంకేనః = లంకయొక్క ఇనుడు, లంకేనః.
అసూన్ భినత్తి ఇతి, అసుభేదీ = అసువులను భేదించువాడు, అసుభేదీ(=ప్రాణనాశనుడు).
లంకేనస్య అసుభేదీ, లంకేనాసుభేదీ.
హారిసాహసః చ లంకేనాసుభేదీ చ సః, హారిసాహసలంకేనాసుభేదీ (=రాముడు)
చారుభూతనుజః = చారు-భూ-తనుజః
భువః తనుజా, భూతనుజా= భువియొక్క తనూజ, భూతనూజ (=సీత).
చార్వీ చ సా భూతనూజా, చారుభూతనూజా = చార్వి ఐన భూతనూజ,

చారుభూతనూజా.

చారుభూతనూజా యస్యాః సః, చారుభూతనూజః = చారుభూతనూజ ఎవరికో

అతడు, చారుభూతనూజః (=రాముడు)

ఆరాధయదార్తిహా = ఆరాధయత్-ఆర్తి-హా

ఆర్తిమ్ హంతి (హరతి) ఇతి, ఆర్తిహా= ఆర్తిని హరించువాడు, ఆర్తిహా.

ఆరాధయతః ఆర్తిహా ఇతి, ఆరాధయదార్తిహా= ఆరాధించువానికి (విభీషణునికి )

ఆర్తిహరుడు (=రాముడు)

అన్వయము:

హారి-సాహస-లంకా-ఇన-అసు-భేదీ, చారు-భూతనుజః, అరమ్, ఆరాధయత్-ఆర్తి-హా, సః (రామః), మహితః, హి.

అర్థము:

హారి=మనోహరము. ఇనః=ప్రభువు. అసుః=ప్రాణము. అరమ్=త్వరగా. హా= హరించువాడు. చారు=అందమైన. భూతనుజా=సీత. మహితః = (దేవతలచేత) పూజింపబడెను.

హారిసాహస-లంకేనాసుభేదీ = మనోహరసాహసముగలవాడును,

లంకాపతిప్రాణవినాశకుడును,

అరమ్ = శీఘ్రముగా

ఆరాధయత్-ఆర్తి-హా = భక్తులాఅర్తీ హరించువాడును,

చారు-భూతనుజః = అందమైన సీతతోకూడినవాడును, ఐన

సః, రామః = ఆ రాముడు,

మహితః, హి = (దేవతలచేత) పూజింపబడెను గదా!

మనోహరమైన విక్రమము గలవాడు, లంకాపతిప్రాణములను హరించినవాడు, తనను కొలిచిన విభీషణును ఆర్తిని త్వరగా తొలగించువాడును, ఐన ఆ రాముడు దేవతలచేత పూజింపబడెను.

రాముడు రావణుడిని చంపి విభీషణుడిని కాచాడని, దేవతలు రాముడిని స్తుతించారని, సారాంశం.

ఇక, దేవతలను గెలిచి, అందరు స్తుతి చేస్తూ ఉండగా, కృష్ణుడు భూమికి తిరిగి రావటాన్ని ప్రతిలోమంలో చెప్పుతున్నాడు.

**హార్తిదాయధరామార మోరా జో నుతభూరుచా**

**సహితోహిమదీభేసు నాకేఽలంసహసారిహా**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

హా, ఆర్తిదాయ, ధరామ్, ఆర, మా-ఉరాః, జః, నుత-భూః, రుచా, సః, హితః, హి, మది-ఇభే, సునాకే, అలం, సహసా, అరి-హా.

అన్వయము:

ఆర్తిదాయ, హితః, మది-ఇభే, సు-నాకే, అలం, సహసా, అరి-హా, జః, నుత-భూః, రుచా, మా-ఉరాః, సః (కృష్ణః), ధరామ్, ఆర, హి. హా (ఆశ్చర్యార్థక మిదం పదమ్.)

సమాసములు

ఆర్తిదః =ఆర్తి-దః

అర్తిమ్ ద్యతి ఇతి, ఆర్తిదః = ఆర్తిని ఖండించువాడు, ఆర్తిదః (ప్రద్యుమ్నః, అథవా సాత్యకిః)

మోరాః = మా-ఉరాః

మా ఉరసి యస్యాః సః, మోరాః = ఉరమునందు మా ఎవనికో వాడు, మోరాః.

నుతభూః = నుత-భూః

నుతస్య (నుతేః, భావే క్తః ) భూః (స్థానమ్) = నుతికి భూమి, నుతభూః (=కృష్ణుడు)

మదీభః = మది-ఇభః

మదః అస్య అస్తి ఇతి, మదీ = మదముగలది మదీ.

మదీ చ సః ఇభః, మదీభః = మది ఐన ఇభము, మదీభః.

మదీభః యస్య సః, మదీభః =మదీభము దేనికో అది, మదీభః (=స్వర్గము)

మదీభే - సప్తమీవిభక్తి.

అర్థము:

దః = ఖండించువాడు.    ఆర = పొందెను.    మా=లక్ష్మి.    జః=విజేత.

నుతమ్ (భావార్థంలో క్త ప్రత్యయం)= నుతి.   భూః = భూమి, స్థానము.

రుక్ = కాంతి, తేజస్సు.    హా =ఆశ్చర్యము!

ఆర్తిదాయ, హితః = యుద్ధార్తిని వారించువానికి(ప్రద్యుమ్ననకు/సాత్యకికి) హితుడైన,

మా-ఉరాః, సః (కృష్ణః) = లక్ష్మీదేవి ఉరమునగల ఆ కృష్ణుడు, ,

మది-ఇభే = మదగజముగలదైన (ఐరావతము ఉన్నది)

సు-నాకే = శోభాయుతమైన స్వర్గమునందు,

అలం, సహసా, అరి-హా = మిక్కిలి శీఘ్రముగా శత్రువులను దెబ్బతీసినవాడై,

జః = విజేత ఐ

నుత-భూః = (దేవతల)స్తోత్రములకు పాత్రుడై,

రుచా = శోభతో

ధరామ్, ఆర, హి = భూమిని చేరెను సుమా!

హా (ఆశ్చర్యార్థక మిదం పదమ్.) = ఆశ్చర్యము!

తాత్పర్యము

లక్ష్మీదేవి ఉరమున ఉన్నవాడును, యుద్ధమున సైదోడుగా ఉన్నవారికి హితుడును, ఐన ఆ కృష్ణుడు, ఐరావతముతో శోభించు స్వర్గమునందు, కడు శీఘ్రముగా శత్రువులను గెలిచి విజయము పొంది, స్తోత్రములకు పాత్రమై, తేజశ్శాలియై భూమిని చేరెను. అది అద్భుతముగా ఉండెను.

కృష్ణుడు దేవతలను గెలిచి భూమికి తిరిగి వచ్చాడని సారాంశము.

ఇక, తరువాతి శ్లోకంలో - రాముడు అయోధ్యకు చేరటాన్ని అనులోమంలోను, కృష్ణుడు ద్వారకకు చేరటాన్ని ప్రతిలోమంలోను, చెప్పుతున్నాడు.

29. నాళికేరసుభాకారాగారాసౌసురసాపికా

రావణారిక్షమేరాపూరాభేజేహినవాముౌనా

ఇది అనుష్టుప్పు.

అనులోమము - రాఘవము:

రాముడు అయోధ్యకు వెళ్ళటాన్ని అనులోమంలో చెప్పుతున్నాడు.

పదవిభాగము :

నాళికేర-సు-భా-ఆకార-అగారా, అసౌ, సు-రస-ఆపికా, రావణ-అరి-క్షమా-ఇరా, పూః, ఆభేజే, హి, న, న, అమునా.

సమాసములు

నాళికేరసుభాకారాగారా = నాళికేర-సు-భా-ఆకార-అగారా

సుష్ఠు భా, సుభా= సుష్ఠైన భా, సుభా (మంచి కాంతి/అందము)

సుభా యస్య తత్ సుభః = సుభ దేనికో అది, సుభః.

సుభాః ఆకారాః యేషామ్ తాని, సుభాకారాణి = సుభాకారములు వేనికో అవి, సుభాకారాణి.

నాళికేరైః సుభాకారాణి, నాళికేరసుభాకారాణి = నాళికేరములచేత సుభాకారములు, నాళికేరసుభాకారాణి.

నాళికేరసుభాకారాణి చ తాని అగారాణి, లాళికేరసుభాకారాగారాణి.

నాళికేరసుభాకారాగారాణి యస్యాః సా, నాళికేరసుభాకారాగారా = నాళికేర సుభాకారాగారములు దేనికో అది, నాళికేరసుభాకారాగారా (అయోధ్య)

సురసాపికా = సు-రస-ఆపికా

సుష్ఠు రసః, సురసః = సుష్ఠైన రసము, సురసః.

సురసస్య ఆపికా, సురసాపికా = సురసముయొక్క ఆపిక, సురసాపికా (శ్రేష్ఠాభిరుచేః జనయిత్రీ = మంచి కోరికను కలిగించునది.).

రావణారిక్షమేరా = రావణ-అరి-క్షమా-ఇరా

రావణస్య అరిః, రావణారిః = రావణునియొక్క అరి, రావణారిః.

రావణారేః క్షమా, రావణారిక్షమా = రావణారికి క్షమ (ఉచిత).= రావణారిక్షమా.

రావణారిక్షమా చ సా ఇరా, రావణారిక్షమేరా = రావణారిక్షమ ఐన ఇర, రావణారిక్షమేరా.

రావణారిక్షమేరా యస్యాః సా, రావణారిక్షమేరా = రావణారిక్షమేర దేనికో అది, రావణారిక్షమేరా (అయోధ్యా).

అన్వయము:

నారికేళ-సు-భా-ఆకార-అగారా, సు-రస-ఆపికా, రావణ-అరి-క్షమ-ఇరా, అసౌ,పూః (అయోధ్యా), అమునా (రామేణ), ఆభేజే, న న, హి.

అర్థము:

సు=మంచి. భా= కాంతి,అందము. రసః=కోరిక, ఆసక్తి. ఆపికా = పొందించునది. క్షమా=యోగ్యా=తగినది. ఇరా = భూమి. పూః = అయోధ్యా. ఆభేజే, న న =

పొందబడెను.     న న అని  జంట నకారములు ప్రకృతార్థమును స్థాపించును.
(ఆభేజే – ఆ+భజ ధాతువు కర్మణి లిట్)

నాళికేర-సు-భా-ఆకార-అగారా = కొబ్బరిచెట్లతో అందమైన ఆకారమున్న ఇళ్ళుగలది,
సు-రస-ఆపికా = బాగుగా ఇష్టమును కలిగించునది,
రావణ-అరి-క్షమ-ఇరా =  రావణుని శత్రువైన రామునికి తగిన స్థలము గలది (=తగినది), ఐం
అసౌ,పూః (అయోధ్యా) =  ఆ అయోధ్యానగరము,
అమునా (రామేణ), ఆభేజే, న న, హి  ఆ రామునిచేత పొందబడకుండలేదు (=పొందబడెను).
రెండు నకారాలు అంటే, ప్రకృతార్థమే.

తాత్పర్యము

కొబ్బరిచెట్లతో సుందరమైన ఇళ్ళు ఉన్నదియు, తనపై ఇష్టమును కలిగించునదియు, రావణుని గెలిచిన రామునికి తగినస్థానమైనదియు, ఐన అయోధ్యానగరమును, ఆ రాముడు చేరెను.
రాముడు అయోధ్యకు తిరిగి చేరాడని సారాంశం.

ఇక, కృష్ణుడు ద్వారకకు వెళ్ళటాన్ని ప్రతిలోమంలో చెప్పుతున్నాడు.

**నామునానహిజేభేరాపూరామేక్షరిణావరా**

**కాపిసారసుసారాగారాకాభాసురకేళినా**

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

న, అమునా, న, హి, జ-ఇభ-ఇరా, పూః, ఆమే (అమ గతౌ ధాతువు కర్మణి లిట్.), అక్షరిణా, వరా, కా, అపి, సార-సు-సౌరాగా, రాకా-భాసుర-కేళినా.

సమాసములు

జేభేరా = జ-ఇభ-ఇరా

జయినః చ తే ఇభాః, జేభాః = జేతలైన ఇభములు, జేభాః.

జేభాః యస్యాః సా, జేభా = జేభములు దేనికో అది, జేభా

జేభా చ సా ఇరా చ , జేభేరా = జేభ ఐన ఇర, జేభేరా.

జేభేరా యస్యాః సా, జేభేరా = జేభేర దేనికో అది, జేభేరా (=ద్వారక. జయిష్ణుగజసహితభూమి.)

అక్షరమ్ అస్య అస్తి ఇతి, అక్షరీ = అక్షరము ఎవనికో వాడు, అక్షరీ (=ధర్మ వంతుడు=కృష్ణుడు.)

సారసుసౌరాగా = సార-సు-సౌర-అగా

సురాణామ్ సంబంధీ, సౌరః = సురలకు సంబంధించినది, సౌరః.

సౌరః చ సః అగః చ, సౌరాగః = సౌరమైన అగము, సౌరాగః.

సారః చ శోభనః చ సః సౌరాగః, సారసుసౌరాగః = సారము, శోభనము ఐన సౌరాగము, సారసుసౌరాగః (పారిజాతము).

రాకాభాసురకేళినా = రాకా-భాసుర-కేళినా

భాసురా సా కేళిః, భాసురకేళిః =భాసుర ఐన కేళి, భాసురకేళిః.
రాకాసు/రాకాభిః భాసురకేళిః యస్య సః, రాకాభాసురకేళిః = రాకలయందు/రాకలతో భాసురకేళి ఎవనికో వాడు, రాకాభాసురకేళిః (కృష్ణః)
రాకాభాసురకేళినా - తృతీయావిభక్తి.

అన్వయము:

జ-ఇభ-ఇరా, సార-సు-సారాగా, కా, అపి, వరా, పూః, అక్షరిణా, రాకా-భాసుర-కేళినా,అమునా, ఆమే, న న, హి.

అర్థము:
జః=గెలుచునది, విజేత. ఇభః=ఏనుగు. ఇరా=భూమి/స్థానము.

సారః=శ్రేష్ఠము. సారః=సురలకు సంబంధించినది. అగః=చెట్టు.
వరా=శ్రేష్ఠమైనది. పూః = పురము. అక్షరమ్ = ధర్మము. అక్షరీ = ధర్మవంతుడు. రాకా = నవయువతి (కొత్తగా ఈడేరిన బాలిక). కేళిః=క్రీడ.
ఆమ (అమ ధాతువు – కర్మణి లిట్ ), నన హి = పొందబడకుండలేదు సుమా (=పొందబడెను). రెండు నకారములు ప్రకృతార్థమును స్థాపించును.

జ-ఇభ-ఇరా = జయించు ఏనుగులున్న స్థానములు గలదియు,
కా, అపి, వరా, పూః (ద్వారకా) = ఒకానొక శ్రేష్ఠమైనదియు, ఐన ద్వారక,
సార-సు-సారాగా = శ్రేష్ఠమైన గొప్ప సురవృక్షము/పారిజాతము గలిగినదై,
అక్షరిణా = ధర్మవంతుడైన,

రాకా-భాసుర-కేళినా = నవయువతులతో లెస్స క్రీడలు గలవాడైన,

అమునా (కృష్ణేన) = ఆ కృష్ణునిచేత,

ఆమే, న న, హి = పొందబడలేదని లేదు సుమా (=పొందబడెను).

రెండు నకారములవలన ప్రతిషేధము పోతుంది.

తాత్పర్యము:

ధర్మశాలియు, నవయువతులతో బాగుగా క్రీడించువాడును, ఐన ఆ శ్రీకృష్ణుడు, గెలుపొందు ఏనుగులకు నిలయమును, శ్రేష్ఠమనోహరమైన దేవవృక్షము (పారిజాతము) గలదియును, అగు ద్వారకాపురమును చేరెను.

కృష్ణుడు ద్వారకను చేరాడని, ఆ ద్వారక పారిజాతంతో శోభించిందని, సారాంశము.

ఇక, చివరి శ్లోకంలో- రాముడు వచ్చిన తరువాత అయోధ్య శోభించిందని అనులోమంలోను, పారిజాతవృక్షస్థాపనతో సత్యభామకు కలిగిన అత్యద్భుతకాంతిసిద్ధిని ప్రతిలోమంలోను, చెప్పుతున్నాడు.

30. సార్గ్యతామరసాగారా మక్షామాఘనభారగౌః
నిజదే పరజిత్యాస శ్రీరామే సుగరాజభా

ఇది అనుష్టుప్పు.

అనులోమము - రాఘవము:

రాముడు వచ్చినతరువాత అయోధ్య శోభించిందని అనులోమంలో చెప్పుతున్నాడు.

పదవిభాగము :

సా, అగ్ర్య-తామరస-అగారామ్, అ-క్షామా, ఘన-భా, ఆర, గౌః, నిజ-దే, పర-జితి, ఆస, శ్రీః, రామే, సుగ-రాజ-భా.

సమాసములు

అక్షామా = అ-క్షామా

క్షామా న భవతి ఇతి, అక్షామా = క్షామ కానిది అక్షామా (=సమృద్ధా)

ఘనభా= ఘన-భా

ఘనా చ సా భా, ఘనభా = ఘన ఐన భా, ఘనభా.

అగ్ర్యతామరసాగారా = అగ్ర్య-తామరస-అగారా

తామరసం అగారం యస్యాః సా, తామరసాగారా = తామరసము దేనికి అగారమో అది, తామరసాగారా (లక్ష్మి).

అగ్ర్యా చ సా తామరసాగారా, అగ్ర్యతామరసాగారా = అగ్ర్య ఐన తామరసాగార, అగ్ర్యతామరసాగారా.

అగ్ర్యతామరసాగారామ్ = ద్వితీయావిభక్తి

నిజదః = నిజ-దః

నిజమ్ ( =ఆత్మానమ్) దదాతి ఇతి, నిజదః = తనను ఇచ్చువాడు, నిజదః.

నిజదే - సప్తమీవిభక్తి.

పరజిత్ = పర-జిత్

పరాన్ జేతా ఇతి, పరజిత్ = పరులను జయించువాడు, పరజిత్

పరజితి - సప్తమీవిభక్తి.

సుగరాజభా = సుగ-రాజ-భా

సుఖమ్ గచ్ఛతి ఇతి, సుగా = సులభముగా చెందునది, సుగా.

రాజ్ఞః భా, రాజభా = రాజుయొక్క భా (తేజస్సు), రాజభా.

సుగా చ సా రాజభా, సుగరాజభా = సుగ ఐన రాజభా, సుగరాజభా.

అన్వయము:

అ-క్షామా, ఘన-భా,సా, గౌః(అయోధ్యాభూమిః),అగ్ర్యామ్,తామరస-అగారామ్, ఆర.
నిజ-దే, పర-జితి, రామే, సు-గ-రాజ-భా, ఆస (అస ధాతువు - లిట్.)

అర్థము:

క్షామా = క్షీణించినది. అక్షామా= క్షీణించనిది. భా=కాంతి. ఘనభా = గొప్ప కాంతి. గౌః = భూమి (అయోధ్యాభూమి). అగ్ర్యా = శ్రేష్ఠ. తామరస-అగారా= లక్ష్మి. ఆర (ఋ గతౌ ధాతువు లిట్) = పొందెను. (భక్తాయ)నిజదః = తనను ఇచ్చువాడు. పర-జిత్=శత్రువులను జయించువాడు.

అ-క్షామా = క్షీణించనదియు,
ఘన-భా = గొప్ప కాంతి(=అందము) గలదియు, ఐన
సా, గౌః(అయోధ్యాభూమిః) = ఆ (అయోధ్యానగర) భూమి,
అగ్ర్యామ్,తామరస-అగారామ్ = ఉత్తమలక్ష్మిని
ఆర (ఋ గతౌ ధాతువు – లిట్ ) = పొందెను.

నిజ-దే, పర-జితి, రామే = తననే ఇచ్చువాడును, శత్రువులను జయించువాడును, అన రామునియందు,

సు-గ-రాజ-భా = సుగమమైన రాజతేజస్సు,

ఆస (అస ధాతువు - లిట్.) = కలిగెను.

తాత్పర్యము

రాముని రాకతో, అందమైనది, వృద్ధితగ్గనిదియు ఐన అయోధ్యానగరము, ఉత్తమసంపదను పొందెను. శత్రువులను నిర్జించువాడు, భక్తులకు తననే ఇచ్చువాడు ఐన రామునియందు, సుఖప్రాప్యమైన రాజతేజస్సు కలిగెను. సమృద్ధమైన అయోధ్యలో రాముడు రాజుగా తేజరిల్లాడని సారాంశము.

ఇక, పారిజాతవృక్షస్థాపనతో సత్యభామకు కలిగిన అత్యద్భుతకాంతిసిద్ధిని ప్రతిలోమంలో చెప్పుతున్నాడు.

భాజరాగసుమేరాశ్రీసత్యాజిరపదేఽజని

గౌరభానఘమాక్షామ రాగాసారమతాగ్ర్యసా

ప్రతిలోమము - యాదవీయము:

పదవిభాగము:

భా, అజర-అగ-సుమ-ఇరా, శ్రీసత్యా-అజిర-పదే, అజని, గౌర-భా, అనఘ-మా, క్షామ-రాగా, సా. అరమత, అగ్ర్యసా.

సమాసములు

అజరాగసుమేరా = అజర-అగ-సుమ-ఇరా,

అజరాణామ్ అగః, అజరాగః = అజరులయొక్క అగము, అజరాగః.

అజరాగస్య సుమాని, అజరాగసుమాని= అజరాగముయొక్క సుమములు,

అజరాగసుమాని.

అజరాగసుమాని ఇరా యస్యాః సా, అజరాగసుమేరా = అజరాగసుమములు దేనికి

స్థానమో అది, అజరాగసుమేరా (ఇది, భా కు విశేషణము.)

శ్రీసత్యాజిరపదమ్ = శ్రీసత్యా-అజిర-పదం

శ్రీమతీ సత్యా, శ్రీసత్యా = శ్రీమతి ఐన సత్య, శ్రీసత్యా.

శ్రీసత్యాయాః అజిరమ్, శ్రీసత్యాజిరమ్ = శ్రీసత్యయొక్క అజిరము, శ్రీసత్యాజిరమ్.

శ్రీసత్యాజిరస్య పదమ్, శ్రీసత్యాజిరపదమ్ = శ్రీసత్యాజిరముయొక్క పదము,

శ్రీసత్యాజిరపదమ్.

శ్రీసత్యాజిరపదే - సప్తమీవిభక్తి.

గౌరభా = గౌర-భా

గౌరా చ సా భా, గౌరభా= గౌర ఐన భా = గౌరభా (ఇది సత్యకు విశేషణము).

అనఘమా = అనఘ-మా

అనఘా చ సా మా, అనఘమా = అనఘ ఐన మా, అనఘమా (ఇది సత్యకు

విశేషణము)

క్షామరాగా = క్షామ-రాగా

క్షామః రాగః యస్యాః సా, క్షామరాగా = క్షామమైన రాగము ఎవరికో ఆమె, క్షామరాగా

(ఇది సత్యకు విశేషణము.)

అగ్ర్యసా = అగ్ర్య-సా

సం= జ్ఞానం.

అగ్ర్యం చ తత్ సం, అగ్ర్యసం = అగ్ర్యమైన సము (జ్ఞానం ), అగ్ర్యసమ్.

అగ్ర్యసమ్ యస్యాః సా, అగ్ర్యసా = అగ్ర్యసము ఎవరికో ఆమె, అగ్ర్యసా (ఇది సత్యభామకు విశేషణము)

అన్వయము:

అజర-అగ-సుమ-ఇరా, భా, శ్రీసత్యా-అజిర-పదే, అజని. సా (సత్యా), గౌర-భా, అనఘ-మా, క్షామ-రాగా, అగ్ర్యసా, అరమత.

అర్థము:

అజరాః=దేవతలు.   అగః=చెట్టు.   ఇరా=భూమి/స్థానము.   భా= కాంతి. అజిరమ్ =అంగణమ్.   పదమ్ = స్థానము.   మా=లక్ష్మి.   క్షామః = క్షీణించి నది, తొలగిపోయినది.   రాగః = మాత్సర్యము.   అగ్ర్యమ్ = శ్రేష్ఠము. సం=జ్ఞానము.   అగ్ర్యసా=శ్రేష్ఠమైన జ్ఞానముగలది.

శ్రీసత్యా-అజిర-పదే = శ్రీగల సత్య పెరటి తావున,

అజర-అగ-సుమ-ఇరా = అమరతరువుయొక్క  పూవులు స్థానముగా గల

భా =  కాంతి (పరిమళశోభ)

అజని =  కలిగెను.

సా (సత్యా) = ఆ సత్యభామ,

గౌర-భా =  (నవీన) గౌరకాంతి కలదియు,

అనఘు-మా = నిర్దోషమైన సంపదగలదియు,

క్షామ-రాగా= నశించిన మాత్సర్యము గలదియు,

అగ్ర్యసా = శ్రేష్ఠమైన జ్ఞానము గలదియును, ఐ,

అరమత = క్రీడించెను/ సుఖించెను.

తాత్పర్యము

దేవవృక్షపు పూవుల పరిమళముల శోభ, సంపద్యుతమైన సత్యభామ ఇంటి అంగణమున వ్యాపించి శోభించెను. ఆ సత్యభామయు, క్రొత్త శోభను పొంది, నిర్దోషమైన సంపదలు గలిగి, తన మాత్సర్యమును వదలి, సరియైన జ్ఞానమును పొంది, సుఖించెను.

పారిజాతపరిమళములతో  కొత్త సొగసును పొందిన సత్యభామ, తన మాత్సర్యాన్ని వదలి, కనువిప్పుకలిగి, శుభసంపదలతో సుఖించిందని సారాంశము.

రాఘవయాదవీయం అనే అనులోమవిలోమకావ్యపు రచనను  నిర్వహించి విజయవంతుడైన కవి వేంకటాధ్వరి, ముగింపువాక్యాన్ని చెప్పుతున్నాడు.

## గ్రంథాంతము

**శ్రీమద్రాఘవయాదవాకృతిధరః శేషాచలోత్తంసకః**

**శ్రేయోహేతు మచీకర త్కృతిమిమాం శ్రీశో మయా దుష్కరామ్,**

**తస్మా దత్ర పవిత్రమాధవకథాస్వాదోన్మిషత్కౌతుకాః**

**సంతః సాధు విచిన్వతాం గుణవిదః శ్లాఘా మమోఘాదరాః**

ఇది శార్దూలవిక్రీడితవృత్తము. గణములు– మ స జ స త త గ . 12 మీద యతి.

గ్రంథాంతంలో కవి సవినయంగా విద్వాంసులకు విన్నపం చేసుకొంటున్నాడు.

శ్రీమత్-రాఘవ-యాదవ-ఆకృతి-ధరః = శ్రీయుతములైన రామకృష్ణరూపాలను తాల్చినవాడు,
శేషాచల-ఉత్తంసకః, శ్రీ-ఈశః = శేషాద్రికి శిరోభూషణము, ఐన విష్ణువు (శ్రీనివాసుడు),
శ్రేయః-హేతుమ్, ఇమామ్, దుష్కరామ్, కృతిమ్ = క్షేమానికి  కారణమైన ఈ దుష్కర కావ్యాన్ని,
మయా, అచీకరత్ = నా చేత చేయించాడు.
తస్మాత్, పవిత్ర-మాధవ-కథా-ఆస్వాద-ఉన్మిషత్-కౌతుకాః = కాబట్టి, పవిత్ర మైన విష్ణుకథలను ఆస్వాదించటానికి కుతూహలం గల వాళ్ళు,
గుణ-విదః, సంతః, = మంచిని గ్రహించగలవారూ ఐన సజ్జనులు,
అత్ర, అమోఘ-ఆదరాః = దీని(ఈ కావ్యం)పట్ల అమోఘమైన ఆదరం కలవాళ్ళై,
సాధు, శ్లాఘామ్, విచిన్వతామ్ = బాగుగా మెచ్చుకోలును కూర్చుదురుగాక!

శేషాచలవాసి ఐన శ్రీనివాసుడు  దయతో నా చేత శ్రేయఃప్రదంగా  వ్రాయించిన ఈ దుష్కరకావ్యాన్ని విష్ణుకథాసక్తులైన భక్తసజ్జనులు బాగా ఆదరించి మెచ్చు కొందురుగాక అని కవి ప్రార్థన.

**ఇతి**

## శ్రీమత్కాంచీనగరనాయక తాతాచార్యభాగినేయ
## వాజపేయ సర్వపృష్ఠాప్తోర్యామాదియాజి శ్రీశ్రీనివాసార్యతనూభవస్య

శ్లేషయమకచక్రవర్తినో రఘునాథార్యయజ్వన స్తనయేన

శ్రీశ్రీనివాసకృపాతిశయ సువిదితనయేన సీతాంబాగర్భసంభవేన

శ్రీమదాత్రేయ వేంకటార్యయజ్వనా

విరచితం, స్వకృతవ్యాఖ్యానసహితం,

రాఘవయాదవీయాఖ్య మనులోమవిలోమకావ్యం

సంపూర్ణమ్.

-*****-

## కొసరు

నా దగ్గర ఉన్న 1890 నాటి పాతముద్రణ పుస్తకంలో లేదుగాని,ఆంగ్లవ్యాఖ్యతో ఉన్న ఒక నూతనముద్రణ పుస్తకంలో చివర ఈ క్రింది పద్యం మూలం మాత్రం ఉన్నది. బహుశః, దీనినికూడ గ్రంథ వ్యాఖ్యానానికి చివర వేంకటాధ్వరే వ్రాసి ఉండవచ్చు.

**మహీసుతాసుహృత్త్వేన ఖ్యాతౌ సత్యానుసారిణౌ ,**

**దీవ్యేతాం హృదయే నిత్యం దేవౌ రాఘవయాదవౌ**

పదవిభాగం:

మహీసుతా-సుహృత్త్వేన (మహీసుత-అసుహృత్త్వేన),ఖ్యాతౌ,సత్య-అనుసారిణౌ (సత్యా-అనుసారిణౌ),దేవౌ, రాఘవ-యాదవౌ, నిత్యం, హృదయే, దీవ్యేతాం.

అర్థం:

1. మహీసుతా-సుహృత్త్వేన = సీతతో/సీతయొక్క ప్రణయంతో (రా)
2. మహీసుత-అసుహృత్త్వేన=నరకునితో/నరకునియొక్క శత్రుత్వంతో (యా)
1. సత్య-అనుసారీ = సత్యమును అనుసరించువాడు (రా)
2. సత్యా-అనుసారీ = సత్యను అనుసరించువాడు. (యా)

సీతాప్రణయంతో ప్రసిద్ధుడైన వాడును, సత్యమును వదలనివాడును ఐన రాఘవుడు ; నరకుని శత్రువుగా ప్రసిద్ధుడైనవాడును, సత్యను అనుసరించు వాడును ఐన కృష్ణుడు ; ఈ ఇద్దరు దేవులు మనస్సులో ఎల్లప్పుడు దీపించు చుందురు గాక!

భావం:

రామకృష్ణులను ఇరువురను ఎప్పుడును నా హృదయములో తలచుకొందునుగాక అని భావం.

-***-

## ఉపసంహారః

**చక్రే రాఘవయాదవీయమితి యః కావ్యం , విలోమం స్వయం**
**వ్యాఖ్యానం చ స వేంకటాధ్వరికవిః కావ్యస్య తస్యాకరోత్.**
**ఏషా తస్య మయా కృతా ఉ౽ం ధ్రవివృతి, ర్గీర్వాణవాగ్వైఖరీ-**
**బోధా౽శక్తధియాం సుఖాయ, కవితావైచిత్ర్యవీక్షార్థినామ్.** 1

రాఘవయాదవీయమ్, ఇతి, = రాఘవయాదవీయమనే,

విలోమమ్ (అనులోమవిలోమమ్),కావ్యమ్, యః చక్రే = విలోమమైన కావ్యాన్ని (అనులోమవిలోమకావ్యాన్ని) ఎవరైతే రచించాడో,

సః, వేంకటాధ్వరికవిః, స్వయమ్ = ఆ వేంకటాధ్వరికవి, స్వయంగా తానే,

తస్య, కావ్యస్య, వ్యాఖ్యానమ్, చ, అకరోత్ = ఆ కావ్యానికి వ్యాఖ్యానాన్ని కూడ చేసాడు.

కవితా-వైచిత్ర్య-వీక్షా-అర్థినామ్= కవితయొక్క వైచిత్ర్యాన్ని చూడగోరినవాళ్ళకు,

గీర్వాణ-వాక్-వైఖరీ-బోధ-అశక్త-ధియామ్, సుఖాయ = సంస్కృతభాష తీరును తెలుసుకో జాలని బుద్ధి గలవాళ్ళకు సౌలభ్యంకోసమని,

తస్య, ఏషా, ఆంధ్ర-వివృతిః = ఆ వ్యాఖ్యానానికి ఈ తెలుగు వివరణము,

మయా, కృతా = నా చేత చేయబడినది.

వేంకటాధ్వరి అనే కవి రాఘవయాదవీయం అనే చిత్రకావ్యాన్ని (అనులోమ విలోమకావ్యాన్ని) వ్రాసి,తానే స్వయంగా దానికి వ్యాఖ్యానాన్ని కూడ వ్రాసాడు. చిత్రకవితను పరిశీలించి ఆనందించాలనే కోరిక ఉన్నప్పటికీ సంస్కృతాన్ని అర్థం చేసుకోలేని వాళ్ళ సౌకర్యంకోసం, ఆ కవి వ్యాఖ్యకు ఈ తెలుగు వివరణను వ్రాసాను.

**శిఖివేదరసాబ్జే ౽బ్దే (1943) , శాకే ప్లవనామ్ని వత్సరే మాఘే**
**శివరాత్రౌ పూర్ణ మిదం , హూణే దృఙ్నయననాకదృశి వర్షే** 2

శాలివాహనశకం 1943 వది ఐన ప్లవ సంవత్సరంలో, మాఘమాసంలో, బహుళచతుర్దశినాడు అంటే, శివరాత్రినాడు, ఇది పూర్తి ఐంది.

**ఆంధ్రః కుత్ససగోత్రో, జోగాంబాసుబ్బరాయయోః పుత్రః**

**నందవరవిప్రవంశ్యో, మార్కణ్డేయప్రసాదనామా ऽహమ్**

నేను, తెలుగువాడను. కుత్సగోత్రం వాడను. నందవరశాఖ బ్రాహ్మణుడను. జోగమ్మ సుబ్బారావుల కొడుకును. నన్ను మార్కండేయప్రసాద్ అంటారు.

**ఇది**

**శ్రీవేంకటాధ్వరి రచించిన**

**రాఘవయాదవీయం అనే అనులోమవిలోమకావ్యానికి**

**కవి స్వయంగా తానే చేసిన వ్యాఖ్యకు,**

**భాగ్యనగరనివాసి మార్కండేయప్రసాద్ వ్రాసిన**

**తెలుగు వివరణము.**

**ప్లవ మాఘ బహుళ చతుర్దశి. శివరాత్రి**

**01. 03. 2022.**

**-*****-**

## రాఘవయాదవీయంలో వాడిన

## ఏకాక్షరపదాలు, విశిష్టశబ్దాలు , ధాతువులు .

### ఏకాక్షరపదాలు

శ్రీః =లక్ష్మి. 1, 2, 3, 5.

అత్ (అత ధాతువు శత్రంతము)= పొందువాడు. 16.

ఈట్ = అధిపతి. 22.

కం= నీరు 2, 7, 10.

కం= సుఖము. 6, 7, 10.

గః = పోవువాడు./ పొందునది. 18, 19, 27, 30.

గీః = వాక్కు 5, 13, 14, 21.

గౌః = భూమి 6, 18, 19, 26, 30.

గౌః = వాక్కు. 13.

గౌః = జలము 27.

ఘః = ఘోరుడు 20.

జః = విజయము 26.

జః = విజేత 28, 29.

జః,జా, జమ్ = పుట్టినది. 6, 25, 26.

జిత్ = గెలుచు వాడు. 30.

జుః = కీర్తి 23.

జుః = యుద్ధము. 22.

జ్యా = భూమి. 2.

దః/దా/దమ్ = ఇచ్చునది 6, 10, 11, 12, 15, 16, 18, 30.

దః/దా/దమ్ = ఖండించునది. 10, 11, 14, 18, 25, 28, 30.

దా= క్షాంతి 13, 21, 22.

దోః = బాహువు. 18.

ద్యౌః = స్వర్గము 14, 18.

ద్రుః = వృక్షము 16.

ధీః =మనసు. 1, 10, 12, 22.

ధూః = భారము.

నా = నరుడు. 6, 27.

పః = కాపాడువాడు. 22.

పరా =ఉత్తమ . 25.

పాః = తాగువాడు. 20.

పూః = పురము. 2, 29.

భా = కాంతి. 2, 6, 10, 14, 22, 23, 24, 25, 29, 30.

భాః = కాంతి. 4, 7, 11, 12, 22, 23, 24.

భాస్, భాత్, = ప్రకాశించువాడు. 12, 14.

భూః = భూమి. 2, 7, 9, 18, 28.

మా = లక్ష్మి. 1, 6, 7, 17, 26, 28, 30.

భూయః = భూమికి పోవునది 19.

యస్ = పోవుచున్నవాడు. 5.

యాస్ = పోవుచున్నవాడు. 13.

రం= తీక్ష్ణము 13, 20.

రం= తల 25.

రః (రా దానే) = ఇచ్చునది 7.

రాః (రై) = ధనము. 2, 16, 20, 21.

రాట్ 25.

రాత్ = ఇచ్చువాడు 19.

రిః = క్షయము 27.

రుక్ = కాంతి. 22, 28.

వ = వలె. 11, 14.

వా= వలె. 9.

విః= ఆకాశము 24.

విః = పక్షి 24.

సం = జ్ఞానము 30.

స్థః = ఉన్నది 3.

హాః = హరి. 11.

హా= హరించువాడు. చంపువాడు. 15, 16, 19, 21, 28.

హ్రీ = సిగ్గు. 11, 12.

## కొన్ని విశిష్టశబ్దాలు

అకం= దుఃఖము 17,

అగః = కొండ 2,

అగః = చెట్టు, 14,

అగ్ర్యా = మొట్టమొదటిది, శ్రేష్ఠము. 2, 29,

అనసిః = కత్తి లేనివాడు. 27,

అపారకమ్ = అపారమ్ = 17,

అనమ్ = ప్రాణనమ్, శక్తి. 18,

అర్యః = భర్త. 2,

అవిః = కాంతి. 18,

అవిః = కొండ. 18,

ఆగః = పాపము, అపరాధము. 2,12,. 16, 17,

ఆజిః = దశరథుడు. 2.

ఆధుతిః = ఖండనము. 13,

ఆననకమ్=ఆననమ్ = ముఖము. 10,

ఆపికా = పొందించునది 29,

ఆప్తా = పొందువాడు 26,

ఆభా = కాంతి. 1, 6, 14, 15, 24, 26,

ఆమః = రోగమ్ము=దుః ఖము. 10,

ఆయోధ్యమ్ = అయోధ్యాసంబంధి. 1,

ఆరమ్ = అరుల సమూహము. 13,

ఆలోకః = తేజస్సు. 19,

ఆవికా = కాపాడునది. 6,

ఆసః = నిరసనము. 11,

ఆసనమ్ = అరుగు 3, 9,

ఆహతమ్ = దెబ్బ 24,

ఇతః/ఇతా/ఇతమ్ = పొందబడినది . 1, 2, 9, 23,

ఇద్ధం= సమృద్ధము 10,

ఇనః = ప్రభువు. 4 6, 28,

ఇనః = భర్త 21,

ఇరా = భూమి/స్థానము. 2, 7, 10, 29, 30.

ఇరా = వేదము, వాక్కు. 18,

ఇరా – కల్లు . 20,

ఉమా = పసుపు. 10,

ఉమా = కీర్తి. 19,

ఊనమ్ = తక్కువైనది. 12,

ఏకః = ముఖ్యము. 10,

ఏనః (స్) =15, 21,

ఐక్యమ్ = మైత్రి 22,

గంధః = లేశము. 14,

గ్రహః = బంధనము 20,

త్రాతం= రక్షణము. 4,

దరః = భయము.

దవః = దావాగ్ని. 10,

దవః = వనము. 12,

దారు = చెట్టు.

దేవాలయకమ్ = స్వర్గము. 21,

ధామ = తేజస్సు 2, 4,

నవః = నుతి 27,

నుతమ్ =నుతి 28,

నృతా = నరత్వము. 6,

నేమః = అవధి 4,

పాతా = రక్షించువాడు. 17,

పోతః = కొడుకు. 9,

ప్రకాండః = ప్రశస్తము 15,

భామః = కోపము 26,

భాతా = శోభించునది. 9,

భామః = సూర్యుడు 3,

భీతం= భయము 5,

భూసురకః=భూసురః =బ్రాహ్మణుడు. 3,

మధ్యమా = మూడవది. 9

మహః = ఉత్సవము. 4, 10,

యాదః = జలజంతువు 27,

రమః = రమణుడు. 18,

రవివంశకః=రవివంశః . 18.

రసః = సంతోషము. 18,

రసః = కోరిక 29,

రసా = భూమి. 6, 9, 11, 12,

రాతమ్ =ఈయబడినది. 6,

రాతా = దాత. 4, 24,

రుజా =పీడ 25,

రోపః = బాణము. 25.

లవః = ఛేదనము 21,

వానరసేనమ్ = వానరసేన 27,

వాసః = నివాససౌధము.

విగ్రా = ముక్కు లేనిది. 18,

వియాతా = ధీరురాలు/జంకనిది.

విషమ్ = నీరు 16,

వృతమ్ = మూయబడినది. 10,

వేదయానః = గరుడవాహనుడు. కృష్ణుడు.

సత్ = మంచిది. 10,

సహః = సహించువాడు 25,

సావః = సవస్య సంబంధీ. 2.

సావాశః =దేవత 2,

హాతా = వదలుకొనువాడు . 5,

హానకమ్ = హానమ్ = హాని. 22.

హ్రీతః / హ్రీతా = సిగ్గుపడ్డవాడు. 11, 12.

## క్రియాపదాలు

అగాత (గా గతౌ) = చేరెను. 13,

ఆజత్ = తెలిసికొనెను. 13,

అభాత్ =ప్రకాశించెను.26,

ఆత = చేరెను. 21,

ఆప =పొందెను. 6, 23,

అమ =చేరెను. 5,

ఆమే =పొందెను/చేరెను. 29

ఆర ( ఋ గతౌ )= చేరెను. 1, 11, 14, 16, 20, 25, 28, 30,

ఆరత్ = చేరెను.16,

ఆవ = కాపాడెను. 24,

ఆస = (=ఉండెను. అనే అర్థంలో అవ్యయం) 4, 15,

ఆస = తీసుకొనెను 6, 26,

ఆస = చేరెను . 17,

ఆస = దీపించెను 21,

ఇతి శ్రీః

-*********-